

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 287

శనివారం 1-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



శ్రీలంక గట్టెక్కింది

సూపర్ సిక్స్‌లో నెదర్లాండ్స్‌పై గెలుపు


వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్ - 13లో



రెండో రోజు రికార్డుల హోరు

సెన్సెక్స్ లాభం 893 పాయింట్లు

నిఫ్టీ 216 పాయింట్ల పెరుగుదల - 13లో



కేంద్ర ఆర్డినెన్స్‌పై స్టే ఇవ్వండి

ఢిల్లీ పరిపాలన సర్వీసులపై నియంత్రణ కోసం కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌పై స్టే ఇవ్వాలని ఆప్ ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది.

వివరాలు 6లో ▸



ఆసియా కబడ్డీ చాంప్ భారత్

పురుషుల కబడ్డీ ఆసియా చాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్ 42–32తో ఇరాన్‌పై ఘన విజయం సాధించింది.

వివరాలు 13లో ▸

తోడు దొంగలు దొరికారిలా..

చంద్రబాబు, నారాయణ క్విడ్ ప్రో కో బట్టబయలు

బాబు కరకట్ట నివాసం అటాచ్‌మెంట్‌కు అనుమతి

- నారాయణ కుటుంబ సభ్యుల ప్లాట్లు, రూ.1.92 కోట్ల బ్యాంకు ఖాతాలు కూడా..
- ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ
- అమరావతి పేరిట టీడీపీ ప్రభుత్వం భారీ భూబాగోతం
- సీడ్ క్యాపిటల్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు
- క్విడ్ ప్రో కో లో భాగంగానే చంద్రబాబుకు కరకట్ట నివాసం
- నారాయణ కుటుంబ సభ్యులకు అమరావతిలో ప్లాట్లు
- సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా బట్టబయలు

10లో



'నీకు ఇది ఇస్తున్నా.. నాకేమిస్తావ్.' అంటూ గత ప్రభుత్వ పెద్ద ఉండటానికి ఉద్దరగా తీసుకున్న ఇల్లే ఇప్పుడు ఆయన్ను దోషిగా వేలెత్తి చూపుతోంది. అట్టే.. ఇందులో కుంభకోణం ఏముందని నిన్నటి దాకా చిలక పలుకులు పలికిన వారిప్పుడు బెంబేలెత్తుతున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఉంటున్న కరకట్ట నివాసం క్విడ్ ప్రో కో కిందకు వస్తుందని ఏసీబీ న్యాయస్థానం జప్తుకు ఆదేశించడం గత సర్కారు భూ దోపిడీని బహిర్గతం చేసింది.

ఫ్యాక్ట్ చెక్

ఇది పత్రికా..! బాబు కరపత్రికా!!



- అబద్ధాలతో చెలరేగిపోయిన 'ఈనాడు'.. మాచర్లపై భయాలు రేకెత్తించేలా అబద్ధాలు
- టీడీపీ హామీల్ని వైఎస్సార్‌సీపీవిగా చెప్పిన తీరు.. వాటిని అమలు చేయలేదంటూ దుష్ప్రచారం
- శ్వేతా చౌదరి.. స్వాతిరెడ్డిగా ఎందుకు మారింది?.. అక్రమాలు తేలినా కులాలు చూసి అరెస్టు చేయాలా?
- రికార్డు స్థాయిలో రైతులకు బీమా పరిహారం ఇస్తున్నా మీ కంటికి కనపడదా?

2లో

రామోజీ దుర్మార్గపు రాతలపై 'ఫ్యాక్ట్ చెక్' కథనాలు

ఫ్రాన్స్‌లో ఆగని నిరసనలు

- కార్లు, ప్రభుత్వ భవనాలకు నిప్పు
- 667 మంది ఆందోళనకారుల అరెస్ట్
- పారిస్ శివారు ప్రాంతాల్లో కర్ఫ్యూ

6లో

సెంథిల్ బాలాజీ డిస్మిస్

ఉత్తర్వులు వెనక్కి

- తమిళనాడు గవర్నర్ యూ టర్న్
- కేంద్ర హోంశాఖ హెచ్చరికలతో ఉత్తర్వులు వెనక్కి

10లో

సాయం సంధ్య వేళ.. అంతవరకు ఇళ్లలోనూ, ఉద్యోగ వ్యాపకాలతో బిజీగా గడిపిన ప్రజలు కాస్త కులాసాగా గడిపేందుకు నగర వీధుల్లోకి రాగానే ఘుమఘుమలాడుతూ.. చవులూరించే పరిమళాలు ఆకర్షిస్తుంటాయి. రా.. రమ్మని ఆహ్వానిస్తుంటాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రధాన కూడళ్లలో కొలువుదీరే వాహనాలే ఈ ఘుమఘుమలకు కేంద్రాలు. శుచికి, శుభ్రతకు ప్రతీకలుగా నిలిచే ఈ వాహనాలు సంచార తినుబండారాల నిలయాలు. పూర్ణం బూరెలు వంటి సంప్రదాయ పిండి వంటలతో పాటు.. మష్రూమ్ రైస్, ఫ్రైడ్ రైస్ వంటి ఆధునిక ఆహార పదార్థాలతో కనువిందు చేస్తుంటాయి. చిత్రం ఏమిటంటే.. నగరంలో ఉన్న ఈ తరహా సంచార విక్రయశాలలన్నింటిలోనూ ఒకే రకమైన పదార్థాలు లభిస్తాయి. నగరంలో మూడు చోట్ల ఉన్న వంటశాలల్లో ఆహార పదార్థాలు తయారు చేసి.. బ్యాటరీ వాహనాల్లో సర్ది రద్దీ కూడళ్లకు తరలించి సరసమైన ధరలకు విక్రయిస్తారు. ఈ ఆహార వ్యాపారం ద్వారా వందల మంది ఉపాధి పొందుతున్నారు.

ఆటో ఆతిథ్యం: నగరంలో ఆహార పదార్థాల విక్రయం



చక్రాలపై సంప్రదాయ ఘుమఘుమలు

శ్రీకాకుళం డెస్క్

సాయంత్రం నాలుగు దాటితే చాలు.. ఘుమఘుమలు వెదజల్లుతూ మూడు చక్రాల వాహనాలు నగరం నలువైపులకు బయల్దేరతాయి. కొన్నైతే హైవేపై ప్రయాణించి సమీపంలోని కూడళ్లకు చేరుకుంటాయి. పప్పు బూరెలు, కుడుం బూరెలు, కొబ్బరి బూరెలు, నాలుగైదు రకాల రైస్ ఐటమ్స్, పెరుగు వడ, జున్ను, పులిహోర వంటి వంటకాలే మెనూలో చోటు దక్కించుకున్నాయి. రాత్రి తొమ్మిదిన్నర వరకు భోజన ప్రియుల ఆకలి తీర్చి మళ్లీ ఇంటి బాట పడుతున్నారు విక్రయదారులు. ఈ ఆటో ఆతిథ్యానికి నగరంలో రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.

వంటా వార్పు ఎక్కడ..

శ్రీకాకుళం నగరంలో ప్రధానంగా మూడు ప్రాంతాల్లో వంటకాల తయారీ కేంద్రాలున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, మారుతీ థియేటర్, జిల్లా పరిషత్ సమీపంలో ఉదయం 9 గంటల నుంచి వంటకాల తయారీ ప్రారంభమవుతుంది. మూడు కేంద్రాల్లోనూ సుమారు 100 మంది వరకు మహిళలు ఉపాధి పొందుతున్నారు. వీరిలో ఒంటరి మహిళలు.. కుటుంబం భారం మోసే వారికే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

- నగరం నలుమూలలకూ ఆటోల్లో వనంధైన వంటకాలు తరలింపు
- అందుబాటు ధరల్లో విక్రయాలు
- బ్యాటరీ వాహనాలను అవసరానికి తగినట్లుగా తీర్చిదిద్ది వినియోగం
- మహిళలు, యువతకు ఉపాధి మార్గం

అందరూ పాకశాస్త్ర ప్రవీణులే..

సంప్రదాయ వంటలు తయారు చేయడం అందరివల్లా కాదు. పలిహోరా, బొబ్బట్లు, బూరెలు, వడలు లాంటివి చేయాలంటే మాత్రం ప్రావీణ్యం తప్పనిసరి. ఇక్కడ వంటశాలల్లో ఉండే మహిళల్లో అధికశాతం గరిటె తిప్పి అద్భుతమైన రుచితో వంటకాలను సిద్ధం చేయడంలో సిద్ధహస్తులు. వీరు తయారు చేసే వంటలను బట్టే వీరికి వేతనం ఉంటుందని చెబుతున్నారు వ్యాపారులు.

పర్యావరణ హితంగా..

ఈ విక్రయాలకు వినియోగించే ఆటోలు పూర్తిగా పర్యావరణ హితమైనవి. బ్యాటరీ వాహనాలనే ఆహారం విక్రయాల కోసం వినియోగిస్తున్నారు. ఓ దుకాణం మాదిరిగా తీర్చిదిద్ది అవసరమైన లైటింగ్, వాటర్ ట్యాంక్, మైక్రో ఒవెన్ ఇతర సదుపాయాలను అందులో కల్పిస్తున్నారు.

నగరంలో ఫుడ్‌ను విక్రయించే ఆటోలు	18 వరకు
నగరంలో వంటశాలలు	3
ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న మహిళలు	100 మంది

ధరల మాటేమిటి

- రైస్ ఐటెమ్స్ క్వాంటిటీని బట్టి ధరను నిర్ణయించారు. కప్పు బిర్యానీ రూ.30 నుంచి విక్రయిస్తున్నారు. సాంబారు వడ, పెరుగు వడ ధర రూ.20
- బాదం జున్ను రూ.30, బెల్లం, పంచదార జున్ను రూ.25కు విక్రయిస్తున్నారు.


రోజువారీ శుభ్రం చేసుకోవాడానికి వీలుగా లోపలి భాగాన్ని పూర్తిగా స్టెయిన్ లెస్ స్టీల్‌తో రూపొందించారు.

ఒక్కో వాహనం రూ.3 లక్షలు

బ్యాటరీ వాహనాన్ని కొనుగోలు చేసి దాన్ని అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి రూ.3 లక్షలు ఖర్చవుతోందని వ్యాపారులు చెబుతున్నారు.7 గంటలు చార్జింగ్ చేస్తే 4 గంటలు పాటు ఉంటుంది. ఫుడ్ బిజినెస్ కావడంతో పర్యావరణ హితమైన వాహనాలకు ప్రాధాన్యమిచ్చామని చెబుతున్నారు.

ఏవోబీలో వెలుగు దివ్వెలు

జల విద్యుత్ ఉత్పత్తిలో జిల్లా దూసుకుపోతోంది. రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన ఈ జిల్లాలో ఇప్పటికే పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 1024 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. తాజాగా మరో మూడు జల విద్యుత్ ప్రాజెక్టులు వీటి చెంతన చేరనున్నాయి. ఏవోబీలోని మత్స్యగెడ్డపై నిర్మించనున్న ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల జెన్‌కో అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది. త్వరలోనే వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.



మాచ్‌ఖండ్‌లో జల విద్యుత్ ఉత్పత్తి అనంతరం బలిమెల జలాశయానికి వెళ్తున్న మత్స్యగెడ్డ (మూడు జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించనున్న మత్స్యగెడ్డ ఇదే)

- మత్స్యగెడ్డపై మూడు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం
- ఆంధ్రా– ఒడిశా జెన్‌కో అధికారుల మధ్య ఒప్పందం
- పూర్తయితే అదనంగా 98 మెగావాట్ల ఉత్పాదన
- స్థానికంగా గిరి యువతకు ఉపాధి అవకాశాలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మత్స్యగెడ్డపై మూడు జల విద్యుత్ కేంద్రాలు నిర్మించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు కార్యాచరణ రూపొందించారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి బలిమెల వెళ్లే మత్స్యగెడ్డ నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది. దీనిపై నిర్మించే జలవిద్యుత్ కేంద్రాల వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని జెన్‌కో అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

- ఎన్నో ఏళ్లుగా నూతన జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి సర్వేలు, చర్చలతో సరిపెడుతూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి జోలాపుట్టు, డుడుమ జలాశయాల నీటిని వినియోగించుకొని విద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. విద్యుత్ ఉత్పాదన అనంతరం విడుదల అయ్యే నీరు మాచ్‌ఖండ్ నుంచి బలిమెల జలాశయానికి వెళ్తుంది. మళ్లీ ఈ నీటిని వినియోగించుకునేలా మూడు జలవిద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నారు.

అపరస్పర అంగీకారం..

మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం సమీప ప్రాంతాల్లో మూడు జల విద్యుత్ కేంద్రాలు నిర్మించాలని ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో), ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్(ఓహెచ్‌పీసీ)లు పరస్పరం అంగీకారానికి వచ్చాయి. 2020 అక్టోబరు 23లోగా ఈ విద్యుత్ కేంద్రాలను సంయుక్తంగా నిర్మించాలని ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా గత నెల ఒడిశాలోని భువనేశ్వర్‌లో ప్రాజెక్టు పరిపాలనా కమిటీ (పీఏసీ) ప్రత్యేక సమావేశం నిర్వహించింది. రెండు రాష్ట్రాల ఇంధన శాఖ అధికారులు, ఏపీజెన్‌కో, ఓహెచ్‌పీసీ ప్రతినిధులతో నూతన విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై చర్చించి అంగీకారానికి వచ్చారు. మూడు విద్యుత్ కేంద్రాల ద్వారా 98 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సాధ్యమవుతుందని జెన్‌కో అధికార వర్గాలు తెలిపాయి.

అత్యాధునిక పరిజ్ఞానంతో..

మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం పూర్తిగా విదేశీ పరిజ్ఞానంతో అప్పటి పరిస్థితుల దృష్ట్యా నిర్మాణం జరిగింది. ఇప్పటికీ ఆలనాటి పద్ధతులు ఉపయోగిస్తూనే విద్యుత్ ఉత్పాదన చేస్తూ వస్తున్నారు.దీంతో తరుచూ మాచ్‌ఖండ్‌లో జనరేటర్లు మరమ్మత్తులకు గురు కావడం ప్రాజెక్టు సిబ్బంది అవస్థలు పడుతూ ఉండేవారు.అలాంటి ఇబ్బందులకు స్వస్తి చెప్పాలని ప్రాజెక్టు అధికారులు ముందస్తు ఆలోచన చేశారు.దీంతో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ కేంద్రాలకు మాత్రము ఇప్పుడు ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకొని నిర్మాణాలు చేయనున్నారు.దీంతో విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా నిత్యం విద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. దీనికితోడు విద్యుత్ ఉత్పాదన స్థాయి సైతం పెరిగే ఆస్కారం ఉందని అధికారులు భావిస్తున్నారు.



మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పాదన అనంతరం మత్స్యగెడ్డలో విడుదల అవుతున్న నీరు

యువతకు ఉపాధి..

ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించనున్న నూతన విద్యుత్ కేంద్రాలు పూర్తయితే సరిహద్దులో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. మాచ్‌ఖండ్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సరిహద్దు ప్రాంతంలో నిరక్షరాస్యులు అధికంగా ఉండడంతో ప్రాజెక్టులో ఎటువంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందలేక పోయారు. అక్షరాస్యత శాతం పెరిగింది. నిరుద్యోగ యువత ఎంతో మంది స్థానికంగా ఉపాధికోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు నిర్మాణం చేపట్టబోయే ప్రాజెక్టుల వల్ల తమ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్న ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.

క్లుప్తంగా...

4న సీఎం జగన్ చిత్తూరు జిల్లా పర్యటన

- అమూల్ యూనిట్‌కు భూమి పూజ
- బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 4న చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు చిత్తూరు చేరుకుంటారు. ఈ సందర్భంగా చిత్తూరు విజయా డెయిరీ వద్ద అమూల్ సంస్థ ఏర్పాటు చేసే నూతన యూనిట్‌కు భూమి పూజ చేస్తారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అలాగే క్రిస్టియన్ మెడికల్ కళాశాల (సీఎంసీ) ఆవరణలో 300 పడకల ఆస్పత్రికి భూమి పూజ చేస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

62.99 లక్షల మందికి రూ.1,735.36 కోట్లు

- నేటి తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ
- ఒకరోజు ముందే సచివాలయాల వారీగా బ్యాంకుల్లో నిధుల జమ

సాక్షి, అమరావతి: జూలై ఒకటో తేదీ (నేడు) తెల్లవారుజాము నుంచే రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 62,99,376 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళలు, వివిధరకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.1,735.36 కోట్లను విడుదల చేసింది. పంపిణీకి ఒకరోజు ముందే ఆ డబ్బును లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా సచివాలయాల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. శుక్రవారం సాయంత్రానికల్లా దాదాపు అన్ని సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసి, వలంటీర్ల వారీగా అందజేసినట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి డబ్బులు అందజేస్తారని చెప్పారు. పింఛన్ల పంపిణీకి ఏవైనా అవాంతరాలు ఏర్పడితే అప్పటికప్పుడే పరిష్కరించేందుకు అన్ని జిల్లాల డీఆర్‌డీఏ పీడీ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హామీలిచ్చిందేమో బాబు అమలు కాలేదంటూ రుబాబు

2014 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో 650 హామీలు

- గెలిచాక చెత్తబుట్ట పాలు... టీడీపీ వెబ్‌సైట్లోనూ మాయం
- అందుకే 2019లో అత్యంత ఘోరంగా ఓడించిన ప్రజలు
- రెండు పేజీల మేనిఫెస్టోతో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం
- దాన్ని తుచ తప్పకుండా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్
- ఇటీవల ప్రజలకు ఆ మేనిఫెస్టో ఇచ్చి మార్కులు వెయ్యమని అడిగిన తీరు
- 98.5 శాతం హామీలు అమలు చేసినట్లు నిర్ధారణ... దాంతో ఎల్లో ముఠా కుట్రలు
- తమ హామీలను వైఎస్సార్‌సీపీకి అంటగడుతూ అమలు కాలేదని దుష్ప్రచారం


జగన్ ఇచ్చిన 650 హామీల్లో అమలైంది 10 శాతమే

సాక్షి, అమరావతి :


☛ కళ్లార్పకుండా అబద్ధాలు అలవోకగా చెప్పేసే చంద్రబాబు... దాన్ని అంతే లాఘవంగా రాసేసే రామోజీరావు... మసాలా వేసి మరీ ప్రచురించే రాధాకృష్ణ!. ఏమైంది వీళ్లకి? అబద్ధాల్లోనూ అంత గందరగోళమేల?

☛ వైఎస్సార్ సీపీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 25 శాతమే అమలు చేశారంటూ టీడీపీ ఓ పుస్తకం వేసింది. ఆ వార్తను వేస్తూ.. 650 హామీల్లో 10 శాతమే నెరవేర్చారని రాసింది 'ఈనాడు'. ఇక రాధాకృష్ణ సరేసరి. 97.5 శాతం హామీలు అమలు కాలేదని రాసిపడేశాడు. వీళ్లు ముగ్గురూ కూడబలుక్కుని ఒకేరోజు ఒకే అబద్ధం చెప్పినా... అంకెల్లో ఎందుకింత తేడా? ఎక్కడ తేడా కొట్టింది?

☛ వాస్తవానికి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు రెండు పేజీల మేనిఫెస్టోను విడుదల చేసింది. దాన్లోని హామీల్లో 98.5 శాతం అమలు చేసింది. ఇటీవల ఆ మేనిఫెస్టోను ధైర్యంగా ప్రజలకు ఇచ్చి... దీన్లో అమలు కాలేనివి ఏమైనా ఉంటే చెప్పండని.. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా అడిగింది. 98.5 శాతం హామీలు అమలైనట్లు నిర్ధారించింది ప్రజలే!. అదీ.. వైఎస్సార్ సీపీ నిజాయితీ. వైఎస్ జగన్ నిబద్ధత.

విచిత్రమేంటంటే... 50 పేజీలతో 650 హామీలు ఇచ్చింది 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ!!. గెలిచాక దాన్ని చెత్తబుట్టలో పడేశారు చంద్రబాబు. తెలుగుదేశం పార్టీ వెబ్‌సైట్లో సైతం మేనిఫెస్టో తొలగించేశారు. దాన్ని 'ఈనాడు' ఏనాడూ ప్రశ్నించనే లేదు. అలాంటి చంద్రబాబు... తానిచ్చిన 650 హామీలను వైఎస్సార్ సీపీ ఇచ్చినట్లుగా చెబుతూ... అందులో 10 శాతమే అమలయ్యాయని బొంకుతుంటే... వాటికి చిలవలు పలవలు జోడించి దుష్ప్రచారం చేయడానికి సిద్ధమయ్యారు డబుల్ ఆర్... రామోజీ, రాధాకృష్ణ. వీళ్లదసలు పాత్రికేయమేనా? పాఠకులు తామేం రాసినా చదువుతారనే బరితెగింపా లేక ఎన్నిచేసినా చంద్రబాబును జనం నమ్మటం లేదన్న నైరాశ్యమా? వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై టీడీపీ ఎందుకిన్ని అబద్ధాలు చెబుతోంది. దేశం మొత్తమ్మీద... ఇచ్చిన హామీల్లో 98.5 శాతం అమలు చేసింది ఒక్క వైఎస్ జగన్ కావటమేనా? నిబద్ధత గల నేతగా జనం నీరాజనాలు పడుతున్నారు కనక... ఏదో ఒకరకంగా తలా ఒక అబద్ధం చెప్పి జనంలో జగన్ ప్రతిష్ఠను తగ్గించాలన్న కుట్రా? ఈ కాలంలో కూడా ఇలాంటి కుట్రలు నెరవేరుతాయా?

విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో తాను ఇచ్చిన 650 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయని చంద్రబాబు.. ఆ పాపాన్ని సీఎం వైఎస్ జగన్‌పై రుద్దే దుస్సాహసానికి దిగారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి ప్రజలను నమ్మించే తన పాత కుట్రనే మళ్లీ అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే హామీల్లో పది శాతం కూడా సీఎం వైఎస్ జగన్ అమలు చేయలేదంటూ పచ్చి అబద్ధాలతో అచ్చేసిన 'టీడీపీ వాస్తవపత్రం'ను గురువారం విడుదల చేశారు. వాటినే ఎల్లో మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయించడానికి నానాపాట్లు పడుతున్నారు. వాస్తవానికి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి


అమలుకాని హామీలు 97.5%
వైసీపీ మేనిఫెస్టోపై టీడీపీ వాస్తవ పత్రం
ఈసారి రాష్ట్రం గెలవాలి

అధికారంలోకి వచ్చాక జరిగిన 1996 లోక్‌సభ ఎన్నికల నుంచి ఇప్పటివరకూ ఎన్నడూ కూడా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేసిన దాఖలాలు లేవు. 2014 ఎన్నికల్లో 50 పేజీలు, 650 హామీలతో కూడిన మేనిఫెస్టోను విడుదల చేసిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక దాన్ని బుట్టదాఖలు చేశారు. అందుకే 2019 ఎన్నికల్లో 23 స్థానాలకే పరిమితం చేసి టీడీపీని ప్రజలు ఘోరంగా ఓడించారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు అర్థమయ్యేలా కేవలం రెండే పేజీలతో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన వైఎస్ జగన్‌కు జనం జైకొట్టారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలను అమలు చేయడం ద్వారా మేనిఫెస్టోకు సిసలైన నిర్వచనం ఇచ్చి రాజకీయ చరిత్రలో నవశకానికి నాంది పలికారు.

దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో..

కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా.. లంచాలకు తావులేకుండా మేనిఫెస్టోలోని నవరత్నాలతోపాటు సంక్షేమ పథకాలను ప్రజలకు సీఎం జగన్ అందజేస్తున్నారు. నాలుగేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీ రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.23 లక్షల కోట్లను జమ చేశారు. దేశ చరిత్రలో ఈ స్థాయిలో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన దాఖలాల్లేవు. డీబీటీ, నాన్ డీబీటీ కలుపుకుంటే ఇప్పటికే రూ.3.15 లక్షల కోట్ల ప్రయోజనాన్ని పేదలకు చేశారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా వివరించటానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెళ్తున్న ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలకు జనం బ్రహ్మరథం పడుతుండటాన్ని బట్టి చూస్తే.. మేనిఫెస్టోను సీఎం వైఎస్ జగన్ ఎంత నిబద్ధతతో అమలు చేస్తున్నారన్నది తెలియకమానదు. వైఎస్సార్‌సీపీ ఏప్రిల్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి.. ఎన్నికల మేనిఫెస్టోను అందించి, హామీల అమలుపై ప్రజల అభిప్రాయాన్ని కోరింది. మేనిఫెస్టోలో 98.5 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని ప్రజలే నిర్ధారించారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో 1.16 కోట్ల కుటుంబాలు అంటే 80 శాతం మంది ప్రజలు ప్రభుత్వానికి మద్దతు పలుకుతూ.. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదించారు. దానికి భయపడే... ఈ కుట్రలకు దిగింది ఎల్లో ముఠా!.

అప్పుడూ ఇప్పుడూ అవే హామీలు

ఇంటింటికీ తాగునీటి కొళాయి కనెక్షన్

టీడీపీ 2014 మేనిఫెస్టో

ప్రతి ఇంటికీ రూ.వెయ్యికే నీటి కొళాయి(నల్లా–ట్యాప్) కనెక్షన్ సౌకర్యం. తెల్లకార్డు ఉన్న వారికి రూ.వందకే కనెక్షన్ మంజూరు. నీటి కొరతను నివారించడానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, అదనపు సంపులు నిర్మాణం. మంచినీటి పైపుల ఆధునికీకరణ. ప్రతి వీధిలో గల్లీలో ఉచిత నల్లా, కొళాయి. (మేనిఫెస్టోలో పేజీ నెంబరు 44లో)

2023 మేనిఫెస్టో

అధికారంలోకి రాగానే ఇంటింటికీ మంచినీటి పథకం. ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్.

అన్నదాత పథకం

2014 మేనిఫెస్టో

అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతు కుటుంబానికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో రూ.75 వేలు అందజేస్తాం. వచ్చే ఖరీఫ్ నుంచి కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తాం. (మేనిఫెస్టోలో 10వ పేజీలో)

2023 మేనిఫెస్టో

అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తాం.

ఇంటికో ఉద్యోగం

2014 మేనిఫెస్టో

ఇంటికో ఉద్యోగం/ ఉపాధి కల్పించే విధంగా ఉపాధి మిత్ర పథకాన్ని ప్రవేశపెడతాం. (పేజీ నంబరు 18)

2023 మేనిఫెస్టో

రాష్ట్రంలో పరిశ్రమలను తీసుకొచ్చి ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇస్తాం.

నిరుద్యోగ భృతి

2014 మేనిఫెస్టో

నిరుద్యోగ యువకులకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ నిరుద్యోగ భృతి కల్పిస్తాం (పేజీ నెంబరు 19)

2023 మేనిఫెస్టో

ఉద్యోగాలు వచ్చే వరకూ నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం.

ఉచిత గ్యాస్ సిలిండర్లు

2014 మేనిఫెస్టో

సంవత్సరానికి 12 వంట గ్యాస్ సిలిండర్లు, ఒక్కో సిలిండర్‌కు రూ.వంద సబ్సిడీతో ఆధార్ కార్డుతో సంబంధం లేకుండా సరఫరా చేస్తాం (పేజీ నంబరు 17లో)

2023 మేనిఫెస్టో

ప్రతి ఇంటికీ సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం.

ఆడబిడ్డ నిధి

2014 మేనిఫెస్టో

పుట్టిన ప్రతి ఆడ బిడ్డ పేరుతో 'మహాలక్ష్మి' పథకం కింద అర్హులైన కుటుంబాలకు రూ.30 వేలు బ్యాంకులో డిపాజిట్ చేసి, యుక్త వయసు వచ్చే నాటికి రూ.రెండు లక్షలు అందజేస్తాం. (మేనిఫెస్టోలో 17వ పేజీలో)

2023 మేనిఫెస్టో

'ఆడబిడ్డ నిధి' కింద 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసు గల మహిళలకు ప్రతి నెలా రూ.1500 చొప్పున.. ఏడాదికి రూ.18 వేల చొప్పున ఐదేళ్లలో రూ.90 వేలు ఆడబిడ్డల ఖాతాలో వేస్తాం.

ఇది పత్రికా..! బాబు కరపత్రికా!!

ఒక పత్రికకు ప్రభుత్వంపై ఇంత కక్షా? దీన్ని పాత్రికేయమంటారా? శుక్రవారం 'ఈనాడు' పత్రిక చూస్తే అనిపించేది ఇదే. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంపై కనీవినీ ఎరుగని అడ్డగోలు రాతలు రాసిన రామోజీరావు... 1995 నుంచీ అక్కడ ఫ్యాక్షన్ ను పెంచి పోషించిన చంద్రబాబు ఊసు మచ్చుకైనా ఎత్తలేదు. 2001లో బాబు హయాంలో టీడీపీ గూండాలు ఏడుగురు కాంగ్రెస్ వారిని వేట కొడవళ్లతో నరికి చంపారని చెప్పరు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ అందుతున్నట్టే.. ఒక్క మాచర్ల నియోజకవర్గంలోనే 3.66 లక్షల మందికి రూ.1,209 కోట్ల మేర సంక్షేమం అందిందని రాయరు. ఇక ఎన్నికల మేనిఫెస్టో విషయంలోనూ అంతే. 98.5 శాతం హామీలను అమలు చేశారన్న వాస్తవాన్ని వదిలిపెట్టి... బాబు చెబుతున్న పచ్చి అబద్ధాలనే బాక్సులు కట్టి మరీ వేశారు. 650 హామీలిచ్చింది చంద్రబాబేనన్న నిజాన్ని చెప్పనేలేదు. స్వాతి రెడ్డిగా పేరుతో సీఎం కుటుంబంపై అసభ్య పోస్టులు పెట్టి చెలరేగిపోతున్న శ్వేతా చౌదరిని బాబు ఎందుకు వెనకేసుకు రావాలి? ఇదంతా ఎల్లో ముఠాలన్నీ కలిసి ఆడిస్తున్న కుట్రగా తెలియటం లేదా? పైపెచ్చు బక్రీద్ పూట టీడీపీ మైనారిటీ నేతను అరెస్టు చేశారంటూ మరో కథనం. అక్రమాలు చేసినట్లు తేలితే అరెస్టు చేయరా? దానిక్కూడా కులాలూ మతాలూ పండగలూ చూస్తారా? ఇవేం వింతలు రామోజీ రావు గారూ? ఇంత నిస్సిగ్గుగా దిగజారిపోతున్న మీ పత్రికను.. ఈ రాష్ట్రానికి పట్టిన పీడ అనుకుంటే తప్పేంటి?

ప్రశాంత సీమలో ఆటవిక చిచ్చు!

పల్నాడులో విద్వేషాలను రగులుస్తున్న ఎల్లో సిండికేట్

- టీడీపీ ఇన్‌చార్జ్ బ్రహ్మారెడ్డి రాకతో విధ్వంసకాండ
- మళ్లీ చీకటి రోజులను తెచ్చే కుట్రలు.. నిస్సిగ్గుగా మత రాజకీయాలు
- మాచర్ల నియోజకవర్గంలో నాలుగేళ్లుగా శాంతియుత జీవనం
- అందరికీ అందుతున్న సంక్షేమ ఫలాలు
- నాలుగేళ్లలో డీబీటీతో 3.66 లక్షల మందికి రూ.1,210 కోట్లు

సాక్షి, అమరావతి: అలనాటి రామాయణంలో.. యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు రాకాసిమూకలు మేఘాల్లో దాగినట్లుగా ఈనాటి రాక్షసులు ఫిలిం సిటీ కొండల్లో నక్కి సంక్షేమ యజ్ఞంపై రోజుకో కుట్ర పన్నుతున్నారు! అందులో తాజా అంకమే 'ఈనాడు – ఆటవిక రాజ్యం'!! పల్నాడులో ఏ గడపను పలుకరించినా వివక్షకు దూరంగా సాగుతున్న సంక్షేమ పాలన, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన అభివృద్ధి ఫలాల గురించి చెబుతుంది. నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్నాడు అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోపాటు కొత్త మెడికల్ కాలేజీ, వరికపుడిసెల, జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణంతో ప్రగతి రథం పరుగులు తీస్తోంది.

మాచర్లలో 90 శాతం కుటుంబాలకు లబ్ధి

పల్నాడు పట్టుగొమ్మ మాచర్ల నియోజకవర్గంలో ఇప్పుడు 3,66,269 మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రయోజనం పొందుతున్నారు. నాలుగేళ్లలో డీబీటీతో నేరుగా రూ.1,209.56 కోట్లు లబ్ధి పొందారు. నియోజకవర్గంలో 1,07,793 కుటుంబాలు ఉండగా 97,136 కుటుంబాలకు డీబీటీ పథకాలు అందుతున్నాయి. 90.11 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు చేరుతున్నట్లు గణాంకాలే వెల్లడిస్తున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 3,05,078 జనాభా ఉండగా 1,59,017 మంది డీబీటీ పథకాల వల్ల లబ్ధి పొందుతున్నారు. ఇక నాన్ డీబీటీతో 1,13,443 మంది ప్రయోజనం పొందారు. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే డీబీటీ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.2,21,168.55 కోట్లను ప్రభుత్వం నేరుగా అందించడం గమనార్హం. రాష్ట్రంలో 1,66,05,771 కుటుంబాలు ఉండగా 1,47,37,989 కుటుంబాలకు డీబీటీ పథకాల ద్వారా ప్రయోజనం దక్కుతోంది. 88 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందడం దేశంలోనే రికార్డు.

ఫ్యాక్షన్ 'బాబు'.. కోడెల కోటలో బాంబులు!

చంద్రబాబు పేరెత్తితేనే పల్నాట పాత గాయాలు రేగుతాయి. 1999 ఎన్నికల సమయంలో నరసరావుపేటలో కోడెల శివప్రసాదరావు ఇంట్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన బాంబులు పేలడంతో నలుగురు మృతి చెందిన విషయం ఎవరూ మరచిపోలేరు! 2001 మార్చి 9న దుర్గి మండలం ఆత్మకూరు బోడు వద్ద కాంగ్రెస్ వర్గీయులపై బాంబులు, వేట కొడవళ్లతో దాడిచేసి ఏడుగురిని ఒకేసారి నరికి చంపారు. 2014 నుంచి 2019 వరకు పల్నాడులో ముఠా కక్షలు జడలు విప్పాయి.

2014 - 2019 పల్నాడులో టీడీపీ మారణహోమం ఇలా..

➡ 2014 సెప్టెంబర్ 22వతేదీన వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలం మేళ్లవాగులో వైఎస్సార్ సీపీ నేతలు పెద నాగిరెడ్డి, చిన నాగిరెడ్డి టీడీపీ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. జంట హత్యలతో చితికిపోయిన ఆయా కుటుంబాలు గ్రామం వదిలి వేరే చోట తలదాచుకున్నాయి.


ఆ నియోజకవర్గం.. ఆటవిక రాజ్యం

➡ టీడీపీ అధికారంలో ఉండగా నీలగంగవరం గ్రామంలో రావులపల్లి పెదమునయ్యపై టీడీపీ వర్గీయులు దాడి చేసి గాయపరచడంతో మృతి చెందాడు.

➡ 2014 సెప్టెంబర్ 11న కారంపూడి మండలం చినగార్లపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేంపాటి గోవిందరెడ్డి(45) ఇంటిపై దాడి చేసి వెంటాడి చంపారు. అడ్డు వచ్చిన భార్య కోటేశ్వరమ్మను, చింతలచెర్వు కోటిరెడ్డిని సైతం హతమార్చేందుకు ప్రయత్నించారు.

➡ 2014 డిసెంబర్ 19న కోర్టు వాయిదాకు హాజరై తిరిగి వెళ్తున్న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత గుడిపాటి వెంకట్రామయ్యను టీడీపీ వర్గీయులు గొడ్డళ్లు, కర్రలతో దాడి చేసి కిరాతకంగా చంపారు.

➡ 2013లో కారంపూడి మండలం నరమాలపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత పెద వెంకటేశ్వర్లు (బ్రహ్మం)ను టీడీపీ వర్గీయులు నరికి చంపారు.

➡ 2017 డిసెంబర్‌లో మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గంగలకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కంచర్ల సాంబయ్యను టీడీపీ ముఠాలు వేట కొడవళ్లతో నరికి చంపేశాయి.

➡ వేమూరు నియోజకవర్గం పెరవలిపాలెంలో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయిన ఎస్.ప్రభాకర రావుపై టీడీపీకి చెందిన సర్పంచ్ సాంబశివ రావు వర్గీయులు 30 మంది దాడి చేసి కొట్టడంతో మృతి చెందాడు.


బ్రహ్మారెడ్డి విధ్వంసం..

రాజకీయంగా మనుగడ సాగించేందుకు ఫ్యాక్షన్ చరిత్ర, నేర ప్రవృత్తి కలిగిన జూలకంటి బ్రహ్మారెడ్డిని మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా చంద్రబాబు నియమించారు. ఏడుగురిని హత్య చేసిన కేసులో బ్రహ్మారెడ్డి ప్రధాన నిందితుడు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో మరో నాలుగు కేసులున్నాయి. మద్యం తాగి రాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులపై కేసు నమోదు చేసినందుకు బ్రహ్మారెడ్డి తన వర్గంతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌పైనే దాడికి పాల్పడ్డాడు.

ముప్పాళ్లలో మూకదాడులు..

టీడీపీ అధికారంలో ఉండగా ముప్పాళ్ల ఎంపీపీ స్థానం వైఎస్సార్‌సీపీకి దక్కకుండా కిడ్నాప్‌కు పాల్పడ్డారు. ముప్పాళ్ల ఎంపీపీ ఎన్నికకు ఎంపీటీసీలతో వెళ్తున్న వైఎస్సార్ సీపీ నేతలు మహ్మద్ ముస్తఫా, అంబటి రాంబాబుపై టీడీపీ మూకలు మేడికొండూరు వద్ద దాడులకు దిగాయి. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను కిడ్నాప్ చేసిన టీడీపీ నేతలు ఎంపీపీ స్థానాన్ని దక్కించుకున్నారు.

మత రాజకీయాలు..



పల్నాడులో టీడీపీ హత్యా రాజకీయాలను పోలీసులు సమర్థంగా తిప్పికొడుతుండటంతో సహించలేని ఎల్లో సిండికేట్ మతాన్ని అడ్డు పెట్టుకుని దుష్ప్రచారానికి తెగబడుతోంది. కారంపూడిలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు బోలినేది అమర్‌నాథ్‌పై టీడీపీ నేతలు హత్యా యత్నానికి పాల్పడిన ఘటనలో ఏ–13గా ఉన్న సయ్యద్ అన్వర్ బాషాను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీన్ని వక్రీకరిస్తూ మతం రంగు పులుముతూ విద్వేషాలు రేకెత్తించేందుకు ఈనాడు బరితెగించింది. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో సయ్యద్ అన్వర్ బాషా ముద్దాయి కావడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు గురజాల డీఎస్పీ ఏ.పల్లపురాజు శుక్రవారం మీడియాతో పేర్కొన్నారు. కిడ్నాప్ జరిగినట్లు కొన్ని మీడియాల్లో వచ్చిన వార్తల్లో నిజం లేదని తెలిపారు.

రైతన్నలకు బీమా ధీమా

- 44.66 లక్షల మందికి రూ.6,684.84 కోట్ల బీమా పరిహారం
- ఈ వారమే 10.20 లక్షల మందికి మరో రూ.1,117.21 కోట్లు
- రికార్డు స్థాయిలో పరిహారం అందిస్తున్నా ఈనాడు బురద రాతలు
- టీడీపీ హయాంలో ఐదేళ్లలో విదిల్చింది రూ.3,411.20 కోట్లు

సాక్షి, అమరావతి: పంటల బీమాతో తేరుకున్న రైతుల సంఖ్యను చూసినా.. లబ్ధి పొందిన మొత్తాన్ని గమనించినా.. ఎలా చూసినా ఇప్పుడు రెట్టింపు ధీమా ఉందనేది కాదనలేని సత్యం! దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులపై పైసా భారం పడకుండా నోటిఫై చేసిన పంటలకు సంబంధించి ప్రతి ఎకరాకూ ఈ– క్రాప్ ఆధారంగా బీమా కవరేజీని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. దేశమంతా ప్రశంసిస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంపై రాళ్లేయడం ఈనాడు రామోజీకే చెల్లింది!!

ఈనాడు ఆరోపణ: బీమా చేసిన విస్తీర్ణంలో రహస్యమేమిటో?


వాస్తవం: 2014–16 మధ్య వ్యవసాయ బీమా పథకం కింద గత సర్కారు ఎంత విస్తీర్ణానికి కవరేజీ కల్పించిందో లెక్కలే లేవు. 2016–18 మధ్య పీఎం ఎఫ్‌బీవై కోసం రైతులు తమ వాటాగా రూ.753.7 కోట్లు చెల్లించగా గత సర్కారు రూ.912 కోట్లు చెల్లించింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రూపాయికే బీమా రక్షణ కల్పిస్తోంది. రైతుల తరపున రూ.468 కోట్లతోపాటు తన వాటాగా రూ.503 కోట్లు కలిపి మొత్తం రూ.971 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. ఖరీఫ్ 2020 సీజన్‌లో రూ.1,739 కోట్లు, ఖరీఫ్ 2021లో రూ.2,977.82 కోట్లను బీమా కంపెనీలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి పరిహారం చెల్లించింది. ఈ – క్రాప్ ఆధారంగా యూనివర్సల్ కవరేజీ కల్పించేందుకు ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్ 2022 సీజన్ నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంతో పీఎంఎఫ్‌బీవైను అనుసంధానిస్తూ అమలుకు సిద్ధపడింది. ఖరీఫ్–2022 సీజన్ కోసం నోటిఫై చేసిన పంటలకు రైతుల తరపున రూ.471.19 కోట్లు, తన వాటాగా రూ.742.06 కోట్లు కలిపి ప్రీమియం రూపంలో రూ.1,213.25 కోట్లను బీమా కంపెనీలకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించింది.

ఆరోపణ: పరిహారం మరీ ఇంత తక్కువా?

వాస్తవం: టీడీపీ సర్కారు ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్లు బీమా పరిహారం చెల్లించింది. సగటున ఏటా 6.17 లక్షల మందికి రూ.682.24 కోట్లకు మించి ఇవ్వని పరిస్థితి. వైఎస్సార్ సీపీ వచ్చాక ఇప్పటికే 44.66 లక్షల మందికి రూ.6,684.84 కోట్ల బీమా పరిహారాన్ని జమ చేసింది. ఖరీఫ్ 22 సీజన్‌లో నష్టపోయిన 10.20 లక్షల మందికి మరో రూ.1,117.21 కోట్ల పరిహారాన్ని జూలై 8న అందించనుంది. తద్వారా నాలుగేళ్లలో 54.86 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల పంటల బీమా పరిహారాన్ని అందించినట్లవుతుంది. అంటే ఏటా సగటున 13.71 లక్షల మందికి రూ.1,950.51 కోట్లు జమ చేసినట్టు లెక్క.

ఆరోపణ: నోటిఫై చేసిన విధానం ఇదేనా?

వాస్తవం: టెక్నికల్ కమిటీ సిఫార్సు మేరకు నోటిఫై చేసిన పంటలకు దిగుబడి, వాతావరణం ఆధారంగా పంటల బీమా అమలు చేస్తారు. ఇది 15 ఏళ్లుగా కొనసాగుతున్న విధానం.


ఖరీఫ్ పంటల బీమా
రూ.1,117 కోట్లు

ఆరోపణ: విస్తీర్ణం కవరేజీలో రహస్యమెందుకు?

వాస్తవం: ఖరీఫ్ నోటిఫైడ్ పంటలకు టీడీపీ హయాంలో సగటున 16 లక్షల మంది రైతులు, 48 లక్షల ఎకరాలకు బీమా చేయించుకోగా 2019–2022 మధ్య ఏటా సగటున 30 లక్షల మంది రైతులకు చెందిన 71.55 లక్షల ఎకరాలకు ఉచిత బీమా కవరేజీని ఈ ప్రభుత్వం కల్పించింది. 2020 ఖరీఫ్‌లో 50 లక్షల ఎకరాలకు కవరేజ్ కల్పించగా 2021లో ఏకంగా 80 లక్షల ఎకరాలకు చేరింది. యూనివర్సల్ కవరేజ్ సాధించిన తొలి రాష్ట్రంగా ఏపీ గుర్తింపు పొందింది. ఇందులో రహస్యమేముందో రామోజీకే తెలియాలి.

ఆరోపణ: వాతావరణ బీమా కవరేజ్‌కు విరుద్ధంగా..

వాస్తవం: వాతావరణ ఆధారిత పంటలకు కంపెనీలు అధిక ప్రీమియాన్ని కోట్ చేయడంతో బీమా కవరేజ్ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తన భుజాన వేసుకుంది. దిగుబడి ఆధారిత పంటలకు రైతుల వాటా, తన వాటా కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,213.37 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించింది. మార్గదర్శకాల మేరకు బీమా పరిహారం రూ.572.59 కోట్లకు పరిమితమైంది. వాతావరణ ఆధారిత పంటలకు రూ.544.62 కోట్లు పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇలా మొత్తం 10.20 లక్షల మందికి రూ.1,117.21 కోట్ల పరిహారాన్ని జూలై 8న చెల్లించేందుకు ఏర్పాట్లు చేసింది.

ఆరోపణ: ఆ జిల్లాలకు జీరో పరిహారమేమిటో?

వాస్తవం: దిగుబడి ఆధారిత బీమా పథకంలో నాలుగు జిల్లాల్లో వాస్తవ దిగుబడులు హామీ దిగుబడులకన్నా ఎక్కువగా ఉండడంతో పరిహారం వర్తించలేదు. వాతావరణ ఆధారిత బీమా అమలుకు 17 జిల్లాలను నోటిఫై చేయగా 16 జిల్లాలకు పరిహారం మంజూరైంది. కానీ రామోజీకి మాత్రం 9 జిల్లాలకు సున్నాగా కనిపిస్తోంది.

బీసీ మహిళంటూ బాబు బుకాయింపు!

ఫ్యాక్ట్ చెక్ 10వ పేజీలో..

దేవుడు స్క్రిప్ట్ రాసేశాడు రామోజీ..



- బాబు కోసం మీరు రాసే తప్పుడు రాతలతో ఏమీకాదు
- 2024లో రెండోసారి సీఎంగా జగన్.. ఐదోసారి ఎమ్మెల్యేగా నేను గెలుస్తాం
- వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పీఆర్కే ఫైర్

మాచర్ల: 'చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి పల్నాడు ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదు. మాచర్ల నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించారు. మేం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే నియోజకవర్గంలో రూ.4వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఇప్పుడు సిగ్గులేకుండా ఈనాడు రామోజీరావును అడ్డం పెట్టుకుని చంద్రబాబు దరిద్రపు రాజకీయాలు చేస్తున్నాడు. మరోవైపు రామోజీరావు కూడా తన అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌ను, ప్రభుత్వాన్ని, మమ్మల్ని టార్గెట్ చేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. దేవుడు ముందే స్క్రిప్ట్ రాసిపెట్టాడు రామోజీరావు.. 2024లో రెండోసారి సీఎంగా జగన్, ఐదోసారి ఎమ్మెల్యేగా నేను గెలవబోతున్నాం. ఆ వార్తను కూడా మీ పత్రికలో రాయాల్సి ఉంటుంది...' అని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ మూడు జిల్లాల కో–ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. 'ఫ్యాక్షనిజం, రౌడీయిజం బ్రహ్మారెడ్డి నైజం. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి విధ్వంసం సృష్టిస్తున్నాడు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అనేక గ్రామాల్లో హత్యలు చేశాడు. అతని చరిత్ర రామోజీరావుకు తెలియదా. నిత్యం టీడీపీ వారు గొడవలు సృష్టిస్తున్నారు. అయినా మాది ఆటవిక రాజ్యం అంటారా..? చంబల్‌తో పోలుస్తారా..? మా ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు కోట్ల రూపాయల సాయం అందిస్తున్నాం. ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఇంత చేస్తున్నా నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించదా... మీ స్వార్థం కోసం మా అన్నదమ్ములపై విషం కక్కుతున్నారు. మేం ఎప్పుడూ ముస్లింలకు అత్యంత సన్నిహితంగా ఉంటాం. ఎక్కడో కారంపూడిలో ఆధార్ కలిగి అదే మండలంలో ఓ హత్య కేసులో ఇరుక్కున్న ముస్లిం యువకుడి కోసం రాద్ధాంతం చేసి దుష్ప్రచారం చేస్తున్నారు' అని పిన్నెల్లి చెప్పారు. పల్నాటి ప్రాంత రైతుల ఏడు దశాబ్దాల కల అయిన వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి త్వరలోనే అన్ని అనుమతులతో సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని పిన్నెల్లి చెప్పారు. ఈ పథకానికి రెండుసార్లు శంకుస్థాపన చేసిన చంద్రబాబు.. ఆ తర్వాత తమవల్ల కాదని చేతులెత్తేశారని చెప్పారు.

క్లుప్తంగా...

సమావేశాల నిర్వహణపై సంతృప్తిగా ఉన్నాం

రాష్ట్ర పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాఖల వారీగా ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశాలు నిర్వహించడం పట్ల ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ సంతోషాన్ని వ్యక్తం చేసింది. సమావేశాల నిర్వహణ తీరుతో పాటు ఆయా సమావేశాల్లో తాము వ్యక్తం చేసిన సమస్యలపై స్పందించే తీరుపై తాము పూర్తి స్థాయి సంతృప్తిగా ఉన్నామంటూ అసోసియేషన్ ప్రెసిడెంట్ వైవీడీ ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ వై.హనుమంతుకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారిలు శాఖ పరిధిలోని వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడి మొత్తం గ్రామ పంచాయతీ కార్యదర్శుల పోస్టుల సంఖ్య ఆధారంగా అన్ని స్థాయి గ్రేడ్‌ల పంచాయతీ కార్యదర్శులకు అవకాశాలు దక్కేలా నిర్ణీత ప్రమాణాల మేరకు క్యాడర్ స్ట్రెంత్‌ను నిర్ధారించాలని తమ అసోసియేషన్.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు వారు తెలిపారు.

110 లీటర్ల తల్లి పాలు దానం

కోయంబత్తూరులో మహిళ రికార్డు

సాక్షి, చెన్నై: ఏడు నెలల కాలంలో 110 లీటర్ల తన పాలను దానంగా ఇచ్చి తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఓ మహిళ రికార్డు సృష్టించింది. కోయంబత్తూరు జిల్లా శరవణం పట్టికి చెందిన కావ్య (27) చైల్డ్ బర్త్ ఎడ్యుకేటర్. గత 7 నెలల్లో 110 లీటర్ల తల్లి పాలను అందించి రికార్డు సృష్టించారు. కావ్య సేవను కలామ్స్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేసుకుంది. ఇందుకు సంబంధించిన ప్రశంసా కార్యక్రమం ఇటీవల చెన్నై తరమణిలో నిర్వహించారు. కావ్యను అభినందిస్తూ హెచ్‌ఏఎల్ నిర్వాహకులు ప్రశంసా పత్రాన్ని, రికార్డు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు.

బేరసారాల కోసమే వారాహి యాత్ర: వెలంపల్లి



గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కేవలం బేరసారాల కోసమే వారాహి యాత్ర చేస్తున్నారని మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల పర్యటనలో భాగంగా పవన్‌కళ్యాణ్ ఇప్పటి వరకు ఏడెనిమిది సభలు నిర్వహించారని, వాటిలో స్థానిక నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఏ ఒక్కరూ వారాహి ఎక్కినట్లు తాను చూడలేదని చెప్పారు. ఏ రాజకీయ పార్టీ అధినేత అయినా నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు తమ పార్టీ ఇన్‌చార్జ్‌లను పక్కన పెట్టుకుని ఓటు వేయాలని అభ్యర్థిస్తారన్నారు. కానీ తన పార్టీ అభ్యర్థులెవరో కూడా చెప్పలేని దద్దమ్మ పవన్ అని విమర్శించారు.

ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేశారు : లోకేశ్

చిల్లకూరు(తిరుపతి జిల్లా): ఆరోగ్యశ్రీ పథకాన్ని అనారోగ్యశ్రీగా మార్చేశారని టీడీపీ నేత నారా లోకేశ్ ధ్వజమెత్తారు. యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఆయన తిరుపతి జిల్లా చిల్లకూరు మండల తీర ప్రాంతంలోని వరగలి నుంచి నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోకి ప్రవేశించారు. వరగలిలో రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రూ.200 పింఛన్‌ను రూ.2 వేలు చేశారని, సీఎం జగన్ నాలుగేళ్లలో రూ.750 మాత్రమే పెంచారన్నారు. గుమ్మళ్లదిబ్బలో మత్స్యకారులతో మాటామంతి నిర్వహించారు.


వివేకా హత్య కేసులో సీబీఐ చార్జ్‌షీట్

కోర్టుకు హాజరుకాని కీలక నిందితుడు దస్తగిరి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. 2019 మార్చి 15న హత్యకు గురైన వివేకా కేసు.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ అయ్యాక సీబీఐ తొలిసారి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ-6), వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ-7), వైఎస్ అవినాశ్ రెడ్డి(ఏ-8)తోపాటు అనుమానిత నిందితుల కింద వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డిని ఏ-9గా, ఏదుల ప్రకాశ్‌ను ఏ-10గా పేర్కొంది. విచారణ సందర్భంగా గంగిరెడ్డి(ఏ-1), సునీల్ యాదవ్(ఏ-2), ఉమాశంకర్‌రెడ్డి(ఏ-3), శివశంకర్‌రెడ్డి(ఏ-5), ఉదయ్‌కుమార్ రెడ్డి(ఏ-6), వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ-7) హాజరయ్యారు. చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని పోలీసులు కోర్టుకు తరలించారు. కాగా, దస్తగిరి(ఏ-4) మాత్రం విచారణకు హాజరుకాలేదు. చార్జ్‌షీట్ దాఖలు చేసిన తర్వాత విచారణను న్యాయమూర్తి ఈ నెల 14వ తేదీకి వాయిదా వేశారు. ఏపీలో విచారణలో ఉండగా రెండుసార్లు చార్జ్‌షీట్లు దాఖలు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, కేసు దర్యాప్తునకు సీబీఐకి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు జూన్ 30తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ గడువును పొడిగించాలని సీబీఐ కోరనుందా అనేది తెలియాల్సి ఉంది.

ఇంటర్‌నెట్ వినియోగదారుల్లో ఏపీ టాప్

- రాష్ట్రంలో అత్యధికంగా ఇంటర్నెట్ వినియోగదారులు
- ప్రతి వంద మంది జనాభాకు 120.33 సబ్‌స్క్రిప్షన్లు
- 2018–19లో 94.59 సబ్‌స్క్రిప్షన్‌లు
- నాలుగేళ్లలో అత్యధికంగా పెరిగిన వినియోగం
- ఏపీ తరువాత కేరళలో అత్యధిక ఇంటర్నెట్ వినియోగదారులు
- కేరళలో ప్రతి వంద మందికి 87.50 సబ్‌స్క్రిప్షన్‌లు
- దేశం మొత్తం 59.97 సబ్‌స్క్రిప్షన్‌లు
- 2022–23 సుస్థిర ప్రగతి లక్ష్యాల పురోగతి నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అందిపుచ్చుకుంటున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. గత నాలుగేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇంటర్నెట్ వినియోగంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఇంటర్నెట్ వినియోగం, ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్‌లలో దేశంలో అన్ని రాష్ట్రాలను మించిపోయింది. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 2022–23 సుస్థిర ప్రగతి లక్ష్యాల పురోగతి నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం ప్రతి వంద మంది జనాభాకు 59.97 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్‌లు ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతీ వంద మంది జనాభాకు 120.33 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్‌లు ఉన్నాయని నివేదిక వెల్లడించింది. దేశ సగటు, ఇతర రాష్ట్రాలకంటే ఎక్కువగా రాష్ట్రంలో ఇంటర్నెట్ వినియోగం ఉన్నట్లు నివేదిక తెలిపింది. దేశం మొత్తం 2018–19లో ప్రతి వంద మందికి 47.94 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్‌లు ఉండగా ఇప్పుడు 59.97కు పెరిగాయి. రాష్ట్రంలో 2018–19లో ప్రతి వంద మందికి 94.59 సబ్‌స్క్రిప్షన్లు ఉండగా 2022–23 నాటికి 120.33 సబ్‌స్క్రిప్షన్లకు పెరగడం గమనార్హం. మరే ఇతర రాష్ట్రాల్లోనూ ఇంత పెద్ద సంఖ్యలో సబ్‌స్క్రిప్షన్లు లేవు. ఆంధ్రప్రదేశ్ తరువాత కేరళలో అత్యధికంగా సబ్‌స్క్రిప్షన్లు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. కేరళలో ప్రతి వంద మందికి 87.50 సబ్‌స్క్రిప్షన్లు ఉన్నాయి. ఆ తరువాత పంజాబ్‌లో 85.97 సబ్‌స్క్రిప్షన్లు ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లో అత్యల్పంగా 41.26 సబ్‌స్క్రిప్షన్లు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో 2019–20 నుంచి ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్‌లు పెరుగుతూనే ఉన్నాయి. 2021–22లో అంతకు ముందు సంవత్సరానికన్నా కొంత మేర తగ్గినప్పటికీ మరుసటి ఏడాది పెరిగాయి.

రాష్ట్రంలో 2018-19 నుంచి 2022-23 సంవత్సరం వరకు రాష్ట్రంలో జనాభా, ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్‌లు ఇలా

ఆర్థిక సంవత్సరం	జనాభా (కోట్లలో)	ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్‌లు	ప్రతి వంద మందికి
2018-19	5,21,03,000	4.93 కోట్లు	94.59
2019-20	5,23,86,000	5.87 కోట్లు	111.96
2020-21	5,26,69,000	6.42 కోట్లు	121.93
2021-22	5,28,95,000	6.25 కోట్లు	117.31
2022-23	5,30,79,000	6.39 కోట్లు	120.33

వైఎస్సార్‌సీపీలోకి శాంతిరాముడు

సీఎం వైఎస్ జగన్ సమక్షంలో తనయుడితో కలిసి పార్టీలో చేరిన శాంతిరామ్ విద్యా సంస్థల అధినేత




శాంతిరాముడు, శివరామ్‌లకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: నంద్యాల శాంతిరామ్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ శాంతిరాముడు తన తనయుడు శివరామ్‌తో కలిసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కండువాలు కప్పి వారిద్దరినీ పార్టీలోకి సీఎం వైఎస్ జగన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద వైఎస్సార్‌సీపీ నేత శాంతిరాముడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని రీతిలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తెచ్చారని ప్రశంసించారు. అదే రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు సంపూర్ణ సహకారం అందించాలనే లక్ష్యంతోనే వైఎస్సార్‌సీపీలో చేరామని చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేత శివరామ్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి కృషి చేస్తామని తెలిపారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై శాంతిరాముడు వైఎస్సార్‌సీపీలో చేరారని చెప్పారు. శివరాముడు చేరికతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిరాముడు, శివరామ్ పార్టీలో చేరడం సంతోషమని.. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి కర్నూల్ జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని వివరించారు. నంద్యాల, కర్నూల్ జిల్లాల పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల అధినేతగా శాంతిరాముడుకు రాయలసీమలో మంచి పేరుందని ఆయన పార్టీలో చేరడం శుభపరిణామమని అన్నారు.

రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవు

- రాష్ట్రవ్యాప్తంగా నిరంతరాయంగా విద్యుత్
- రైతులకు పగటిపూట 9 గంటలు కరెంటు
- నాణ్యమైన విద్యుత్‌కు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- సీఎం జగన్ నేతృత్వంలో సురక్షిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కార్యక్రమాలు
- రాష్ట్రంలోనే సూపర్‌వైజర్, వైర్‌మెన్ మెడికల్ సర్టిఫికెట్ల జారీ
- జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



తిరుచానూరు (చంద్రగిరి): రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవని, ప్రజలతో పాటు రైతులకు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్, గనుల శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడ జరిగిన జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో రైతులకు పగటి పూట 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం జూన్‌లో కూడా అత్యధికంగా విద్యుత్ డిమాండ్ ఉన్నా, సరిపడా కరెంటు ఇవ్వగలిగామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సురక్షితమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఏపీ పవర్ యుటిలిటీస్, సాధారణ ప్రజల భద్రతకు ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ పి.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ భద్రతా కమిటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విద్యుత్ సరఫరాలో సమస్యల పరిష్కారానికి ప్రతి సబ్‌స్టేషన్‌కు ఒక సలహా కమిటీని నియమించినట్లు తెలిపారు. పారదర్శకత, జవాబుదారీతనం, విద్యుత్ సామర్థ్యం పెంపు ప్రధాన లక్ష్యాలుగా సీఈఐజీ ఆన్‌లైన్ విధానంలో ఫైల్ డిస్పోజల్‌కు రాష్ట్ర పభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విశాఖపట్టణం-చెన్నై కారిడార్లలో భాగంగా శ్రీకాళహస్తి, తిరుపతి, ఏర్పేడు, చిత్తూరు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. కొప్పర్తిలో వైఎస్ఆర్ జగనన్న హెవీ ఇండస్ట్రియల్ హబ్ వల్ల పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. పరిశ్రమల ప్రోత్సాహానికి సీఈఐజీ డిపార్ట్‌మెంట్‌లో కొత్త పొజిషన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ లైసెన్సులు, సూపర్‌వైజర్, వైర్‌మెన్ అనుమతుల కోసం తిరుపతి, రాజమహేంద్రవరంలో రీజినల్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సూపర్‌వైజర్, వైర్‌మెన్ అనుమతులు, రెన్యూవల్‌కు ఫస్ట్ ఎయిడ్ అండ్ పవర్ మెడిసిన్ సర్టిఫికెట్లను ఇకపై రాష్ట్రంలోని వైద్యకళాశాలల నుంచి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్స్, సేఫ్టీ అండ్ ఎలక్ట్రిక్ సప్లై రెగ్యులేషన్స్ పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, డైరెక్టర్లు సుబ్బరాజు, శశికళ, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

1,013 మంది బాల కార్మికులకు స్వేచ్ఛ

సీఐడీ పోలీసులను అభినందించిన బాలల హక్కుల పరిరక్షణ సంస్థ చైర్మన్

సాక్షి, అమరావతి: ఆపరేషన్ స్వేచ్ఛ ద్వారా రాష్ట్రంలో బాల కార్మికులకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పిస్తున్న సీఐడీ పోలీసులను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంస్థ చైర్మన్ కేసలి అప్పారావు అభినందించారు. వెట్టి చాకిరీ నుంచి 1,,013 మంది బాల కార్మికులను విడిపించడం ముదావహమని అన్నారు. రాష్ట్ర సీఐడీ పోలీసులు ఫిబ్రవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్ -1లో 285 మంది పిల్లలను బాల కార్మిక వ్యవస్థ నుంచి రక్షించింది. జూన్ నెలలో నిర్వహించిన ఫేజ్ -2 లో 728 మంది పిల్లలను బాల కార్మిక వ్యవస్థ నుంచి కాపాడారు. వీరిలో 654 మంది బాలురు కాగా 74 మంది బాలికలు ఉన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గుంటూరు సీఐడీ కార్యాలయంలో జరిగిన ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్-2 ముగింపు సమావేశంలో అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన సీఐడీ మహిళా సంరక్షణ విభాగం ఎస్పీ కేజీవీ సరితను ఆయన అభినందించారు. బాల కార్మికులకు విముక్తి కల్పించడంలో సహకరించిన ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సరిత సత్కరించారు. కార్మికశాఖ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, డిప్యూటీ కమిషనర్ ఎ.గణేష్, సమగ్ర శిక్ష కన్సల్టెంట్ గీత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విశాఖలోనూ ఐటీ రీఫండ్ కుంభకోణం

- వైజాగ్, రాజమండ్రిలో సోదాలు
- రూ.14 కోట్ల స్కామ్ జరిగినట్లు గుర్తించిన అధికారులు
- సుమారు 400 మంది ఉద్యోగులకు సంబంధించి అవకతవకలు

సాక్షి, విశాఖపట్నం: ఆదాయపు పన్ను రీఫండ్‌కు సంబంధించి హైదరాబాద్‌లో బట్టబయలైన కుంభకోణం మాదిరిగానే.. విశాఖ డివిజన్ పరిధిలోనూ బహిర్గతమైంది. విశాఖపట్నం, రాజమండ్రి ప్రాంతాల్లో రెండు కన్సల్టెన్సీ సంస్థల్లో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించగా.. ఏకంగా రూ.14 కోట్లు రీఫండ్ స్కామ్ చోటుచేసుకుందని తేలింది. ఇటీవల హైదరాబాద్, విజయవాడలో నిర్వహించిన సోదాల్లో కుంభకోణం బయట పడటంతో.. విశాఖ డివిజన్ పరిధిలోని ట్యాక్స్ కన్సల్టెన్సీలపై కూడా ఐటీ అధికారులు దృష్టి సారించారు. కొన్నేళ్లుగా ఎక్కువ మొత్తంలో రీఫండ్ ఫైల్స్ అప్‌లోడ్ చేస్తున్న ట్యాక్స్ కన్సల్టెన్సీల వివరాలు సేకరించారు. విశాఖలో 8 మంది ట్యాక్స్ కన్సల్టెంట్స్, రాజమండ్రిలో నాలుగు సంస్థల్ని గుర్తించినట్లు తెలుస్తోంది. తొలిరోజున విశాఖలోని అక్కయ్యపాలెం సమీపంలో ఉన్న ట్యాక్స్ కన్సల్టెంట్ కార్యాలయంలో, రాజమండ్రి నగరంలోని ట్యాక్స్ కన్సల్టెంట్ కార్యాలయంలోనూ రెండు బృందాలు సోదాలు చేశాయి. ఐదేళ్లలో విశాఖలోని సంస్థ రూ.8 కోట్లు, రాజమండ్రిలోని సంస్థ రూ.4 కోట్లు వరకూ రీఫండ్ కుంభకోణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఇందులో సింహభాగం విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీటీ), డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐ), స్టీల్‌ప్లాంట్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఉద్యోగులున్నట్లు సమాచారం. వీరితో పాటు మరికొందరు రాష్ట ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారని తెలిసింది. మొత్తంగా సుమారు 400 మంది ఉద్యోగులు ఐదేళ్లుగా వివిధ సెక్షన్లను ఉపయోగిస్తూ అవకతవకలకు పాల్పడినట్లు వెల్లడైంది. కన్సల్టెంట్లు నేరుగా లేదా వారి ఏజెంట్ల ద్వారా రీఫండ్ మొత్తంపై 10 నుంచి 15 శాతం కమీషన్ పొందినట్లు తెలుస్తోంది. రికార్డులను స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు.. కన్సల్టెన్సీ సంస్థలతో పాటు.. మోసాలకు పాల్పడిన ఉద్యోగుల పైనా క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

'జయలక్ష్మి' కేసులో త్వరలో మరో చార్జిషీట్

- రూ.700 కోట్లకు పైగా రుణాలు వసూలు చేయాల్సి ఉంది
- 64 ఆస్తుల విక్రయానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- సొసైటీ నూతన అధ్యక్షుడు గంగిరెడ్డి త్రినాథరావు



డైరెక్టర్లు, బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న నూతన చైర్మన్ త్రినాథరావు

కాకినాడ రూరల్: అధిక వడ్డీ ఎర వేసి.. డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి సొసైటీ కేసులో సీఐడీ అధికారులు త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేయనున్నారని నూతన పాలకవర్గ అధ్యక్షుడు గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద ఉన్న సొసైటీ మెయిన్ బ్రాంచ్‌లో వైస్ చైర్మన్ పీవీ రమణమూర్తి, డైరెక్టర్ చింతా సుబ్బారావు, బాధితుల సంఘం నాయకులు బదరీ నారాయణ, ప్రసాదమూర్తి తదితరులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ.. సుమారు రూ.582 కోట్ల డిపాజిట్లకు సంబంధించి బాధితులకు న్యాయం చేయాల్సి ఉందని తెలిపారు. సుమారు రూ.700 కోట్లకు పైగా రుణాలు వసూలు చేయాల్సి ఉందన్నారు. సీఐడీ అధికారులు జనవరిలో రూ.150 కోట్ల విలువైన 64 ఆస్తులపై చార్జిషీట్ దాఖలు చేశారని చెప్పారు. బాధితులకు నగదు చెల్లించేందుకు ఆ ఆస్తుల విక్రయానికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. అయితే సీఐడీ కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ కేసులో నిందితులు 1999 నుంచి 2023 వరకూ గుట్టుగా ఆస్తులు విక్రయించినట్టు గుర్తించిన సీఐడీ అధికారులు త్వరలో సుమారు రూ.70 కోట్లకు సంబంధించి రెండో చార్జిషీట్ దాఖలు చేయనున్నారని చెప్పారు.

కొన్ని ఆస్తుల వేలానికి చర్యలు

రామారావుపేటలో 250 గజాల విలువైన స్థలాన్ని నాలుగు దఫాలుగా విక్రయించారని త్రినాథరావు తెలిపారు. హైదరాబాద్‌లో భవనం, అంబాజీపేట మండలం నరేంద్రపురంలో 10 ఎకరాలు, కోటపాడులో 8 ఎకరాల భూముల అమ్మకాలు జరగడంతో వాటిని ఎటాచ్ చేయనున్నారని వెల్లడించారు. రెండు మూడు నెలల్లో జయలక్ష్మి కేసు ముగిసే అవకాశం ఉందని చెప్పారు. విశాఖపట్నం ఎంవీపీ కాలనీ బ్రాంచ్‌లో 17 మంది రుణగ్రహీతల నుంచి రూ.70 కోట్లు రావాల్సి ఉందన్నారు. వారితో అక్కడ గురువారం సమావేశం నిర్వహించి రుణాలు చెల్లించాలని కోరామన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో చెల్లిస్తామని వారు తెలిపారన్నారు. కూర్మన్నపాలెంలోని 12 ప్లాట్ల నుంచి రూ.2 కోట్లు రావాల్సి ఉందని వెల్లడించారు. వీటిని వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెజ్‌లో 14.8 ఎకరాలకు గాను 5 ఎకరాలకు రూ.25 లక్షలు వచ్చాయని, మిగిలిన భూములు అప్పగించాల్సిందిగా కలెక్టర్‌కు విన్నవించామని చెప్పారు. సొసైటీ నిధులు దుర్వినియోగం చేసిన వారిలో 58 మందిని త్వరలోనే అరెస్టు చేయనున్నారని తెలిపారు. వీరిలో సొసైటీ ఉద్యోగులు, బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, రుణగ్రహీతలు ఉన్నారని త్రినాథరావు వివరించారు.

సీమ సిగలో కందనవోలు సౌరభం

వానలు కురిస్తే వజ్రాలు పండే నేల ఇది.. ఆదిమ మానవుని ఆనవాళ్లను అద్దుకున్న ప్రాంతమిది.. బ్రిటీష్ వారి నిరంకుశ పాలనను ఎదురించిన గడ్డ ఇది.. తమ సాంస్కృతిక వైభవాన్ని ఖండాంతరాలకు చాటిన సీమ ఇది.. చారిత్రక సంపదకు నిలయంగా.. రాజకీయ చైతన్యానికి పేరుగా నిలిచిన కర్నూలు జిల్లా ఏర్పడి నేటి 165 ఏళ్లు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..



నేడు రెండు జిల్లాలుగా విడిపోయిన కర్నూలు, నంద్యాల జిల్లాల మ్యాపు

కర్నూలు జిల్లాగా అవతరించి నేటికి 165 ఏళ్లు

- 1858 జూలై ఒకటో తేదీన 8 తాలూకాలతో ఆవిర్భావం
- జిల్లా నుంచి కీలక పదవులు అలంకరించిన నేతలు
- చారిత్రక కట్టడాలకు..పురాతన ఆలయాలకు నిలయం
- విభిన్న సంస్కృతులు..వింత ఆచారాలు
- నేడు ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): ఈస్టిండియా కంపెనీ పాలనలోకి వచ్చే వరకు అనేక చిన్న రాజ్య వంశాల చేత కర్నూలు ప్రాంతం పరిపాలింపబడేది. ఈస్టిండియా కంపెనీ పూర్తిగా బ్రిటీషు రూల్‌కు కిందకు వెళ్లిపోయిన తరువాత 1858 జూలై ఒకటో తేదీన పరిపాలన సౌలభ్యం కోసం 8 తాలూకాలతో కర్నూలు జిల్లా అవతరించింది.

అప్పటి జిల్లా స్వరూపమిదీ..

కర్నూలు పరిధిలోని రామల్లకోట, నంద్యాల, శిరివెళ్ల, నందికొట్కూరు, కడప జిల్లా నుంచి దూపాడు(మార్కాపురం), కంభం, కోవెలకుంట్ల, బళ్లారి జిల్లా నుంచి పత్తికొండ కలిపి మొత్తం 8 తాలూకాలతో కర్నూలు జిల్లా అవతరించింది. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు జిల్లాలో ఎలాంటి మార్పులు సంభవించలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బనగానపల్లె సంస్థానం కొన్ని నెలలు ఇండియన్ యూనియన్‌లో కలువలేదు. కాంగ్రెస్ నాయకుల ఉద్యమాల ఫలితంగా 1948 ఫిబ్రవరి 18వ తేదీన ఆ సంస్థానం భారతదేశంలో భాగమైంది. తరువాత బనగానపల్లెను ఉప తాలూకాగాచేసి కర్నూలు జిల్లాలో విలీనం చేశారు.

కర్నూలులో సబ్‌కలెక్టర్ కార్యాలయం

ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించడంలో థామస్ మన్రో కీలకపాత్ర పోషించాడు. దీంతో 1800లో ఈయనను రాయలసీమ జిల్లాలకు కలెక్టర్‌గా నియమించారు. అనంతరం 1807లో దత్తమండలాలను నాలుగు సబ్‌కలెక్టర్ విభాగాలు ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలో 1807లో మొదటి సారి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటైంది. 1839లో కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ తిరుగుబాటు చేయడంతో ఈస్టిండియా కంపెనీ వారు కర్నూలును తమ రాజ్యంలో కలుపుకున్నారు.

రాజకీయాల్లో ప్రత్యేకం

కర్నూలు జిల్లా దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. ఇక్కడి నుంచే రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డిని ఎన్నికయ్యారు. నీలంసంజీవరెడ్డి ప్రధాన మంత్రి కాక మునుపు 26 రోజులు పార్లమెంట్ స్పీకర్‌గా కూడా పనిచేశారు. అలాగు బనగానపల్లెకు చెందిన పెండేకంటి వెంకటసుబ్బయ్య గవర్నర్‌గా పనిచేశారు. నంద్యాల నుంచి ఎంపీగా గెలిచి పీవీ నరసింహరావు ప్రధానమంత్రి అయ్యారు. కర్నూలు జిల్లా నుంచి నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. నీలం సంజీవరెడ్డి సొంతూరు అనంతపురం అయినా ఆయన డోన్ నుంచి ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహించి ముఖ్యమంత్రి అయ్యారు.

సాంస్కృతిక వికాసం

కర్నూలు జిల్లాలో విభిన్న సంస్కృతులు ఉన్నాయి. ఇక్కడ పండుగలు ప్రత్యేకంగా జరుపుకుంటారు. దసరా పండుగ రోజున దేవరగట్టులో కర్రల సమరం..ఉగాది పండుగ రోజున కై రుప్పలలో నుగ్గులాట..హోలి పండుగ రోజున హొళగుంద ప్రాంతంలో పురుషులు ఆడవేషాలు వేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. పత్తికొండ ప్రాంతంలోని గొరవయ్యలు ఖండాంతరాల్లో నృత్యప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు.

రాజధాని వైభవం

మద్రాసు రాష్ట్రంలోని పదకొండు జిల్లాలు కలసి 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అప్పుడు ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధానిగా కర్నూలును ఎంపిక చేశారు. 1953 అక్టోబరు 1 నుంచి 1956 అక్టోబరు 31 వరకు ఆంధ్రరాష్ట్ర రాజధానిగా కర్నూలు కొనసాగింది. హైదరాబాద్ నుంచి రాయలసీమలో ఏ జిల్లాకు వెళ్లాలన్నా కర్నూలు నుంచి ప్రయాణించాలి. దీంతో కర్నూలును రాయలసీమ ముఖద్వారంగా వ్యవహరిస్తారు.

చారిత్రక సంపద

- కర్నూలు నగరానికి 18 కి.మీ దూరంలో ఉన్న కేతవరంలో రాతి శిలలపై అతి ప్రాచీన చిత్రలేఖనాలు ఉన్నాయి. ఇక్కడ ఆదిమ మానవుడు సంచరించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.
- కర్నూలు నగరం నడిబొడ్డున ఉన్న కొండారెడ్డి బురుజును విజయనగర రాజు అచ్యుతదేవరాయలు కట్టించారు. బ్రిటీష్ వారు స్వాతంత్ర్య సమరయోధుడు కొండారెడ్డిని ఈ కోటలో బంధించడంతో దీనికి ఆపేరు వచ్చినట్లు తెలుస్తోంది.
- తుగ్గలి మండలం జొన్నగిరిలో అశోకుని శిలాశాసనాలు ఉన్నాయి.

2022లో రెండు జిల్లాలుగా విభజన..

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 2022లో కర్నూలుజిల్లాను రెండుగా విభజించారు. కర్నూలుకు 26 మండలాలు, నంద్యాలకు 28 మండలాలు కేటాయించారు. 2022 ఏప్రిల్ 4 ముందు కర్నూలు జిల్లా జనాభా విషయంలో లిటేరియా దేశంతో సమానంగా ఉండేది. దేశంలో 10వ విశాలమైన జిల్లాగా ఉండేది. ప్రస్తుతం నంద్యాల జిల్లా కంటే తక్కువ వైశాల్యం గల జిల్లాగా మారడం విచిత్రం.

నేడు జిల్లా ఆవిర్భావ వేడుకలు

కర్నూలు జిల్లా ఇంటలెక్చువల్ కంసోర్టియం ఆధ్వర్యంలో జిల్లా ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కర్నూలు నగరం మద్దూరు నగర్‌లోని తెలుగుతోటలో చరిత్రకారులు, మేధావుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరపనున్నారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు.

కర్నూలుకు ఎంతో చరిత్ర ఉంది

కర్నూలు అంటే రాయలసీమ ముఖ ద్వారం. ఆనాడు స్వాతంత్రం పోరాటం కంటే ముందు గౌడప్ప గౌడు, గులాం రసూల్‌ఖాన్, ఉయ్యాలవాడ నరసింహరెడ్డి ఆంగ్లేయులపై ఉవ్వెత్తున దండెత్తారు. ఆ రోజు వారు యుద్ధంలో గెలిచి ఉంటే బ్రిటీషోళ్ల చరిత్రే ఉండేది కాదు. కర్నూలు జిల్లాగా 1858 జూలై ఒకటో తేదీన అవతరించింది. ఆనాడు 8 తాలూకాలతో అవతరించిన కర్నూలు జిల్లాలో రెండు విడిపోయే నాటికి 54 మండలాలుగా ఉండేది. పరిపాలనా సౌలభ్యంకోసం విడిపోవడం మంచిదే.

– డాక్టర్ మన్సూర్ రెహమాన్, రిటైర్డ్ ప్రొఫెసర్, కర్నూలు

ఎవరు భక్తితో ఆకునో, పువ్వునో, ఫలాన్నో, నీటినో
నాకు సమర్పిస్తారో ఆ శ్రద్ధా మనస్కులు భక్తితో
ఇచ్చిన దానిని నేను స్వీకరిస్తాను.
– భగవద్గీత

సాక్షి

శనివారం, 1 జూలై 2023

సంకుచితమైన తీర్పు

అబార్షన్ల విషయంలో మహిళల రాజ్యాంగ హక్కుని కాలరాస్తూ నిరుడు జూన్‌లో తీర్పునిచ్చిన అమెరికా సుప్రీంకోర్టు... జాతి ఆధారంగా విద్యాసంస్థల అడ్మిషన్లలో ప్రాధాన్యం కల్పించే విధానానికి మంగళం పాడి తనది వెనకడుగేనని మరోసారి నిరూపించుకుంది. గత అరవైయ్యేళ్లుగా అమలవుతున్న ఈ విధానం రాజ్యాంగంలోని 14వ అధికరణకు విరుద్ధమని 6–3 మెజారిటీతో ధర్మాసనం గురువారం తీర్పునిచ్చింది. ధర్మాసనంలో అత్యధికులు రిపబ్లికన్ల ఏలుబడిలో వచ్చినవారే. మన దేశంలో శతాబ్దాలుగా వివక్ష ఎదుర్కొంటున్న అట్టడుగు కులాలకు కోటా కల్పించిన విధంగానే అమెరికా విద్యాసంస్థల్లో కూడా నల్లజాతీయులు, ఇతర మైనారిటీ వర్గాలకు ప్రవేశాల్లో ప్రాధాన్యమిస్తున్నారు. ఆ వర్గాలపై శతాబ్దాలుగా అమలవుతున్న వివక్షపై డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ నేతృత్వంలో సాగిన చరిత్రాత్మక పోరాటాల ఫలితంగా అక్కడి సమాజం తనను తాను సరిదిద్దుకునే క్రమంలో ఈ విధానం అమల్లోకి వచ్చింది. అయితే ఈ క్రమం అసంపూర్ణంగానే ఉన్నదని తరచు నిరూపణ అవుతూనే ఉంది. వర్ణ వివక్ష, దాన్ని వెన్నంటి ఉండే వ్యవస్థీకృత హింస ఇంకా సమసిపోలేదు. ఎలాంటి నేర నేపథ్యమూ లేని జార్జి ఫ్లాయిడ్ అనే ఒక నల్లజాతీయుణ్ణి 2020లో మినియాపొలిస్ నగరంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ ఎంత క్రూరంగా, ఎంత నిర్దాక్షిణ్యంగా హతమార్చాడో, దాని పర్యవసానంగా ఎంత హింస చెలరేగిందో ప్రపంచమంతా చూసింది. ఆ ఘటనకు ముందూ వెనుకా అనేకానేకమంది నల్లజాతీయులు పోలీసు హింసకు బలయ్యారు. వందల ఏళ్లపాటు బానిసత్వంలో మగ్గిన పర్యవసానంగా వారు చదువులకు దూరమయ్యారు. కనుక మెరుగైన ఉపాధికి వారు దూరం. అసలు 1964 వరకూ పౌరహక్కులే లేవు. ఆ మరుసటి ఏడాది వారికి తొలిసారిగా ఎన్నికల్లో ఓటేసే హక్కు లభించింది. ఇదంతా నల్లజాతీయుల మొక్కవోని పోరాటాల, త్యాగాల ఫలితం. ఆ హక్కులకు కొనసాగింపుగానే 1965 జూన్‌లో అప్పటి అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్ 'నిశ్చయాత్మక చర్య'కు సంసిద్ధం కావాలని, నల్లజాతీయులకూ, ఇతర మైనారిటీలకూ ప్రవేశాల్లో ప్రాధాన్యతనీయాలని విద్యాసంస్థలకు పిలుపునిచ్చారు. ఆరు దశాబ్దాలుగా అమలవుతున్న ఈ విధానంతో ఎంతోమంది అత్యున్నత స్థానాలకు ఎదుగుతున్నారు. తమ మేధస్సుతో అమెరికన్ సమాజం సుసంపన్నం కావటానికి దోహదపడుతున్నారు. అయినా ఈనాటికీ విద్యాసంస్థల్లో నల్లజాతీయులు 7 శాతం మించరు. శ్వేత జాతి అమెరికన్లు 46 శాతం వరకూ ఉంటారు. ఏదో మేరకు జరుగుతున్న కాస్త మంచినీ తాజా తీర్పు ఆవిరిచేసింది.

విద్యారంగంలో 'నిశ్చయాత్మక చర్య'కు ముందు అత్యున్నత శ్రేణి విద్యా కేంద్రాలుగా పేరున్న హార్వర్డ్, యేల్, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీల్లో 1960ల నాటికి కేవలం 15 (0.5 శాతం) మంది నల్లజాతి విద్యార్థులుండేవారు. వైద్య విద్యలో పేరెన్నికగన్న యూసీఎల్ఏలోనూ, మరికొన్నిచోట్లా 1955–1968 మధ్య 764 మంది వైద్య పట్టాలు పొందితే నల్లజాతీయులు ఒక్కరు కూడా లేరు. దీన్ని గమనించాకే లిండన్ జాన్సన్ విద్యాసంస్థలకు అర్థమయ్యేలా చెప్పారు. అనేకానేక ఏళ్లపాటు సంకెళ్లలో బందీ అయిన వ్యక్తికి విముక్తి కల్పిస్తూ 'ఇకపై నీకు స్వేచ్ఛనిస్తున్నాం. ఇప్పుడు ఎవరితోనైనా నువ్వు పోటీపడొచ్చు. ఆ పోటీ పూర్తి న్యాయబద్ధంగా ఉంటుంది' అనడం ఎంత అన్యాయమో గ్రహించమని కోరారు. ఆ తర్వాతే విద్యాసంస్థలు తమ అడ్మిషన్ విధానాల్లో మార్పులు చేశాయి. తమ తీర్పు దీన్నంతటినీ దెబ్బతీస్తుందన్న వాదనలతో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ ఏకీభవించటం లేదు. వివక్ష అంతానికి ప్రవేశపెట్టిన ఈ విధానమే వివక్షతో కూడుకున్నదని ఆయన అభిప్రాయం. ఇకపై వ్యక్తులుగా ఎవరు ఎలాంటి వివక్ష ఎదుర్కొన్నారో తెలుసుకుని దాన్నిబట్టి నిర్ణయం తీసుకోవాలన్నది ఆయన సూచన. ఆచరణలో ఇదంతా ఏమవుతుందో తెలియనిది కాదు. ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లో జాతిపరమైన వైవిధ్యత మాయమవుతుంది. శ్వేత జాతి అమెరికన్ల ఆధిపత్యం పెరుగుతుంది.

ప్రస్తుతం తీర్పు వెలువడిన కేసు అక్కడ మొదటిదేమీ కాదు. 'నిశ్చయాత్మక చర్య' మొదలై పదేళ్లు గడవకుండానే దానిపై వివిధ న్యాయస్థానాల్లో కేసులు దాఖలయ్యాయి. వాటిల్లో స్వల్ప మెజారిటీతో గండం గట్టెక్కిన కేసులే అధికం. 2003లో ఈ విధానానికి అనుకూలంగా తీర్పు వెలువడినా, ధర్మాసనంలోని మహిళా న్యాయమూర్తి 'మరో పాతికేళ్లకు జాతిని కాక ప్రతిభను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంద'ని అభిప్రాయపడ్డారు. కానీ అంతకు చాలా ముందే సుప్రీంకోర్టు ఆ విధానానికి స్వస్తి పలికినట్టయింది. అసలు ఈ విధానాన్ని కాలిఫోర్నియా, ఫ్లారిడాలతో సహా తొమ్మిది రాష్ట్రాలు అమలు చేయటంలేదు. అమెరికన్ సమాజంలో ఈ విధానాన్ని వ్యతిరేకించే వర్గం క్రమేపీ పెరగటం కనిపిస్తుంది. రిపబ్లికన్ పార్టీ ఈ విధానికి మొదటినుంచీ బద్ధ వ్యతిరేకం. అనుకూలంగా ఉండే డెమొక్రటిక్ పార్టీ కూడా ప్రజానీకాన్ని చైతన్యవంతం చేసే ప్రయత్నం చేయలేదు. అందుకే ప్రస్తుత తీర్పు మెజారిటీ జనాభా దృక్పథాన్నే ప్రతిబింబిస్తోంది. ఇది విద్యాసంస్థలకు సంబంధించిందే అయినా ముమ్ముందు మిలిటరీ, నావీ అకాడమీ ప్రవేశాల్లోనూ, కార్పొరేట్ రంగ ఎంపికల్లోనూ అమలు చేసే పరిస్థితులు ఏర్పడొచ్చు. ఈ విధానంవల్ల లాభపడుతున్న ఆసియన్ అమెరికన్లను, శ్వేతజాతి మహిళలను కూడగట్టడంలో నల్లజాతీయులు విఫలం కావటంవల్లే ఈ తీర్పు వెలువడిందని కొందరి విశ్లేషణ. ఆ మాటెలావున్నా మొత్తంగా అమెరికన్ సమాజంలో జాతిపరమైన సంకుచితత్వం పెరుగుతోందనటానికి ఈ తీర్పు నిదర్శనం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.8.48 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అనూరాధ ప.1.11 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.41 నుండి 8.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.32 నుండి 7.17 వరకు, **అమృతఘడియలు:** తె.4.02 నుండి 5.33 వరకు (తెల్లవారితే ఆదివారం).

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

బంగ్లాదేశ్‌లో ఎవరి ప్రయోజనాలేంటి?

విశ్లేషణ



బి. జెడ్. ఖుస్రూ

బంగ్లాదేశ్‌ను అస్థిరంగా ఉంచాలని అమెరికా చూస్తుంది. ఈ పరిస్థితి తన తూర్పు రాష్ట్రాల్లోకి లక్షలాది మంది వలసలకు కారణం అవుతుంది కాబట్టి దాన్ని భారత్ నిరోధించడానికి ప్రయత్నిస్తుంది. చైనాకు సంబంధించినంతవరకూ, ఢిల్లీ హసీనాను ఒత్తిడి చేస్తుంది. కానీ ఆమె అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుంది. మరోవైపు, హసీనా వరుసగా నాలుగోసారి గెలుపొందే విషయం పట్ల అమెరికా ఉత్సాహంగా లేదు. బలమైన దేశీయ మద్దతు ఉన్న నాయకులు అమెరికా ఆదేశాలను తిప్పికొట్టడం దానికి కారణం. అమెరికాలాగా భారత్ కూడా, చైనా వ్యతిరేక శిబిరంలో బంగ్లాదేశ్ ఉండాలని కోరుకుంటోంది. అయితే బంగాళాఖాతంలో స్థావరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే అమెరికాతో ఢిల్లీ ఎంత దూరం వెళ్తుందనేది అనిశ్చితం.

1975లో తమ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ముజీబుర్ రహమాన్ హత్య వెనుక అమెరికా హస్తం ఉందని బంగ్లాదేశ్‌లోని చాలామంది ప్రజలు విశ్వసిస్తున్నారు. ముజీబుర్ రహమాన్‌ను పడగొట్టిన సైనిక తిరుగుబాటులో వాషింగ్టన్ పాత్ర పోషించిందా లేదా అనేది ఇప్పటికీ చర్చనీయాంశమే. ఒక్క విషయం మాత్రం స్పష్టం. ఈ దక్షిణాసియా దేశ తొలి సైనిక పాలకుడు జనరల్ జియావుర్ రహమాన్‌కు అమెరికా మద్దతునిచ్చింది.

ఇప్పుడు, దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత, హత్యకు గురైన అధ్యక్షుడి కుమార్తె, ప్రస్తుత ప్రధాని షేక్ హసీనా, అమెరికా తనను పడగొట్టి తన ప్రత్యర్థి, మాజీ ప్రధాని, జియావుర్ రహమాన్ వితంతువు అయిన ఖలీదా జియాను అధికారంలోకి తేవాలనుకుంటోందని ఆరోపిస్తున్నారు. ''అమెరికన్లు నేను అధికారంలో కొనసాగాలనుకోవడం లేదు,'' అని ఆమె ఇటీవల 'బీబీసీ'తో అన్నారు. ఇంకా దారుణంగా, ఆమె ఏప్రిల్‌లో పార్లమెంటులో మాట్లాడుతూ, ''ఎటువంటి ప్రజాస్వామ్య ఉనికిని కలిగి ఉండని ప్రభుత్వాన్ని ఇక్కడ తేవాలని అమెరికా భావిస్తోంది'' అని ఆమె ఆరోపించారు.

గత సంవత్సరం, మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలపై వాషింగ్టన్, హసీనా ప్రభుత్వంలోని పలువురు అధికారులపై, భద్రతా దళాలపై ఆంక్షలు విధించింది. కానీ బంగ్లాదేశ్‌లో తమ అనుకూల సైనిక పాలనా కాలంలో, సరైన విచారణ లేకుండానే వందలాదిమంది తిరుగుబాటు సైనికులను ఉరితీసినప్పుడు మాత్రం ఇలాంటి చర్యలను అమెరికా చేపట్టలేదు. ఇటీవలే, రాబోయే జాతీయ ఎన్నికలను మలినపర్చడానికి ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటివారిని దేశంలో అడుగుపెట్టకుండా తిరస్కరిస్తానని అమెరికా బెదిరించింది.

ఇలాంటి బెదిరింపులు బంగ్లాదేశ్‌లో కనీవినీ ఎరుగని రాజకీయ సుడిగుండాన్ని సృష్టించాయి. ఇది రాడికల్ ఇస్లామిక్ సంస్థలతో సహా అనేక శక్తులను నిద్రాణస్థితి నుండి బయటకు లాగి, దాదాపు 16.5 కోట్లమంది బెంగాలీలు గల దేశాన్ని కేవలం ఒక దశాబ్దం క్రితం కొత్త అఫ్గానిస్తాన్‌గా మార్చివేసింది. అయితే, చట్టవిరుద్ధమైన వ్యూహాలను ఉపయోగించినప్పటికీ, వాషింగ్టన్, ఢిల్లీ నుండి ఆమోదం పొందిన తర్వాత హసీనా వారిని దాదాపుగా అణచివేశారు. హసీనాపై అమెరికా ఆరోపిస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనల మూలాలు, తీవ్రవాద మతశక్తులపై ఆమె సాగించిన అణిచివేతలో దాగి ఉన్నాయి. వాస్తవానికి, ఆమె మరింత విస్తృతమైన వల వేశారు. అదేక్రమంలో తన రాజకీయ ప్రత్యర్థులను కూడా తుడిచిపెట్టారు.

1971 వరకు బంగ్లాదేశ్ భాగమై ఉన్న పాకిస్తాన్‌లో సైనిక నియంతలకు మద్దతు ఇచ్చిన అమెరికా, ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే పేరుతో హసీనాపై ఇప్పుడు లాఠీని ప్రయోగిస్తోంది. ఢాకాలో ఈ సిద్ధాంతం చెల్లుబాటవడం కష్టమే. వాషింగ్టన్ ప్రజాస్వామ్య చర్చ తమను మభ్యపెట్టడానికేననీ, దానిలో వారి సొంత ప్రయోజనాలు



దాగి ఉన్నాయనీ బంగ్లాదేశీయులు భావిస్తున్నారు.

నిజానికి, చైనాకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో హసీనాను తమవైపు తిప్పుకోవడమే అమెరికా అసలు లక్ష్యం. చైనా ప్రపంచ శక్తిగా ఎదగడం, మరింత ప్రభావం కోసం బీజింగ్ వ్యక్తపరుస్తున్న ఆకాంక్షను భగ్నం చేయడానికి అమెరికా యత్నిస్తోంది. బంగాళాఖాతం సమీపంలో దాని స్థానం కారణంగా బంగ్లాదేశ్ వ్యూహాత్మకంగా మారింది. బంగాళాఖాతంలోని బంగ్లాదేశ్ ద్వీపంలో అమెరికా తమ నావికా స్థావరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ఇద్దరు వామపక్ష పార్లమెంటు సభ్యులు ఇటీవల పేర్కొన్నారు. ఇటువంటి స్థావరం వల్ల ఐరోపా, మధ్యప్రాచ్య దేశాలకు చైనా సముద్ర వాణిజ్య మార్గాన్ని అమెరికా సులభంగా నిరోధిస్తుంది. అది చైనా ఆర్థిక వ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అయితే వాషింగ్టన్‌కు అలాంటి ఆలోచనే లేదని ఢాకాలోని అమెరికా రాయబార కార్యాలయం నిర్ద్వంద్వంగా ఖండించింది.

అమెరికాలాగా భారత్ కూడా, చైనా వ్యతిరేక శిబిరంలో బంగ్లాదేశ్ ఉండాలని కోరుకుంటోంది. అయితే వాషింగ్టన్ నిజంగానే బంగాళాఖాతంలో స్థావరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే అమెరికాతో ఢిల్లీ ఎంత దూరం వెళ్తుందనేది అనిశ్చితం. దాని పెరట్లో అమెరికా సైనిక స్థావరం ఉండటం ఇష్టపడదు. హసీనా విషయానికి వస్తే, ఆమె భారత్, అమెరికాల ఒత్తిడికి తలొగ్గి, 'పెద్దన్నలను' తృప్తిపరచడానికి బీజింగ్‌కు సురక్షితమైన దూరంలో ఉండవచ్చు.

బెంగాలీలు ఒక సమూహంగా ఏదైనా సైనిక కూటమిలో చేరడాన్ని వ్యతిరేకిస్తున్నారు. భారత్ లేదా అమెరికా బంగ్లాదేశ్ వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి తగినంత డబ్బు ఇవ్వలేవు. ఈ పరిస్థితుల్లో చైనా రక్షకుడిగా కనిపిస్తోంది. అత్యంత విభేదాలతో ఉండే బంగ్లాదేశీయులు అందరూ అంగీకరించే విషయం ఏదైనా ఉందంటే, అది ఆర్థిక వ్యవస్థ గురించి మాత్రమే. కాబట్టి దేశాన్ని ఎవరు పాలించినా, చైనాతో బంగ్లాదేశ్ బలమైన బంధం కొనసాగే అవకాశం ఉంది.

బంగ్లాదేశ్‌లో భారత ప్రయోజనాలు అమెరికా ప్రయోజనాలకు భిన్నంగా ఉంటాయి. భారతదేశ ప్రధాన లక్ష్యం దాని తూర్పు పార్శ్వంలో భద్రత. హసీనా దశాబ్దాలుగా దీనికి సహాయం చేశారు. బంగ్లాదేశ్ రాజకీయ దృశ్యంలో అన్ని పువ్వులు వికసించడాన్ని అమెరికా చూడాలనుకోవచ్చు. కానీ ఇస్లామిక్ రాడికల్స్ పట్ల భారత్‌కు కనికరం లేదు. ఖలీదా జియాపై న్యూఢిల్లీ అవిశ్వాసంతో వ్యవహరిస్తుంది. బంగ్లా దేశ్‌ను భారత వ్యతిరేక కార్యకలాపాలకు వాడుకుంటున్నారని ఢిల్లీ చేసిన ఫిర్యాదులను తాను ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఖలీదా జియా తోసిపుచ్చి భారత్‌కు ఆగ్రహం తెప్పించారు.

బంగ్లాదేశ్‌ను అస్థిరంగా ఉంచాలని అమెరికా చూస్తుంది. అయితే ఈ పరిస్థితి తన తూర్పు రాష్ట్రాల్లోకి లక్షలాది మంది వలసలకు కారణం అవుతుంది కాబట్టి దాన్ని భారత్ నిరోధించడానికి ప్రయత్నిస్తుంది. చైనాకు సంబంధించినంతవరకూ, ఢిల్లీ హసీనాను ఒత్తిడి చేస్తుంది. కానీ ఆమె అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుంది. మరోవైపు, ఈ ఏడాది ఎన్నికల్లో హసీనా వరుసగా నాలుగోసారి గెలుపొందే విషయం పట్ల అమెరికా ఉత్సాహంగా లేదు. బలమైన దేశీయ మద్దతు ఉన్న నాయకులు అమెరికా ఆదేశాలను తిప్పికొట్టడం దానికి కారణం. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, హంగరీకి చెందిన విక్టర్ ఓర్బన్ దీనికి ఉదాహరణలు. కాబట్టి దాని వినాశకరమైన హింసాత్మక పాలన–మార్పు సూత్రాన్ని వదిలి వేసి, బ్యాలెట్ బాక్స్ ద్వారా పాలన మార్పును తేవడానికి అమెరికా యత్నిస్తోంది.

దీంతో బంగ్లాదేశ్‌కు సంబంధించినంత వరకూ భారత్‌తో అమెరికా విభేదిస్తోంది. భారత్ ప్రణాళికలు విజయవంతమైతే, బంగ్లాదేశ్‌లో మళ్లీ అంత స్నేహపూర్వకంగా లేని పరిస్థితిని అమెరికా ఎదుర్కొంటుంది. బంగ్లాదేశ్ ఆవిర్భవించినప్పటినుంచి ఇది ఉనికిలో ఉన్నదే. విదేశీ ఒత్తిడికి తలొగ్గబోననీ, వాషింగ్టన్ పరోక్ష దూకుడుకు లొంగిపోననీ హసీనా ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యాన్ని నిర్మిస్తామనే వాక్చాతుర్యం కంటే నిశ్శబ్ద దౌత్యం, శిక్షకు సంబంధించిన ముప్పు హసీనాపై మెరుగ్గా పని చేస్తాయి. కోపాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ బంగ్లా ప్రధాని మౌలికంగా అమెరికాకు వ్యతిరేకం కాకపోవచ్చు.

వాస్తవానికి, ఆమె 2009లో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, ముస్లిం ప్రపంచానికి ఢాకా నుండి ప్రసంగాన్ని అందించాలంటూ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను రహస్యంగా ఆహ్వానించడానికి ప్రయత్నించారు. వ్యక్తిగత స్థాయిలో ఈ ఆసియా ఉక్కు మహిళ అమెరికాతో కుటుంబ సంబంధాలను కలిగి ఉన్నారు. ఆమె తన కోడలు అయిన అమెరికన్ మహిళను ఆరాధిస్తారు. ప్రతిపక్ష సభ్యుడు ఆమె మతాన్ని గురించి ప్రశ్నించినప్పుడు హసీనా పార్లమెంటులో తన కోడలిని బహిరంగంగా సమర్థించారు. బెంగాలీ సంస్కృతిలో, వ్యక్తిగత సంబంధాలు అధికారిక మర్యాదలను అధిగమిస్తాయి.

వ్యాసకర్త, పాత్రికేయుడు, యుద్ధ వ్యవహారాల నిపుణుడు
('ద స్టేట్స్‌మన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్తదనం



స్టార్టప్‌లు ప్రారంభిస్తున్నప్పుడు వాటిల్లో పెట్టుబడులు పెట్టడానికి చాలా మంచి కారణాలున్నాయి. అందులో డబ్బు ఒకటైతే కాదు.

– పర్మీందర్ సింగ్, గూగుల్ మాజీ ఎండీ

ఆరోగ్య భాగ్యం



మద్యం తాగే యువత అమెరికాలో మరింత మరింతగా తగ్గిపోతున్న వాస్తవం నాకు సంతోషం కలిగిస్తోంది. అది సానుకూల ధోరణి. మద్యపానం కూడా పొగతాగడం మార్గంలో నడుస్తోంది.

– జూబీ, ర్యాపర్

మంటల వెనుక...



ఫ్రాన్స్ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలకు క్రమశిక్షణ లేని ముస్లింలు, వలసవాదులే కారణమంటూ ఆన్‌లైన్‌లో చిత్రించే ప్రయత్నం జరుగుతోంది. మున్ముందూ జరుగుతుంది. విభజించి పాలించే ప్రయత్నాలను నిరోధించాలి. నియంతృత్వపు కులీన ప్రపంచవాద ఫ్రెంచ్ రాజ్యాన్ని దాని ప్రజలు ద్వేషిస్తుండటమే ఈ మంటలకు కారణం.

– మాజిద్ నవాజ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కాకూడదా?



అందంగా ఉండి నాకు తెలియని ముఖం తాలుకు చిత్రం ఏది కనబడినా ఇప్పుడు అది కృత్రిమ మేధ సృష్టి అనుకుంటాను. పరిస్థితి అలా ఉంది మరి!

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్


పండగ వద్దా?



బక్రీద్ రోజు అహ్మదీలు ఖుర్బానీ చేయడం దైవదూషణ అంటూ పాకిస్తాన్‌లో కొందరు బహిరంగంగా బెదిరింపులకు పాల్పడ్డారు. అయినా పోలీసులు ఈ అతివాదుల మీద ఏ చర్యలూ తీసుకోకుండా, ఈద్ జరుపుకొనే అహ్మదీలకు వ్యతిరేకంగా నిలిచారు. తన మైనారిటీలను కాపాడుకోవడంలో పాకిస్తాన్ వరుసగా విఫలమవుతూనే ఉంది.

– కాశిఫ్ చౌదరి, యాక్టివిస్ట్, వైద్యుడు

ఒక రోబో ప్లీజ్!



ఎవరూ ఈ విషయం గురించి పెద్దగా మాట్లాడటం లేదు. పదేళ్లలో మనం కోటి బైపెడల్ (రెండు కాళ్ల) రోబోలను కలిగి వుంటాం; 25 ఏళ్లలో ఈ సంఖ్య వందకోట్లకు చేరుతుంది. మనం వాటిని పదివేల డాలర్లు వెచ్చించి కొనుక్కుంటాం. మన జీవితంలో ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ ఎంత ప్రాధాన్యత కలిగి వుందో రోబో కూడా అలా విడదీయలేని భాగం కాబోతోంది.

– వినోద్ ఖోస్లా, వ్యాపారవేత్త

మంచి నిర్ణయం



నేను ఒక ఫిజీషియన్‌ను. నా ఆరోగ్యం గురించి నేను తీసుకున్న అత్యంత మంచి నిర్ణయం ఏమిటంటే, కోవిడ్–19 టీకా వేసుకోకపోవడం. ఆఖరికి నా సొంత వృత్తిలోవాళ్లు కూడా దాన్ని తప్పక తీసుకోవాలని చెప్పారు. తీవ్ర బలవంతాల మధ్య దానికి వ్యతిరేకంగా నేను గట్టిగా నిలబడేలా చేసిన దేవుడికి కృతజ్ఞుడిని.

– సునీల్ ధండ్, ఫిజీషియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

బ్యాంకింగ్ లోపాలు సరిదిద్దరా?

అభిప్రాయం



డా॥ కోలాహలం రామ్ కిశోర్

బ్యాంకింగ్ వ్యవస్థకు సంబంధించిన ప్రభుత్వ పాలసీల రూపకల్పనలోనూ, వాటి నిర్వహణా సామర్థ్యాలలోనూ అనేక లోపాలు ఏదో రూపంలో తలెత్తుతూనే ఉన్నాయి. అయినా కేంద్ర ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకోకుండా నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా గత కొద్ది నెలలుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పాలసీలో అనుసరిస్తున్న ద్రవ్య విధానం ఆర్థిక వ్యవస్థకు చేటు తెచ్చేలా ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సభ్యుడు జయంత్ వర్మ ఇదే విషయాన్ని చెబుతూ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ నెల ఆరంభంలో జరిగిన ఎంపీసీ సమావేశం మినిట్స్ వెల్లడయ్యాయి. వడ్డీరేట్ల పెంపుపై సభ్యుల మధ్య విభేదాలు పొడచూపినట్లుగా తెలుస్తోంది. ఏడాది కాలంలో 'రెపో రేటు' నాలుగు శాతం నుండి 6.5 శాతానికి పెరిగింది. 'ద్రవ్య విధానం' వాస్తవానికి దూరం జరిగిపోతున్నదంటూ జయంత్ వర్మ తాజా సమావేశంలో విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆర్థిక అభివృద్ధి అంచనాల కంటే తక్కువగా ఉంటుందన్నారు. అహ్మదాబాద్ ఐఐఎం ప్రొఫెసర్ అయిన జయంత్ వర్మ, కేంద్రం ఎంపీసీలో నియమించిన ముగ్గురు నామినీ సభ్యుల్లో ఒకరు.

అలాగే గడిచిన ఈ 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం 15 లక్షల కోట్ల రూపాయలను 'రైట్ ఆఫ్' చేసి ఎగవేతదారులకు మేలు చేసింది. అంతే కాక ఉద్దేశపూర్వకంగా రుణాలనూ, వడ్డీలనూ ఎగ్గొట్టిన వారికి మళ్లీ రుణాలు ఇచ్చేందుకు కూడా రిజర్వ్ బ్యాంక్ సిద్ధపడింది. రాజీ పరిష్కారం (కాంప్రమైజ్ సెటిల్మెంట్) పేరిట ఈ ప్రక్రియకు తలుపుల్ని బార్లా తెరిచింది. ఈ అనాలోచిత చర్యపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ క్రమంలోనే, ఉద్దేశపూర్వకంగా ఎగవేతకు పాల్పడిన వారు ఎంతమంది ఉన్నారు అన్న చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. 2022 డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా ఉద్దేశపూర్వకంగా పెద్ద మొత్తాలను ఎగవేసిన వారు పదహారు వేల మందికి పైమాటే అని బ్యాంకు నివేదికను బట్టి తెలుస్తోంది. వీళ్లు దాదాపు రూ. 3.46 లక్షల కోట్ల రుణాలను ఎగ్గొట్టినట్లు సమాచారం. ఇందులో 85 శాతం రుణాలను (రూ. 2.92 లక్షల కోట్లు) ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్నట్టుగా తెలుస్తోంది.

దేశంలో మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6 బ్యాంకులకు గత కొన్నేళ్లుగా ఛైర్‌పర్సన్‌లను నియమించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఇందువల్ల ఆయా బ్యాంకులు క్రమంగా బలహీన పడుతున్నాయి. ఇప్పటికే నోట్ల రద్దు ప్రక్రియతో మన ఆర్థిక వ్యవస్థ సతమతం అవుతోంది.

ఇలాంటి పరిస్థితుల్లో గుండెకాయ లాంటి బ్యాంకింగ్ వ్యవస్థ ఇన్ని అంతర్గత వ్యవస్థాపరమైన లోపాలూ, నిర్వాహణా లోపాలతో కొనసాగితే... దేశ ద్రవ్య వ్యవస్థ భవిష్యత్తులో ఏమికానుందో అనే ఆందోళన కలుగక మానదు. ఇటీవల అనేక విదేశీబ్యాంకులు వ్యవస్థాపర, నిర్వహణాపర లోపాలతో దివాలా తీసిన అనుభవాలు కళ్లెదుట కనిపిస్తున్నా వాటి నుండి మనం గుణపాఠం నేర్చుకోకుంటే ఎలా?

వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ । 98493 28496

'చంద్ర'గ్రహణమే అసలు కారణం!

అభిప్రాయం



డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాసవర్మ

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పోలవరంలో రివర్స్ టెండరింగ్ చేసి కాంట్రాక్టర్లను మార్చడం వల్లే ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగిందని చంద్రబాబు బృందం చేస్తున్న ప్రచారం సరికాదు. నిజానికి జాప్యం అయ్యింది చంద్రబాబు అవకతవక పనుల వల్లేనని ప్రాజెక్టు పనుల క్రమాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. జగన్ అధికారం చేపట్టిన తర్వాత... అప్పటివరకు ఆంధ్రప్రదేశ్ భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన జాప్యాన్నీ, అవకతవకలనూ సరిదిద్దేందుకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రోగ్రెస్‌ను ప్రభుత్వం నిర్దేశించిన అంశాల ప్రకారం లోతైన పరిశీలన చేసి తగిన సిఫార్సులు చేసేందుకు నిపుణుల కమిటీ నియామకం జరిగింది. ఆ తర్వాత 2019 జూన్ 22 తేదీన 'పోలవరం ప్రాజెక్టు'పై కూడా బషీర్, నారాయణ రెడ్డి, సూర్యప్రకాశ్, సుబ్బరాయ శర్మ, పీటర్, ఆదిశేషు, ఐఎస్ఎన్ రాజు, చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్‌లతో కూడిన ఒక నిపుణుల కమిటీని నియమించారు.

పోలవరం ప్రాజెక్టు పనుల్లో భారీ అవకతవకలు చోటు చేసుకొన్నాయని ఆ నిపుణుల కమిటీ తేల్చటమే కాక చంద్రబాబు ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందాలను రద్దు చేయాలని సిఫార్సు చేసింది. పోలవరం ప్రాజెక్టు పనుల్లో రివర్స్ టెండరింగ్‌కు వెళ్లాలని నిపుణుల కమిటీ జగన్ ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న 'ట్రాన్స్‌ట్రాయ్'కి వేల కోట్ల రూపాయాలు లబ్ధి చేకూరేలా చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించిందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌కు ముందుగానే డబ్బు చెల్లింపులను కూడా నిపుణుల కమిటీ తప్పుపట్టింది. అంతేకాక పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిబంధనలు సైతం ఉల్లంఘించారని కమిటీ తేల్చింది. చంద్రబాబు ప్రభుత్వం మొత్తం రూ. 3,074 కోట్లు అదనంగా చెల్లింపులు చేసినట్టు ఈ కమిటీ తన రిపోర్ట్‌లో తేల్చి చెప్పింది. ఆ దశలో 'రెవెన్యూ రికవరీ యాక్ట్' ప్రకారం అదనంగా చెల్లించిన బిల్లుల మొత్తాన్ని కాంట్రాక్టర్ల నుంచి తిరిగి వసూలు చేయాలని కమిటీ



సిఫార్సు చేసింది.

ఈ నేపథ్యంలో చంద్రబాబు తన ఇష్టానుసారంగా తన వాళ్ళకి కట్టబెట్టిన పోలవరం ప్రాజెక్టు పనులను రద్దు చేసి 2019 ఆగస్టు 17న ఆ పనులకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పిలిచి, ఆ తర్వాత రివర్స్ టెండరింగ్ చేసి అదే ఏడాది సెప్టెంబర్‌లో 'మేఘా ఇంజనీరింగ్–ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ'తో ఒప్పందం చేసుకుని పనులను అప్పగించింది ప్రభుత్వం. దీనివల్ల రూ. 782 కోట్లు ఆదా అయ్యాయి. ఆ తక్షణమే ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ పనులు అత్యంత ప్రణాళికాబద్ధంగా శరవేగంతో ముందుకు సాగాయి.

ఈ పైన వివరించిన ఘట్టాలన్నీ ఎప్పుడు జరిగాయి? 2019 జులై నుండి అక్టోబర్ వరకు. ఈ నాలుగు నెలలూ గోదావరి నదికి వరద కాలం. కాఫర్ డ్యాములు పూర్తి కాని నేపథ్యంలో ఈ నాలుగు నెలల్లో పాత కాంట్రాక్టర్‌ను తొలగించకపోయినా పనులు జరిగే అవకాశమే లేదు. పైగా 2019 మే నెల చివరి వరకు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది చంద్రబాబే. మే 28న అప్పటికి అసంపూర్ణంగా, అస్తవ్యస్తంగా ఉన్న కాఫర్ డ్యాముల నిర్మాణాన్ని తక్షణం నిలుపుచేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చంద్రబాబు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తేదీ నాటికి అప్రోచ్ ఛానల్ పూర్తి కాని కారణంగా గోదావరి నీటిని పూర్తిగా దిగువకు డైవర్ట్ చేసే వీలులేదు. కాఫర్ డ్యాముల గ్యాప్‌లు కూడా మూసివేస్తే దిగువకు నీరు వెళ్ళే దారి లేనందున, గోదావరి నదికి వరదొచ్చే అవకాశం ఉందని గ్రహించిన పీపీఏ నిర్మాణం నిలుపు చేయండని ఆదేశించింది చంద్రబాబు హయాంలోనే... అంటే మరో రెండు రోజుల్లో జగన్ ముఖ్యమంత్రి పదవి చేపడతారనగా కాఫర్ డ్యాముల నిర్మాణం ఆగిపోయిందన్నమాట. కాబట్టి జగన్ పోలవరం కాంట్రాక్టర్లను మార్చడం వల్లే ప్రాజెక్టు ఆలస్యం అయిందంటూ చంద్రబాబు బృందం చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమన్నమాట!

పోలవరం పనుల నుండి తన కాంట్రాక్టర్లను మారిస్తే తాను చేసిన అవినీతి అవకతవకలు బహిర్గతం అవుతాయనే భయంతో ఆ నాలుగు నెలల్లో కోర్టుల్లో కేసులు వేసి చంద్రబాబు అనేక అడ్డంకులను సృష్టించారు. వాటన్నింటినీ అధిగమించి జగన్ కొత్త ఏజెన్సీ చేత ప్రాజెక్టు ప్రోగ్రెస్‌కు ఎటువంటి ఇబ్బందీ లేకుండా వరద తగ్గిన తక్షణమే పనులు మొదలు పెట్టించ గలిగారు. ఈ పనుల వేగం సంతృప్తికరంగా ఉందనీ, వరద తగ్గిన తక్షణమే ఇంత పెద్ద ఎత్తున పనులు చేపట్టడాన్ని డిసెంబర్‌లో మూడు రోజుల పాటు ప్రాజెక్టు పనులను పరిశీలించిన కేంద్ర జలసంఘం నియమించిన 'ఎక్స్‌పర్ట్స్ పేనల్' సంతృప్తి వ్యక్తం చేసి, జగన్ ప్రభుత్వాన్ని అభినందించింది కూడా. ప్రజలు ఈ వాస్తవాలు గమనిస్తారనే స్పృహ బాబు బృందానికి లేకపోవడం గమనార్హం!

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 98486 93373

క్లుప్తంగా...

ఆప్కోలో ఉద్యోగ అవకాశాలు

3న నేరుగా ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని ఆప్కో చేనేత వస్త్ర విక్రయశాలల్లో మేనేజర్లు, అమ్మకాల సహాయకులుగా పనిచేయడానికి అర్హత కలిగిన వారిని నేరుగా ఇంటర్వ్యూకి ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎం.నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 15 పోస్టులను భర్తీచేయనున్నట్లు తెలిపారు. విక్రయరంగంలో ఆసక్తి కలిగి ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణతతో మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారు ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలు కలిగిన బయోడేటాతో జూలై మూడోతేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ గవర్నర్ పేటలోని రహమాన్ పార్క్ దగ్గరలోగల ఆప్కో కేంద్ర కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైనవారికి కనిష్టంగా రూ.9 వేలకుపైగా, వారి పనితీరు ఆధారంగా వేతనం నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఆప్కో సంస్థ, విక్రయశాలల పూర్తి సమాచారాన్ని www. apcohandlooms.com వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు కాచిగూడ-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా శనివారం కాచిగూడ-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాచిగూడ-కాకినాడ టౌన్ (07215) ప్రత్యేక రైలు శనివారం రాత్రి 8.30 గంటలకు కాచిగూడలో బయలుదేరి ఆదివారం ఉదయం 7.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు మల్కాజ్‌గిరి, నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో ఆగుతుంది.

పిచ్చి కుక్కల వీరంగం.. 15 మందికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన పిల్లలు

వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా): మండలంలోని వెదురుకుప్పం, అయ్యన్నగారిపల్లె ప్రాంతాల్లో శుక్రవారం పిచ్చి కుక్కలు వీరంగం సృష్టించాయి. ఏడుగురిపై దాడి చేయడంతో వారు తీవ్ర గాయాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీటి దాడిలో వారం రోజులుగా 15 మందికి పైగా గాయపడ్డారు. వీరంతా వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుక్కల దాడికి మనుషులే కాకుండా పశువులు, మేకలు, గొర్రెలు కూడా గాయపడుతున్నాయి. ఇటీవల బ్రాహ్మణపల్లెలో నడిపిరెడ్డికి చెందిన 11 గొర్రెపిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి.

నేడు జీఎస్టీ 'ప్రశంసా పత్రాల' పంపిణీ

సాక్షి, అమరావతి: జీఎస్టీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం జోన్ పరిధిలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సకాలంలో పన్నులు చెల్లించిన సంస్థలు/వ్యక్తులకు శనివారం విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో ప్రశంసా పత్రాలను అందజేస్తున్నట్లు విశాఖ సీజీఎస్టీ, కస్టమ్స్ జోన్ అడిషనల్ కమిషనర్ ఎం.శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకవేళ విశాఖకు రాలేనివారు ఆయా కమిషనరేట్లలో ప్రశంసా పత్రాలు అందుకోవచ్చన్నారు. సూపరింటెండెంట్లు కె.సదానంద కుమార్ స్వామి (సీసీవో), వై.శ్రీనివాసు (విశాఖ), అబ్దుల్ అజీమ్, పోగుల ఆశ, జి.శ్రీనివాసరెడ్డి (గుంటూరు), ప్రదీప్ గౌతమ్ మండవ (తిరుపతి), పద్మకుమార్ (ఆడిట్), ఇన్‌స్పెక్టర్లు యోగేష్ భరద్వాజ్ (ఆడిట్), డి.శ్రీవాత్సవ్ (సీసీవో), బ్రాహ్మణి (విశాఖ), మెండు నాగసాయి గోపాల్ (గుంటూరు), అల్లూరి శశిధర్ (తిరుపతి), నల్లి రవికుమార్ సూర్య నారాయణ (ఆడిట్), ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్లు ఎస్.రవి కృష్ణ (సీసీవో), సిహెచ్.శ్రీపతి (విశాఖ), బొందిగల శ్రీనివాసులు (తిరుపతి), పన్ను చెల్లింపుదారు సంస్థల్లో.. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (విశాఖ), చాయిస్ ట్రేడింగ్ కార్పొరేషన్ (విశాఖ), ఎనంటి ల్యాబ్స్ (విశాఖ), ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్ (గుంటూరు), హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ (గుంటూరు), కియా మోటర్స్ ఇండియా (తిరుపతి), అల్ట్రాటెక్ సిమెంట్ (తిరుపతి), అమరరాజ బ్యాటరీస్ (తిరుపతి)ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

సాహితీ ఫార్మాలో భారీ అగ్నిప్రమాదం

- ఇద్దరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- అచ్యుతాపురం సెజ్‌లో ఘటన
- ఎలక్ట్రో షార్ట్ సర్క్యూట్‌తో యూనిట్–1లో ప్రమాదం!
- రెండు రియాక్టర్లు పేలి ఎగిసిపడిన మంటలు
- వెంటనే సహాయక చర్యలకు ఆదేశించిన సీఎం జగన్
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం
- క్షతగాత్రులకు రూ. 5 లక్షలు పరిహారం
- జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన విచారణ కమిటీ
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి అమర్‌నాథ్



ప్రమాద దృశ్యం



గాయపడ్డవారిని పరామర్శిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్.

సాక్షి, అనకాపల్లి/రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)/మహారాణిపేట: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా కంపెనీలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఉదయం 10.30 గంటల సమయంలో రెండు రియాక్టర్లు పేలి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం కేజీహెచ్‌లో నలుగురు, అచ్యుతాపురం స్టార్ జెన్ ఆస్పత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయక చర్యలకు ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ప్రమాదంపై విచారణకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ నియమించినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి తెలిపారు. ఈ కమిటీలో అదనపు పోలీస్ ఎస్పీ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, ఆర్డీవో సభ్యులుగా ఉంటారని తెలిపారు. అధికారుల కథనం ప్రకారం.. సాహితీ ఫార్మా కంపెనీలో సెజ్‌లో గల వివిధ ఫార్మా కంపెనీల వేస్ట్ సాల్వెంట్‌ని రీసైక్లింగ్ చేస్తుంటారు. ఇతర ఫార్మా కంపెనీల్లో ఒక సారి వినియోగించిన వ్యర్థాలతో కూడిన మిథనాల్ ఇతర రసాయన పదార్థాలను ఇక్కడ శుద్ధి చేసి, దానిని మరోసారి వినియోగించుకునేందుకు ఆయా కంపెనీలకు అప్పగిస్తారు. శుక్రవారం ఉదయం కంపెనీ యూనిట్ – 1లో సాల్వెంట్ లోడింగ్ సమయంలో ట్యాంకర్‌కు ఎలక్ట్రో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న రెండు రియాక్టర్లు పేలిపోయాయి. ఆ సమయంలో ఉదయం షిఫ్ట్‌లో 35 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో రియాక్టర్లకు సమీపంలో పనిచేస్తున్న ఏడుగురు తీవ్రంగాగా గాయపడ్డారు.28 మంది అత్యవసర మార్గం ద్వారా బయటకు పరుగులు తీశారు. గాయపడినవారిలో ఆరుగురిని కేజీహెచ్‌కు, ఒకరిని అచ్యుతాపురంలోని స్టార్ జెన్ ఆస్పత్రికి తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో అచ్యుతాపురం మండలం జంగాలపాలేనికి చెందిన పైల సత్తిబాబు (35), విజయనగరానికి చెందిన ఉప్పాడ తిరుపతి (28) మరణించారు. రాంబిల్లి మండలం పంచదార్లకు చెందిన సింగంశెట్టి నూకినాయుడు, ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన కె.రామేశ్వర్, అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాగిరెడ్డి రాజుబాబు, నక్కపల్లికి చెందిన సంబంగి అప్పారావు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కొండకొప్పాకకు చెందిన సంతోష్‌కుమార్ స్టార్‌జెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.క్షతగాత్రులను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉన్నతాధికారులు పరామర్శించారు. అనంతరం సాహితి పరిశ్రమను సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

హుటాహుటిన సహాయక చర్యలు

ఈ పేలుడుతో కెమికల్స్ అంటుకుని మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల భారీగా పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళం సహాయక చర్యలు చేపట్టింది. పూర్తిగా మంటలు అదుపులోకి రావడానికి 8 గంటలకు పైగా సమయం పట్టింది. ఘటన జరిగిన వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి అమర్‌నాథ్

సాహితీ ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. మృతి చెందిన వారి కుటుంబాలను, గాయపడ్డవారిని ఆదుకుంటామని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిమాపక దళం సకాలంలో మంటలను అదుపు చేయడంతో కార్మికుల ప్రాణాలను కాపాడాం. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ సంఘటనపై విచారణ జరిపి, మానవ తప్పిదం ఉంటే చర్యలు తీసుకుంటాం.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: సోము

సాక్షి, అమరావతి : అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

దేశాభివృద్ధిలో సాంకేతిక విద్య కీలకం

- విద్యార్థుల లెర్నింగ్ ఔట్‌కమ్స్‌ను మెరుగుపర్చాలి
- ప్రతి కళాశాలలో మల్టీడిసిప్లినరీ కోర్సులు అందించాలి
- కంప్యూటర్ సైన్స్ ఒక్కటే సాంకేతిక విద్య కాదు
- మిగతా కోర్ బ్రాంచ్‌ల్లోనూ అపార అవకాశాలు
- ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారామ్



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

సాక్షి, అమరావతి: దేశాభివృద్ధిలో సాంకేతిక విద్య కీలక భూమిక పోషిస్తోందని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) చైర్మన్ టీజీ సీతారామ్ అన్నారు. ఈ క్రమంలోనే సాంకేతికతతో కూడిన పరిపాలన అందించడం ద్వారా ప్రజల జీవన శైలిలో సమూల మార్పులు తీసుకురావచ్చన్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్ కళాశాలల యాజమాన్యాల సంఘం(అపెక్మా) సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీతారామ్ మాట్లాడుతూ.. 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతోందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వచ్చే 25 ఏళ్లను అమృత కాలంగా పరిగణించి కీలక సంస్కరణల దిశగా ప్రణాళిక రూపొందించిందన్నారు. 50 కోట్లకు పైగా యువ శక్తితో భారత్ ప్రపంచంలో బలమైన దేశంగా ఉందన్నారు. కళాశాలల యాజమాన్యాలు సాంకేతిక విద్యలో విద్యార్థులకు లెర్నింగ్ ఔట్‌కమ్స్‌ను మెరుగుపర్చాలని కోరారు. ఇందుకు నైపుణ్యాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సమీకృత, మల్టీడిసిప్లినరీ కోర్సులను కచ్చితంగా ప్రవేశపెట్టాలని సూచించారు. ఇప్పటికే ఏఐసీటీఈ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం మాతృభాషలోనూ సాంకేతిక విద్యను అందిస్తోందని గుర్తు చేశారు. కళాశాలల్లో ఇన్‌టేక్, అక్రెడిటేషన్ల జారీల విషయంలో రాధాకృష్ణన్ కమిటీ సమగ్ర అధ్యయనం చేస్తోందన్నారు. కళాశాలలకు అనుమతుల ప్రక్రియను సైతం సులభతరం చేస్తున్నామని తెలిపారు. ఏటా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)లో ప్రతి కళాశాల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఏపీలో యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు..

సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ కేంద్ర ప్రభుత్వ గతిశక్తి కార్యక్రమంలో కీలకంగా మారనుందని సీతారామ్ తెలిపారు. ఇక్కడ లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రొడక్షన్ తదితర రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో అత్యధికంగా ఏపీ విద్యార్థులే ఉండటం తెలుగు వారి విద్యా ప్రతిభకు నిదర్శనమన్నారు. కంప్యూటర్ సైన్స్ ఒక్కటే సాంకేతిక విద్య కాదని తెలిపారు. అనేక కోర్ బ్రాంచ్‌లు, ఇతర రంగాల్లోని అవకాశాల గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. త్వరలో 1,500కు పైగా కంపెనీలతో కలిసి ప్లేస్‌మెంట్ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సైతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. గత మూడేళ్లలో ఉన్నత విద్యలో ఏపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయి కంపెనీల్లో సర్టిఫికేషన్లు అందించడం ద్వారా నైపుణ్య సామర్థ్యాలను పెంపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య డైరెక్టర్ నాగరాణి, అపెక్మా చైర్మన్ బొప్పా గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్య నిషేధం సాధ్యం కాదు

- బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం
- జగన్ చరిత్ర అంతా నాకు తెలుసు
- రౌడీయిజానికి భయపడను
- విద్య, వైద్యం, ఉపాధే మా ఎన్నికల నినాదం
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్



సాక్షి ప్రతినిధి, ఏలూరు/ సాక్షి, భీమవరం: రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం సాధ్యం కాదని జనసేన పార్టీ అధ్యక్షుడు కె.పవన్‌కల్యాణ్ అన్నారు. తాము అధికారంలోకి వస్తే పాత పద్ధతిలోనే మద్యం విక్రయాలు చేస్తూ.. మహిళలు వద్దన్న ప్రాంతాల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వారాహి విజయ యాత్ర సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని, ఎన్ని సమస్యలు వచ్చినా తమ పార్టీ ఎదురొడ్డి పోరాడుతుందని చెప్పారు. రాష్ట్రంలో అప్పులు చేసి అభివృద్ధిగా చూపించడం గొప్పకాదని, 2.50 లక్షల మందికి వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చి.. యువతకు మంచి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సంపద ఒకరి దగ్గరే కాదు.. అందరికీ పంచాలని, దేశంలోనే ఐటీ నిపుణులు ఎక్కువగా ఉన్నది ఆంధ్రప్రదేశ్‌లో అని చెప్పారు. సరైన రాజకీయ వ్యవస్థ లేకపోతే నిపుణులు మిగలరని అన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నారని, క్లాస్‌వార్ అంటే డబ్బు ఉన్న వాడు లేనివాడిని దోచుకోవడమని చెప్పారు. ఎవరిని ఎవరు దోచుకుంటున్నారో, నేను ఎందుకు ఊగిపోతానో మీ పార్టీ ఎంపీ రఘురామకృష్ణరాజును అడగండంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. బాధలో ఉన్నవాడు శాంతంగా ఎవరూ మాట్లాడరని తెలిపారు. క్లాస్‌వార్ చేసేవారు చివర కులం పేరు పెట్టుకోరని చెప్పారు.

సైలెన్సర్లు బిగించుకోండి..

జనసేన అధికారంలోకి వస్తే తుందుర్రు ఆక్వా పార్కు విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తామని, కేసులు ఎదుర్కొంటున్న వారందరిపై కేసులు కొట్టివేస్తామని పవన్ చెప్పారు. తనకు జనం కావాలని, అందుకే అభిమాన సంఘాలు పెట్టుకోలేదని వివరించారు. బీసీలకు రాజ్యాధికారమే తన లక్ష్యమని, తాను అన్ని కులాలను గౌరవిస్తానని తెలిపారు. జగన్ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతున్నారని, జగన్ చరిత్ర అంతా తనకు తెలుసునని, తాను రాజకీయ లబ్ధి కోసం కాకుండా ప్రజలకు అండగా ఉండడానికే రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశారు. విప్లవ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన తాను రౌడీయిజానికి భయపడనని.. అధికార పార్టీ నేతలు నోటికి సైలెన్సర్లు బిగించుకోవాలని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి ఈ మూడే జనసేన ఎన్నికల నినాదమని చెప్పారు. దేశాన్ని నడిపే వ్యక్తులతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని, అందుకే తాను ప్రధాని వరకు విషయాలు తీసుకెళ్లి పోరాడుతున్నానని చెప్పారు. తిరుమలలో శ్రీవాణి ట్రస్టు పేరుతో దేవుడి డబ్బులు దుర్వినియోగం చేస్తున్నారని, తరాలు లేచిపోతాయని హెచ్చరించారు.

జనసేనను స్థాపించాకే పచ్చటి గోదావరి జిల్లాల్లో అరాచకాలు

- తనను నమ్మినవారిని మోసం చేస్తున్న పవన్‌కల్యాణ్
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ధ్వజం



సాక్షి, భీమవరం: ప్యాకేజీ స్టార్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఆ పార్టీ నాయకులు కలవాలన్నా ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని, ఈ విషయాన్ని స్వయంగా ఆ పార్టీ జెడ్పీటీసీ సభ్యుడే చెప్పారని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రూ.లక్షలు ఇచ్చి పవన్ పక్కన కూర్చుంటున్నానంటూ జెడ్పీటీసీ సభ్యుడు చెప్పిన మాటలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయన్నారు. పచ్చని గోదావరి జిల్లాల్లో ఎన్ని రాజకీయ పార్టీలున్నా నాయకులంతా సోదరభావంతో కలసిమెలసి తిరిగేవారమని, జనసేన పార్టీ స్థాపించాక అరాచకాలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెన్నుపోటు రాజకీయాలకు పేటెంటు పొందిన నాదెండ్ల కుటుంబం నుంచి వచ్చిన నాదెండ్ల మనోహర్ జనసేనకూ వెన్నుపోటు పొడుస్తారని ప్రజలు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. పవన్ వెన్నంటి ఉన్నవారంతా ఒకప్పుడు దందాలు చేసినవారేనని, దీనిని ఆయన గ్రహించాలని సూచించారు.

చంద్రబాబు వీధి గుమ్మం వద్దే పవన్ చెప్పులు

అన్నవరంలో చెప్పులు పోయాయని గగ్గోలు పెడుతున్న పవన్ కళ్యాణ్.. అవి చంద్రబాబు ఇంటి వీధిగుమ్మం వద్దనే ఉంటాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. పవన్ వీధిగుమ్మంలోకి వచ్చి దొడ్డిగుమ్మంలోంచి సూట్‌కేసులు పట్టుకెళుతుంటారని, అందువల్ల పవన్ చెప్పులు చంద్రబాబు ఇంటి వద్దే మర్చిపోతుంటారని ధ్వజమెత్తారు. టీడీపీతో సహజీవనం చేస్తున్న పవన్.. తనను నమ్ముకున్న పార్టీ శ్రేణులు, ప్రజలను తీవ్రంగా మోసం చేస్తున్నారని అన్నారు. భీమవరం పట్టణంలోని కస్తూర్బా ప్రభుత్వ కళాశాలకు సుమారు రూ.9 కోట్ల విలువైన భూమిని ఇవ్వడం వల్లే తన తల్లిదండ్రుల పేర్లు పెట్టారని, 100 పడకల ప్రభుత్వాస్పత్రి ఏర్పాటుకు నాలుగు ఎకరాల సొంత భూమిని ఇచ్చామని, ఇది తెలుసుకోకుండా పవన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతుంటే.. చంద్రబాబేమో రాష్ట్రం శ్రీలంక అయిపోతోందంటూ పెడబొబ్బలు పెడుతూనే.. తాను అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేస్తానంటున్నాడని ఎద్దేవా చేశారు.

వపన్‌ను కలిసినప్పుడల్లా రూ.10 లక్షలు ఇస్తుంటాం..

- అందుకే ఆయన మాతో ఫొటోలు దిగుతారు
- వీరవాసరం జనసేన జెడ్పీటీసీ సభ్యుడు జయప్రకాష్ వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'జనసేన పార్టీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకే ఫొటో దిగడానికి దిక్కు లేదు.. నాలుగేళ్ల మూడు నెలలైనా ఇప్పటి వరకు ఎవరూ ఫొటోలు దిగలేదు. ఇక మేమంటే వెళ్లి ఆయన్ను కలిసినప్పుడల్లా రూ.10 లక్షలు పట్టుకెళ్లి ఇస్తాం కాబట్టి ఇక తప్పక తమతో మీటింగ్‌లు, ఫొటోలు ఉంటాయి' అని జనసేన నేత, పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్‌నాయుడు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి భీమవరంలోనే పవన్‌కళ్యాణ్ మకాం వేశారు. శుక్రవారం ఉదయం భీమవరం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి సినీ అభిమానులు, జనసేన కార్యకర్తలు వచ్చారు. బారికేడ్లు దాటుకుని కార్యకర్తలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించే క్రమంలో జయప్రకాష్‌నాయుడు అక్కడకు వచ్చి ఇలా మాట్లాడారు.

జేడీ.. మేధావేకాదు, అంత మంచివాడూ కాదు

'సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మేధావేం కాదు.. నా దృష్టిలో అంత మంచివాడు కూడా కాదు' అంటూ జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఒక టీవీ డిబేట్‌లో లక్ష్మీనారాయణపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను తానే ఒప్పించి విశాఖపట్నం టికెట్‌ను జేడీకి ఇప్పించినట్లు తెలిపారు. 'ఓడిపోయాక పార్టీ, పార్టీ ఐడియాలజీ కంటే తానే ఎక్కువ అని పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయి పార్టీని, పవన్ కళ్యాణ్‌ను తిడతాడు.. ఏ పార్టీలోనైనా చేరతాను, వైజాగ్ నుంచే పోటీ చేస్తానని మాట్లాడుతున్నాడు.. కడపలో పుట్టిన వాడు కడప, కర్నూలు కాకుండా వైజాగ్‌లో ఎందుకు పోటీ చేయాలి' అంటూ ప్రశ్నించారు. కేవలం పవన్‌కళ్యాణ్ ముఖం చూసే విరాళాలు ఇస్తారే తప్ప, ఇలాంటి మాజీ అధికారులను చూసి ఎవరూ ఇవ్వరని చెప్పారు.

రైతుబజార్లలో సబ్సిడీ టమాటా

- రైతుల నుంచి రోజుకు 50 టన్నుల సేకరణ.. కిలో రూ.98 నుంచి రూ.104 చొప్పున కొనుగోలు
- కిలో రూ.50కే విక్రయం
- సీఎం యాప్ ద్వారా కూరగాయల ధరల పర్యవేక్షణ.. నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు
- కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై ఉక్కుపాదం



విజయవాడ భవానీపురం రైతు మార్కెట్‌లో కిలో రూ.50కు టమాటా విక్రయాలు చేస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: చుక్కలనంటుతున్న టమాటా ధరల నుంచి వినియోగదారులకు ఊరట లభిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.100 దాటింది. దీంతో ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం కింద రైతుల నుంచి టమాటాను సేకరించి కిలో రూ.50 చొప్పున సబ్సిడీ ధరపై వినియోగదారులకు అందిస్తోంది. తొలుత కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోని రైతుబజార్లలో సబ్సిడీ టమాటా విక్రయాలు ప్రారంభించగా.. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లోని రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికభారమైనప్పటికీ వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని మదనపల్లి, పలమనేరు తదితర మార్కెట్లలో రైతుల నుంచి కిలో రూ.98 నుంచి రూ.104 చొప్పున చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఇలా గడిచిన నాలుగు రోజుల్లో 95 టన్నులు సేకరించారు. శుక్రవారం 36 టన్నులు సేకరించి.. బహిరంగ మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉన్న విశాఖపట్నం జిల్లాకు 20 టన్నులు, ఎన్టీఆర్ జిల్లాకు ఆరు, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు ఐదేసి టన్నుల చొప్పున తరలించి స్థానిక రైతుబజార్ల ద్వారా కిలో రూ.50 చొప్పున విక్రయించారు. శనివారం నుంచి రోజు 50 టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే నాలుగైదు రోజులు విశాఖ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు అన్నమయ్య, వైఎస్సార్, ప్రకాశం జిల్లాలకు స్థానిక అవసరాలకు తగినట్లు టమాటా నిల్వలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై ప్రభుత్వం నిఘా పెట్టింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులతో కూడిన బృందాల ద్వారా తనిఖీలకు శ్రీకారం చుడుతోంది. టమాటాతో పాటు ఇతర కూరగాయల ధరలను సీఎం యాప్‌ద్వారా నిత్యం సమీక్షిస్తూ ధరల నియంత్రణకు చర్యలు చేపట్టారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- అందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిన సీఎం జగన్
- ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు విస్తృతంగా పాల్గొనేలా చూడండి
- వైఎస్సార్‌సీపీ నేతలకు పార్టీ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి దిశానిర్దేశం
- ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో టెలీకాన్ఫరెన్స్



సాక్షి, అమరావతి: అర్హత ఉండి ఏవైనా చిన్నచిన్న కారణాల వల్ల సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందని వారికి ప్రయోజనం చేకూర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలకు పార్టీ కో–ఆర్డినేటర్, అనుబంధ విభాగాల ఇన్‌చార్జి, ఎంపీ వి.విజయసాయిరెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వారితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ క్షేత్రస్థాయి కమిటీల నిర్మాణం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారని గుర్తుచేశారు. జూలై 1వ తేదీ నుంచి మండలస్థాయి అధికారులు ఏర్పాటు చేయనున్న శిబిరాల్లో పార్టీ నాయకులు క్రియాశీలకంగా పాల్గొనేలా చూడాలని కోరారు. ప్రజలందరిని ఈ శిబిరాలకు ఆహ్వానించి సురక్ష కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ కార్యక్రమంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న సురక్ష క్యాంపు ప్రారంభానికి ముందు అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలో మీడియా సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సురక్ష కార్యక్రమంలో పథకాలు లేదా పత్రాలకు సంబంధించి తమకు ఎలాంటి సమస్యలు లేవని ప్రజలు చెబితే.. సీఎంతో వారి అభిప్రాయాన్ని పంచుకోవడానికి 'థాంక్యూ జగనన్న' అని టైప్‌చేసి 9052690526 నంబరుకు ఎస్‌ఎంఎస్ పంపించేలా చూడాలని కోరారు. పార్టీ కమిటీల ప్రతిపాదనలను జూలై 3వ తేదీలోగా పంపాలని కోరారు. అనుబంధ విభాగాల పటిష్టతతోనే పార్టీని మరింతగా బలోపేతం చేసుకోగలమన్నారు. ఇప్పటికే 18 జిల్లాల నుంచి కమిటీల జాబితాలను కేంద్ర కార్యాలయానికి సమర్పించారని, మిగిలిన 8 జిల్లాల కమిటీల జాబితాలను పంపాలని కోరారు. అలాగే పార్టీ నగర కమిటీల ప్రతిపాదలను కూడా త్వరగా పంపించాలని ఆయన సూచించారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోనంత వరకు ఎలాంటి ఆదేశాలివ్వలేం..

- విద్యుత్ పంపిణీ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుపై హైకోర్టు
- విశ్రాంత ఉద్యోగి పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి : విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 60 నుంచి 62కు పెంచే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోనంత వరకు ఈ విషయంలో ఎలాంటి ఆదేశాలివ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. పదవీ విరమణ వయస్సు పెంచే విషయంపై ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌పీడీసీఎల్) విధానపరమైన నిర్ణయం తీసుకుని, తదనుగుణంగా బోర్డు తీర్మానం చేసి, దానిని ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుందని తెలిపింది. కార్పొరేషన్ పంపే తీర్మానంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనంత వరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమంది. తన పదవీ విరమణ వయస్సును ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62కు పెంచేలా ఆదేశాలివ్వడంతో పాటు తనను ఆ మేర విధుల్లో కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగిని చెన్నమ్మ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. పదవీ విరమణ పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో ఈ వ్యాజ్యం అపరిపక్వమైనదిగా హైకోర్టు తేల్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పు వెలువరించారు.

క్లుప్తంగా...

కేంద్ర ఆర్డినెన్స్‌పై స్టే ఇవ్వండి
సుప్రీంకోర్టులో ఢిల్లీ ప్రభుత్వం పిటిషన్

న్యూఢిల్లీ: ఢిల్లీ పరిపాలన సర్వీసులపై నియంత్రణ కోసం కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను ఆప్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టే ప్రయత్నమని ఆరోపించింది. ఆర్డినెన్స్‌ను కొట్టివేయడంతోపాటు అమలుపై మధ్యంతర స్టే విధించాలని కోరుతూ శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. పోలీసు, శాంతిభద్రతలు, భూమి మినహా మిగతా సర్వీసులపై ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వానికే పెత్తనం ఉండాలని, ఇందుకోసం ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలంటూ మే 11న సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే, ఢిల్లీ ప్రభుత్వంలో పనిచేసే గ్రూప్‌-ఏ స్థాయి అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై పెత్తనం కొనసాగేలా ప్రత్యేక ఆర్డినెన్స్‌ను మే 19న కేంద్ర ప్రభుత్వం జారీ చేయడం గమనార్హం.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు మృతి

బాందా: విద్యుదాఘాతానికి గురైన ఒక బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో వేగంగా వెళ్తున్న వాహనం ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృత్యువాతపడ్డారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బాందాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. టిలౌసా గ్రామానికి చెందిన కల్లు(13) అనే బాలుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని తీసుకుని దగ్గర్లోని బబెరు ఆరోగ్య కేంద్రానికి ఎస్‌యూవీలో బయలుదేరారు. వారి వాహనం అదుపుతప్పి కమాసిన్ రోడ్డులో నిలిపిఉన్న ట్రక్కును వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ఈ ఘటనలో కల్లు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఘటన సమయంలో వారి వాహనం గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో వెళ్తోందని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ట్రక్కు డ్రైవర్ కోసం గాలిస్తున్నామన్నారు.

సొలిసిటర్ జనరల్‌గా మళ్లీ తుషార్ మెహతా

న్యూఢిల్లీ: సీనియర్ న్యాయవాది తుషార్ మెహతా భారత సొలిసిటర్ జనరల్‌గా మళ్లీ నియమితులయ్యారు. 2018లో మొదటిసారిగా సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన తుషార్ మెహతా పదవీ కాలాన్ని ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు పొడిగించింది. తాజాగా, మూడోసారి మరో మూడేళ్ల కాలానికి ఆయన్ను నియమిస్తూ సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు సుప్రీంకోర్టుకు ఆరుగురు అదనపు సొలిసిటర్ జనరల్‌ను మూడేళ్ల కాలానికి పునర్నియమించింది. వీరు..విక్రమ్‌జీత్ బెనర్జీ, కేఎం నటరాజ్, బల్బీర్‌సింగ్, ఎస్‌వీ రాజు, ఎన్ వెంకటరామన్, ఐశ్వర్య భాటి.

వియత్నాంకు యుద్ధనౌక ఐఎన్‌ఎస్ కృపాణ్‌ను కానుకగా ఇచ్చిన కేంద్రం

భారతీయ జెండా ఎగురుతూ ఉండగా సగర్వంగా విశాఖ తీరం నుంచి వియత్నాంకు బయల్దేరిన నౌక

దక్షిణ చైనా సముద్రంలో చైనా పెత్తనానికి చెక్ పడేనా?



➤ భారత్ నావికాదళంలో చురుగ్గా సేవలు అందిస్తున్న యుద్ధనౌక ఐఎన్‌ఎస్ కృపాణ్‌ను కేంద్ర ప్రభుత్వం వియత్నాంకు కానుకగా ఇచ్చింది. విదేశాలకు ఒక నౌకని బహుమతిగా ఇవ్వడం దేశ చరిత్రలో ఇదే మొదటి సారి. ఈ నౌక విశాఖ నుంచి ఈ నెల 28 బుధవారం వియత్నాంకు బయల్దేరి వెళ్లింది. 2016 నుంచి భారత్, వియత్నాం మధ్య సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇప్పటివరకు మనం ఎన్నో దేశాలకు మిలటరీ సాయం చేశాము. కానీ కోట్లాది రూపాయల విలువ చేసే యుద్ధ నౌకను ఇప్పటివరకు ఎవరికీ ఇవ్వలేదు ? ఎందుకీ నిర్ణయం? దీని వల్ల భారత్‌కు ఒరిగేదేంటి ?

ఈ కానుక
ఏ తీరాలకి..?

➤ పసిఫిక్ మహా సముద్రంలోని దక్షిణ చైనా సముద్రంపై గత కొన్నేళ్లుగా వివాదం నెలకొంది. చైనా ఈ ప్రాంతంపై తన సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకోవడాన్ని సముద్రం చుట్టూ ఉన్న దేశాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. దక్షిణ చైనా సముద్రం కేవలం డ్రాగన్‌దేనంటే ఊరుకోబోమని అందులో తమకూ భాగం ఉందని గళమెత్తుతున్నాయి. అలాంటి దేశాల్లో వియత్నాం కూడా ఒకటి. చైనా పొరుగునే ఉన్న వియత్నాం ఇండో పసిఫిక్ ప్రాంతంలో మనకి అత్యంత కీలక భాగస్వామిగా ఉంది. భావసారూప్యత కలిగిన భాగస్వామ్య దేశమైన వియత్నాం నౌకాదళ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ దేశ ఆధిపత్యానికి చెక్ పెట్టాలన్నది భారత్ వ్యూహంగా ఉంది. దక్షిణ చైనా సముద్రంపై చైనా పెత్తనం పెరుగుతున్న కొద్దీ ప్రపంచ పటంలో కొత్త మార్పులు వస్తాయన్న ఆందోళనలున్నాయి. ఇటీవల కాలంలో వియత్నాంతో మన దేశానికి ద్వైపాక్షిక సంబంధాలు బలపడుతున్నాయి. రక్షణ రంగంలో సహకరించుకుంటున్నాం. దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ దేశ పెత్తనం సహించలేనిదిగా మారింది. ఈ నేపథ్యంలో వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్ భారతదేశ పర్యటనకు వచ్చినప్పుడు ఈ యుద్ధ నౌకను కానుకగా ఇవ్వాలని భారత్ నిర్ణయించింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. ఇప్పటివరకు భారత్ ఎన్నో మిత్ర దేశాలకు మిలటరీ సాయాలు చేసింది. మాల్దీవులు, మారిషస్ వంటి దేశాలకు చిన్న చిన్న పడవలు, మిలటరీ పరికరాలు ఇచ్చింది. మయన్మార్‌కు ఒక జలాంతర్గామిని ఇచ్చింది. కానీ వియత్నాంకు క్షిపణిని మోసుకుపోగలిగే సామర్థ్యమున్న యుద్ధ నౌకను ఇవ్వడం వల్ల ఆ తీరంలో చైనా కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయడానికి వీలు కలుగుతుందన్నది భారత్ ఉద్దేశంగా ఉంది.

ప్రత్యేకతలివే..!

➤ ఐఎన్‌ఎస్ కృపాణ్ ఖుక్రీ క్లాస్‌కు చెందిన అతి చిన్న క్షిపణి యుద్ధనౌక. 1,350 టన్నుల బరువైన, సముద్రజలాలను పక్కకు తోసేస్తూ వేగంగా ముందుకు దూసుకెళ్లగల శక్తివంతమైన నౌక ఇది.

➤ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, ఇంజనీర్లు రూపొందించిన ఈ నౌక గత కొన్నేళ్లుగా మన నావికాదళానికి గర్వకారణంగా ఉంది.

➤ 1991 జనవరి 12న దీనిని నావికాదళంలోకి ప్రవేశపెట్టారు.. 25 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు.

➤ మీడియం రేంజ్ గన్స్ అంటే 30 ఎంఎం తుపాకీలను ఈ నౌకకు అమర్చవచ్చు. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణులు, చాఫ్ లాంచర్స్ వంటి వైవిధ్యమైన పనులు చేయగలదు.

➤ తీరప్రాంతాల్లో భద్రత, గస్తీ, కదనరంగంలో పాల్గొనడం, యాంటీ పైరసీ, విపత్తు సమయాల్లో మానవతా సాయం వంటివి చేయగల సామర్థ్యముంది.



దక్షిణ చైనా సముద్రం వివాదమేంటి?

➤ దక్షిణ చైనా సముద్రంపై సుదీర్ఘకాలంగా వివాదం నడుస్తోంది. ఈ సముద్ర భూభాగంపై సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకున్న చైనా ఏకంగా కృత్రిమ దీవులను నిర్మిస్తోంది. ఈ సముద్రంలో ఎన్నో దీవులున్నాయి. మత్స్య సంపద అపారంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా చేపల ఉత్పత్తిలో 15 శాతం ఈ సముద్రంలో జరుగుతుంది. దీనిపై చైనా సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకోవడం ఇతర దేశాలకు మింగుడు పడడం లేదు.ఈ సముద్రంలో ఉన్న అన్ని ద్వీపాలను ఒకే రేఖ మీద చూపిస్తూ చైనా విడుదల చేసిన ''నైన్ డ్యాష్ లైన్' మ్యాప్‌తో తన వేనని వాదిస్తోంది. ఈ సముద్రంలో భారీగా నున్న చమురు నిల్వలపై అన్వేషణ కూడా ప్రారంభం కావడంతో దేశాల మధ్య పోటీ ఎక్కువైంది. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రం మధ్యలో దక్షిణ చైనా సముద్రం ఉండడం వల్ల అక్కడ చైనా జోక్యం పెరిగితే భారత్‌కూ నష్టమే. ఈ సముద్రం చుట్టూ చైనా, తైవాన్, వియత్నాం, మలేసియా, ఇండోనేసియా, బ్రూనై, ఫిలిప్పీన్స్ దేశాలున్నాయి. ఇవి కూడా సముద్రంలో తమకూ వాటా ఉందని ప్రకటించాయి. మరోవైపు చైనా కృత్రిమ దీవులు, సైనిక స్థావరాలతో ఉద్రిక్తతలు చెలరేగుతూనే ఉన్నాయి. ఈ పరిణామాల మధ్య మనం పంపిన కృపాణ్ దక్షిణ చైనా జలాల్లో ఎంత మేరకు నిఘా పెడుతూ డ్రాగన్‌కు చెక్ పెడుతుందో వేచిచూడాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఫ్రాన్స్‌లో ఆగని నిరసనలు

- 667 మంది ఆందోళనకారుల అరెస్ట్
- పారిస్ శివారు ప్రాంతాల్లో కర్ఫ్యూ
- 200 మంది పోలీసులకు గాయాలు

పారిస్: ఫ్రాన్స్‌లో పోలీసు కాల్పుల్లో యువకుడి మృతి ఘటన అనంతరం మొదలైన ఉద్రిక్తతలు మూడో రోజు రాత్రి కూడా కొనసాగాయి. నిరసనకారులు వీధుల్లో అడ్డంకులు ఏర్పాటు చేసి, కార్లు, దుకాణాలు, ప్రభుత్వ భవనాలకు నిప్పుపెడుతున్నారు. పోలీసులపై రాళ్లతో దాడులు చేస్తున్నారు. బాణసంచా కాల్చి పోలీసుల పైకి వదులుతున్నారు. పారిస్ శివారుల్లో ఆందోళనకారులు ఒక బస్‌డిపోకు, రోడ్లపై కార్లకు నిప్పుపెట్టారు. పారిస్‌లోని 12వ డిస్ట్రిక్ట్ పోలీస్‌స్టేషన్‌పై దాడి జరిగింది. రివోలీ వీధిలోని కొన్ని దుకాణాలను, నగరంలోని అతిపెద్ద షాపింగ్ మాల్ ఫోరం డెస్ హాలెస్‌ను దోచుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు అధికారులు 40వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. టియర్ గ్యాస్, వాటర్ కెనన్లను ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొడ్తున్నారు. శివారు ప్రాంతాల్లో రాత్రి వేళ కర్ఫ్యూ విధిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా పారిస్‌లో బస్సు, ట్రామ్ సర్వీసులను నిలిపివేశారు. ఆందోళనకారుల దాడుల్లో 200 మంది పోలీసులు గాయపడ్డారు. అదుపులోకి తీసుకున్న 667 మంది ఆందోళనకారుల్లో 307 మంది పారిస్ రీజియన్‌కు చెందినవారేనని అధికారులు తెలిపారు. ప్రశాంత పరిస్థితులను నెలకొల్పేందుకు కఠినంగా వ్యవహరిస్తామని అంతరంగిక శాఖ మంత్రి గెరాల్డ్ ప్రకటించారు. ఇలా ఉండగా, పారిస్ శివారు నాంటెర్రె వద్ద మంగళవారం యువకుడిపై కాల్పులు జరిపిన పోలీసు అధికారిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన 17 ఏళ్ల నహేల్ కుటుంబం ఆఫ్రికా దేశం అల్జీరియా నుంచి వలస వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనతో మరోసారి ఫ్రాన్స్ పోలీసుల జాతి దురహంకార వైఖరిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాదిలో మరో ఇద్దరిని కూడా పోలీసులు తనిఖీల సమయంలోనే కాల్చిచంపినట్లు చెబుతున్నారు. ఫ్రాన్స్ అల్లర్లు బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌కు కూడా పాకాయి. బాహాబాహీకి దిగిన 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలు చోట్ల ఆందోళనకారులు భవంతులకు, వాహనాలకు నిప్పుపెట్టారని ప్రభుత్వం తెలిపింది.

టీనేజర్లను బయటకు రానివ్వకండి: తల్లిదండ్రులకు మాక్రాన్ వినతి

దేశమంతటా వ్యాపిస్తున్న అల్లర్లను అణచివేసే క్రమంలో టీనేజీ యువకులను ఇంట్లోనే ఉంచి తోడ్పడాలని అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ తల్లిదండ్రులను కోరారు. దేశంలో అల్లర్లకు సోషల్ మీడియానే హింసను ప్రేరేపిస్తోందని ఆరోపించారు. శుక్రవారం ఆయన సీనియర్ మంత్రులతో అత్యవసరంగా సమావేశమై శాంతి భద్రతలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసు కాల్పుల్లో 17 ఏళ్ల యువకుడి మృతి అనంతరం అశాంతిని వ్యాపింపజేయడంలో సోషల్ మీడియానే ప్రముఖంగా ఉందన్నారు. హింసాత్మక ఘటనలకు ప్రేరణ కలిగిస్తున్న సామాజిక మాధ్యమ వేదికలైన స్నాప్ చాట్, టిక్‌టాక్ వంటివి సున్నిత అంశాలకు సంబంధించిన కంటెంట్‌ను తొలగించాలని కోరారు. వీడియో గేమ్‌లు యువత మెదళ్లను విషతుల్యం చేస్తున్నాయని, దీంతో కొందరు అస్తమానం వీధుల్లోనే గడుపుతున్నారని వ్యాఖ్యానించారు.



పారిస్ శివారులోని నాంటెర్రెలో దహనమవుతున్న వాహనాలు

ఎస్‌సీవో వర్చువల్ భేటీకి జిన్‌పింగ్

బీజింగ్: భారత్ ఆధ్వర్యంలో జూలై 4వ తేదీన వర్చువల్‌గా జరగనున్న షాంఘై సహకార సంఘం (ఎస్‌సీవో) శిఖరాగ్ర భేటీకి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు కానున్నారు. ఈ విషయాన్ని డ్రాగన్ దేశం చైనా శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో 23వ ప్రభుత్వాధినేతల సమావేశానికి జిన్‌పింగ్ హాజరవుతారని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మీడియాకు తెలిపారు. 2001లో ఏర్పాటైన ఎస్‌సీవోలో భారత్, పాక్‌లు 2017లో శాశ్వత సభ్యదేశాలయ్యాయి. రొటేషన్ విధానంలో భారత్‌కు ఈ ఏడాది అధ్యక్ష స్థానం దక్కింది.

మన వర్సిటీలు ప్రపంచంలో మేటి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- క్యూఎస్ గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో 45 వర్సిటీలకు స్థానం
- అమెరికాతో ఒప్పందాలతో మన యువతకు నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఢిల్లీ యూనివర్సిటీ శతాబ్ది వేడుకలకు హాజరైన ప్రధాని మోదీ



రైలు బోగీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లలో అమల్లోకి తీసుకొచ్చిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలతో భారతీయ విశ్వవిద్యాలయాలకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మన వర్సిటీలు ప్రపంచంలో అగ్రగామిగా ఎదుగుతున్నాయని చెప్పారు. శుక్రవారం ఢిల్లీ యూనివర్సిటీ శతాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014లో క్యూఎస్ గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో కేవలం 12 భారతీయ యూనివర్సిటీలు చోటు దక్కించుకున్నాయని, ఇప్పుడు వాటి సంఖ్య 45కు చేరుకుందని గుర్తుచేశారు. దేశ వ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్, ఎన్ఐటీల సంఖ్య పెరిగిందని చెప్పారు. నవ భారత నిర్మాణంలో అవి విశిష్టమైన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఇటీవల జరిగిన తన అమెరికా పర్యటనను మోదీ ప్రస్తావించారు. మన దేశ యువత పట్ల ప్రపంచానికి విశ్వాసం పెరిగిందన్నారు. అమెరికాతో పలు ఒప్పందాలు కుదుర్చుకున్నామని, వీటివల్ల అంతరిక్షం, సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధ వంటి కీలక రంగాల్లో మన దేశ యువతకు నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

మన విద్యా వ్యవస్థకు ఘన చరిత్ర

మైక్రాన్, గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు భారత్‌లో పెట్టుబడులు భారీగా పెట్టబోతున్నాయని, మనదేశ ఉజ్వల భవిష్యత్తుకు ఇదొక సూచిక అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఢిల్లీ యూనివర్సిటీ అంటే కేవలం ఒక విద్యాలయం కాదని, ఒక ఉద్యమమని వ్యాఖ్యానించారు. ప్రాచీన కాలంలో నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలు సంతోషానికి, సౌభాగ్యానికి వనరులుగా నిలిచాయని చెప్పారు. భారతీయ విద్యావ్యవస్థకు ఘన చరిత్ర ఉందన్నారు. విదేశీయుల నిరంతర దాడుల వల్ల భారతీయ విద్యావ్యవస్థ కుప్పకూలిందని, తద్వారా అభివృద్ధి ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం వర్సిటీలు నైపుణ్యం కలిగిన యువతను దేశానికి అందించాయని, అభివృద్ధికి పాటుపడ్డాయని మోదీ ప్రశంసించారు.

'యుగే యుగే భారత్' మ్యూజియం

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో గిరిజన ప్రదర్శనశాలలు(మ్యూజియమ్స్) ఏర్పాటు చేశామని, ఢిల్లీలోని 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం' ద్వారా స్వతంత్ర భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని తెలుసుకోవచ్చని నరేంద్ర మోదీ చెప్పారు. 'యుగే యుగే భారత్' పేరిట ప్రపంచంలోనే అతిపెద్ద హెరిటేజ్ మ్యూజియాన్ని ఢిల్లీలో నిర్మిస్తున్నామని తెలిపారు. మన స్టార్టప్ కంపెనీల సంఖ్య లక్ష మార్కును దాటిందన్నారు. 2014లో కేవలం వందల సంఖ్యలోనే స్టార్టప్‌లు ఉండేవన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ కంప్యూటర్ సెంటర్, ఫ్యాకల్టీ ఆఫ్ టెక్నాలజీ భవనాలు, నార్త్ క్యాంపస్ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ప్రధాని పునాదిరాయి వేశారు. ఢిల్లీ యూనివర్సిటీ 1922 మే 1న ఏర్పాటైంది. ప్రస్తుతం ఈ వర్సిటీలో 86 డిపార్ట్‌మెంట్లు, 90 కాలేజీలు ఉన్నాయి.

మెట్రో రైలులో మోదీ ప్రయాణం

ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణించారు. ఢిల్లీ యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయన మెట్రో రైలులో వచ్చారు. రైలులో విద్యార్థులతో సరదాగా సంభాషించారు. అనంతరం ఢిల్లీ యూనివర్సిటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన మెట్రో రైలు ప్రయాణ అనుభవాన్ని పంచుకున్నారు. ఓటీటీల్లో ప్రసారమవుతున్న కొత్త వెబ్ సిరీస్‌ల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. ఏ వెబ్ సిరీస్ బాగుంది? ఏ రీల్స్ బాగున్నాయో వారు చెప్పగలరని పేర్కొన్నారు. మాట్లాడేందుకు విద్యార్థుల వద్ద ఎన్నో అంశాలు ఉన్నాయన్నారు. సైన్స్ నుంచి ఓటీటీల్లోని కొత్త వెబ్ సిరీస్‌ల దాకా చాలా విషయాలను వారితో మాట్లాడొచ్చని వెల్లడించారు. ఏ ఒక్క అంశాన్నీ వారు వదిలిపెట్టరని వ్యాఖ్యానించారు. భూగోళంపై ఉన్న అన్ని అంశాలను విద్యార్థులు చక్కగా చర్చించగలరని ట్వీట్ చేశారు.

మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించండి
గవర్నర్‌ను కోరిన రాహుల్ గాంధీ

ఇంఫాల్: సమాజంలో నెలకొన్న సమస్యలకు, వివాదాలకు హింసాకాండ ఎంతమాత్రం పరిష్కార మార్గం కాదని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ శుక్రవారం మణిపూర్ గవర్నర్ అనసూయ ఉయికేతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఘర్షణకు తెరదించి, శాంతియుత పరిస్థితులు నెలకొనేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మణిపూర్ ప్రజల దుఃఖాన్ని పంచుకోవడానికి తాను ఇక్కడికి వచ్చానని రాహుల్ చెప్పారు. రాహుల్ శుక్రవారం ప్రజా సంఘాల సభ్యులతో సమావేశమై తాజా పరిస్థితిపై వారితో చర్చించారు.

పదవి నుంచి తప్పుకోను..: బిరేన్ సింగ్

మణిపూర్‌లో జాతుల మధ్య ఎడతెగని ఘర్షణల నేపథ్యంలో సీఎం రాజీనామా చేశారంటూ వస్తున్న వదంతులకు ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ చెక్‌పెట్టారు. పదవి నుంచి వైదొలగడం లేదని స్పష్టతనిచ్చారు. శుక్రవారం రాజ్‌భవన్ వైపు వెళ్తున్న సీఎం కాన్వాయ్‌ను పెద్దసంఖ్యలో ప్రజలు అడ్డగించారు. ఈ సందర్భంగా ఆయన.. సీఎం పదవికి రాజీనామా చేయడం లేదని ప్రకటించారు. ఇలా ఉండగా, గురువారం కాంగ్‌పోక్పి జిల్లాలో ఆందోళనకారులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో గాయపడిన అయిదుగురిలో ఒకరు శుక్రవారం ఆస్పత్రిలో చనిపోయారు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది.

నరేంద్ర మోదీ బిగ్ ఫ్రెండ్
భారత ప్రధానిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు




మాస్కో: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ రష్యాకు గొప్ప మిత్రుడు(బిగ్ ఫ్రెండ్) అని పేర్కొన్నారు. మోదీ కొన్నేళ్ల క్రితం ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేస్తోందని కొనియాడారు. గురువారం మాస్కోలో ఏజెన్సీ ఫర్ స్ట్రాటెజిక్ ఇనీషియేటివ్స్(ఏఎస్ఐ) కార్యక్రమంలో పుతిన్ మాట్లాడారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. మనం కాకపోయినా, మన స్నేహితుడు చేసిన పని సత్ఫలితాలు ఇస్తుంటే అనుకరించడంలో తప్పేమీ లేదన్నారు. స్థానికంగా తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా భారత నాయకత్వం ప్రభావవంతమైన విధానాలను సృష్టిస్తోందని, విదేశీ పెట్టుబడిదారులను అమితంగా ఆకర్షిస్తోందని చెప్పారు. పుతిన్, నరేంద్ర మోదీ చివరిసారిగా 2022 సెప్టెంబర్‌లో ఉజ్బెకిస్తాన్‌లో ఓ సదస్సు సందర్భంగా కలుసుకున్నారు.

ద్వైపాక్షిక, వ్యూహాత్మక బంధాలు బలోపేతం చేసుకుందాం

తమ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ నిర్ణయించుకున్నారు. ఇరువురు నేతలు శుక్రవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఉక్రెయిన్‌లో సంఘర్షణతోపాటు అంతర్జాతీయ పరిణామాలపై చర్చించుకున్నారు. కీలక రంగాల్లో భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సహకారంలో పురోగతిని ఇరువురూ సమీక్షించారు. ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా పరస్పర ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రెండు దేశాల నడుమ వ్యాపార, వాణిజ్యాల విలువ నానాటికీ పెరుగుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లో ఘర్షణ ఆగిపోవాలన్నదే తమ ఉద్దేశమని, దౌత్య మార్గాల్లో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఉక్రెయిన్ నాయకత్వం అందుకు అంగీకరించడం లేదని మోదీకి పుతిన్ తెలియజేశారు. వివాదాలకు తెరదించడానికి దౌత్య ప్రయత్నాలు, చర్చలే మార్గమని మోదీ పునరుద్ఘాటించారు. మోదీ, పుతిన్ మధ్య అర్థవంతమైన, నిర్మాణాత్మక సంభాషణ జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి.


రాహుల్ ప్రధాని అయితే స్కాములే గతి
కేంద్ర హోం మంత్రి అమిత్ షా



ఉదయ్‌పూర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే దేశం కుంభకోణాలు, అవినీతిమయంగా మారుతుందని హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. మళ్లీ నరేంద్ర మోదీయే ప్రధానమంత్రి అయితే మోసగాళ్లంతా కటకటాల వెనక్కి వెళ్తారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయ్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. పట్నాలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష నేతల భేటీపై ఆయన..'అక్కడ సమావేశమైన వారంతా అవినీతితో సంబంధం ఉన్నవాళ్లే. వారి ఆరాటమంతా తమ కుమారుల భవిష్యత్తు కోసమే తప్ప ప్రజలకు మంచి చేయడం కాదు'అని విమర్శించారు. 'రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే సోనియా గాంధీ లక్ష్యం. లాలూ ప్రసాద్ యాదవ్ లక్ష్యం తేజస్వీయాదవ్‌ను ప్రధానిని చేయడం, తన మేనల్లుడు అభిషేక్‌ను సీఎంను చేయడమే మమతా బెనర్జీ లక్ష్యం. కొడుకు వైభవ్ గెహ్లాట్‌ను సీఎంను చేయడం అశోక్ గెహ్లాట్ లక్ష్యం'అని ఆయన ఎద్దేవా చేశారు. రాజస్తాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. గత ఏడాది ఉదయ్‌పూర్‌లో జరిగిన కన్హయ్య లాల్ హత్య కేసులో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి ఉంటే, ఇప్పటికే నిందితులకు ఉరిశిక్ష పడి ఉండేదని పేర్కొన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న సీఎం గహ్లోత్ వల్లే నిందితులకు శిక్ష పడటం ఆలస్యమవుతోందని ఆరోపించారు. సస్పెండైన బీజేపీ నేత నుపుర్ శర్మకు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ కన్హయ్య లాల్ అనే దర్జీని గత ఏడాది ఇద్దరు దుండగులు పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో కన్హయ్యలాల్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కల్పించలేకపోయిందని మంత్రి అన్నారు.

సురోవికిన్ కూడా వాగ్నర్ సభ్యుడే


సీఎన్ఎన్ కథనంలో వెల్లడి



న్యూయార్క్: రష్యాలో వాగ్నర్ గ్రూప్ తిరుగుబాటు ఘటన అక్కడి మిలటరీలో లుకలుకలను ఒకటొకటిగా బయట పెడుతోంది. తాజాగా, రష్యా టాప్ మిలటరీ కమాండర్ జనరల్ సెర్గెయ్ సురోవికిన్ వాగ్నర్ గ్రూప్‌లో రహస్య వీఐపీ సభ్యుడని తెలిపే కొన్ని పత్రాలు దొరికినట్లు సీఎన్ఎన్ పేర్కొంది. వాగ్నర్ వీఐపీ సభ్యుడిగా సురోవికిన్ పేరు 2018లో నమోదైనట్లు అందులో తెలిపింది. ఆయనతోపాటు మరో 30 మంది రష్యా సీనియర్ మిలటరీ, ఇంటెలిజెన్స్ అధికారులు కూడా వాగ్నర్ వీఐపీ సభ్యులని పేర్కొంది. వాగ్నర్ సభ్యుడిగా సురోవికిన్ ఉన్నారనేందుకు కచ్చితమైన ఆధారాలేవీ లేనప్పటికీ, రష్యా సైనిక బలగాల్లోని చాలా మంది సీనియర్ అధికారులు వాగ్నర్ గ్రూప్‌తో దగ్గరి సంబంధాలు సాగించేందుకు అవకాశం ఉందని సీఎన్ఎన్ కథనం పేర్కొంది. ఇలాంటి దగ్గరి సంబంధాల వల్లే వాగ్నర్ కిరాయి సైనికులు రొస్తోవ్‌లోని కీలక మిలటరీ బేస్‌ను శ్రమ లేకుండా స్వాధీనం చేసుకోగలిగారన్న అనుమానాలున్నాయి. తిరుగుబాటు అనంతరం సురోవికిన్ కనిపించకుండా పోయారు. ప్రిగోజిన్ తిరుగుబాటు విషయం ఆయనకు తెలుసునంటూ న్యూయార్క్‌టైమ్స్ కథనం పేర్కొంది. ప్రిగోజిన్‌ను తిరుగుబాటు ఆపేయాలంటూ విడుదల చేసిన వీడియోలో సురోవికిన్ తడబడుతూ మాట్లాడుతున్నట్లు కనిపించారు. దీంతో, ఆయన మానసిక ఆరోగ్యంపైనా అనుమానాలున్నాయి. జనరల్ ఆర్మగెడ్డాన్‌గా పిలుచుకునే సురోవికిన్ అధ్యక్షుడు పుతిన్‌కు నిన్నటిదాకా నమ్మినబంటు. తాజా పరిణామాలతోనూ ఆయన్ను పుతిన్ నమ్ముతారా అన్నది తేలాల్సి ఉంది.

ఎగిరే కారుకు అమెరికా అనుమతి

- 2025 నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తామన్న అలెఫ్ కంపెనీ
- మోడల్‌-ఎ ధర రూ. 2.46 కోట్లు.. ప్రారంభమైన బుకింగ్



కాలిఫోర్నియా: తాము తయారు చేసిన ఎగిరే కారు(ఫ్లయింగ్ కారు)కు అమెరికా ప్రభుత్వం నుంచి చట్టబద్ధ అనుమతి లభించిందని కాలిఫోర్నియాకు చెందిన అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ ప్రకటించింది. ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్(ఈవీటీఓఎల్) వెహికల్ అని పిలిచే ఈ కారు పూర్తిగా విద్యుత్‌తో పనిచేస్తుంది. ఫ్లయింగ్ కారును తొలిసారిగా 2022 అక్టోబర్‌లో అలెఫ్ కంపెనీ ఆవిష్కరించింది. రోడ్లపైనే పరుగులు తీయడమే కాదు, గాల్లోనూ ప్రయాణించడం ఈ కారు ప్రత్యేకత. హెలికాప్టర్ తరహాలో గాల్లోకి నిలువుగా ఎగరగలదు. నిలువుగా భూమిపై దిగగలదు. మోడల్‌-ఎ ఫ్లయింగ్ కారు ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేస్తే రోడ్డుపై 200 మైళ్లు(322 కిలోమీటర్లు), గాలిలో 110 మైళ్లు(177 కిలోమీటర్లు) ప్రయాణించగలదు. ఇద్దరు వ్యక్తులు ఇందులో ప్రయాణించవచ్చు. ఈ కారు ప్రారంభ ధర 3 లక్షల అమెరికన్ డాలర్లు(రూ.2.46 కోట్లు). 150 డాలర్లు (రూ.12,308) చెల్లించి అలెఫ్ వెబ్‌సైట్ ద్వారా ఫ్లయింగ్ కారును బుక్ చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రజల నుంచే కాకుండా కంపెనీల నుంచి కూడా ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయని అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ వెల్లడించింది. మోడల్‌-ఎ కార్ల ఉత్పత్తిని 2025 నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని ప్రకటించింది. తమ ఎగిరే కారుకు యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) నుంచి స్పెషల్ ఎయిర్‌వర్తీనెస్ సర్టిఫికెట్ లభించిందని అలెఫ్ సంస్థ హర్షం వ్యక్తం చేసింది. ఇలాంటి వాహనానికి అమెరికా ప్రభుత్వం నుంచి అనుమతి రావడం ఇదే మొదటిసారి అని తెలియజేసింది. మోడల్‌-ఎ మాత్రమే కాకుండా మోడల్‌-జెడ్ తయారీపైనా అలెఫ్ సంస్థ దృష్టి పెట్టింది. మోడల్‌-జెడ్‌ను 2035 నుంచి మార్కెట్‌లోకి తీసుకురావాలని భావిస్తోంది. ఈ మోడల్ డ్రైవింగ్ రేంజ్, ఫ్లయింగ్ రేంజ్ మరింత అధికంగా ఉంటుంది. ఇందులో ఆరుగురు ప్రయాణించవచ్చు.

3న పేనాపై సుప్రీంకోర్టులో విచారణ

సాక్షి, చెన్నై: చెన్నై మెరీనా తీరంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి రూ.81 కోట్ల ఖర్చుతో పేనా స్మారక మండపాన్ని నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ స్థితిలో పేనా స్మారకానికి వ్యతిరేకంగా రామనాథపురం జిల్లాకు చెందిన జాలరి నల్లతంబి గత ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం పేనా స్మారక నిర్మాణానికి నిర్ణయించిందని, సముద్రంలో పేనా స్మారకాన్ని నిర్మించడం వలన 32 గ్రామాల జాలర్ల జీవనాధారం దెబ్బతింటుందని, కనుక పేనా స్మారక నిర్మాణంపై నిషేధం విధించాలని కోరారు. ఈ కేసు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజయ్ కిషన్‌కౌల్ కూడిన బెంచ్ జూలై 3వ తేదీ విచారించనుంది.

బాసులు బాధ్యతల స్వీకరణ

- సీఎస్‌గా శివదాస్ మీనా
- డీజీపీగా శంకర్ జివ్వాల్
- కమిషనర్‌గా సందీప్‌రాయ్ రాథోర్
- సీఎం ఆశీస్సులు
- ఇరైఅన్బు, శైలేంద్రబాబు ఉద్యోగ విరమణ



సీఎంతో సీఎస్ శివదాస్ మీనా, శంకర్‌జివ్వాల్, సందీప్‌రాయ్ రాథోర్

సాక్షి, చెన్నై: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శివదాస్ మీనా, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీగా శంకర్ జివ్వాల్, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా సందీప్‌రాయ్ రాథోర్ బాధ్యతలు స్వీకరించారు. వీరికి సహచర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎస్‌గా పనిచేసిన ఇరైఅన్బు, డీజీపీగా పనిచేసిన శైలేంద్రబాబు ఉద్యోగ విరమణ చేశారు.

డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇరైఅన్బు, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీగా శైలేంద్రబాబు, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా శంకర్ జివ్వాల్ సీఎం స్టాలిన్ వెన్నంటి ఉంటూ వచ్చారు. ప్రభుత్వ పాలనాపరంగా సంపూర్ణ సహకారం అందించారు. వీరిలో ఇరైఅన్బు, శైలేంద్రబాబు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ రెండు కీలక పదవులకు తనకు సన్నిహితులుగా ఉన్న వారినే సీఎం స్టాలిన్ ఎంపిక చేశారు. అన్నాడీఎంకే పాలకులతో విసిగి వేసారి ఢిల్లీ వెళ్లిపోయిన సీనియర్ ఐఏఎస్ అధికారి శివదాస్ మీనాను మళ్లీ రాష్ట్రానికి సీఎం స్టాలిన్ రప్పించుకున్నారు. ప్రస్తుతం ఆయనకే సీఎస్ బాధ్యతలను అప్పగించారు. మధ్యాహ్నం సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన శివదాస్ మీనాకు సహచర ఐఏఎస్ అధికారులు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ముందుగా సీఎం స్టాలిన్ ఆశీస్సులు, అభినందనలను శివదాస్ మీనా అందుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఇరైఅన్బుకు ఘనంగా వీడ్కోలు పలికారు.

డీజీపీగా బాధ్యతల స్వీకరణ..

మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో డీజీపీగా శంకర్ జివ్వాల్ బాధ్యతలు స్వీకరించారు. తన బాధ్యతలను ఆయనకు శైలేంద్రబాబు అప్పగించారు. కొత్త డీజీపీకి అభినందనలు తెలియజేశారు. అలాగే, సీనియర్ ఐపీఎస్‌లు అనేకమంది కొత్త డీజీపీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా శంకర్‌జివ్వాల్ మీడియాతో మాట్లాడుతూ గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్‌ను మోడ్రన్ చేశానని గుర్తుచేశారు. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసు యంత్రాంగాన్ని ఆధునీకరిస్తామన్నారు. సాంకేతికపరంగా పెద్ద పీట వేస్తామన్నారు. పెరుగుతున్న కొత్త రకం నేరాలను పసిగట్టేందుకు కొత్త సాంకేతికత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నేరాల కట్టడి లక్ష్యంగా, నేరగాళ్లపై ఉక్కు పాదం మోపే విధంగా తన పయనం కొనసాగుతుందన్నారు. ముందుగా శంకర్ జివ్వాల్ చేతిలో ఉన్న చెన్నై కమిషనర్ పదవిని కొత్త బాసు సందీప్ రాయ్ రాథోర్ స్వీకరించారు. చెన్నై పూందమల్లి హైరోడ్డులోని కమిషనరేట్‌లో కొత్త పోలీసు కమిషనర్‌గా సందీప్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. డీజీపీగా ఉద్యోగ విరమణ పొందిన శైలేంద్రబాబుకు పోలీసు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

చెన్నైలోకి ఆయుధాలతో చొరబాటు

- 11 మంది అరెస్ట్
- ఉద్రిక్తత
- సాగర్ కవచ్ మాక్ డ్రిల్

సాక్షి, చెన్నై: సముద్ర మార్గంలో చెన్నైలోకి ఉదయాన్నే 11 మంది ముష్కరుల వేషంలో ప్రవేశించారు. వీరిని భద్రతా బలగాలు తుపాకీ నీడలో చుట్టుముట్టాయి. సినీ తరహాలో ఉత్కంఠ రేపే విధంగా ఈ ఘటన సముద్ర తీరంలో చోటుచేసుకుంది. అయితే, ఇది సాగర్‌కవచ్ మాక్ డ్రిల్ అని తేలడంతో సర్వత్రా ఊపిరి పీల్చుకున్నారు. ముంబై పేలుడు ఘటన తర్వాత ప్రతి ఏటా ఆరు నెలలకు ఒకసారి సముద్రతీర భద్రతను పర్యవేక్షించే విధంగా సాగర్ కవచ్ మాక్ డ్రిల్‌ను రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతోంది.

నిఘా నీడలో..

గురువారం ఉదయం చెన్నై నుంచి కన్యాకుమారి వరకు ఉన్న సముద్ర తీర జిల్లాల్లో సాగర్ కవచ్ మాక్ డ్రిల్ మొదలైంది. రెండు రోజులు పాటు కంటి మీద కునుకులేకుండా సముద్ర తీరాలలో పనిచేస్తున్న సిబ్బంది డేగ కళ్లతో నిఘా వేశారు. తమ అధికారులు ముష్కరుల వేషాలతో చొరబడతారని ప్రకటించిన నేపథ్యంలో వారిని వదిలి పెడితే చీవాట్లు తప్పవన్న ఆందోళనతో అప్రమత్తంగా పోలీసులు వ్యవహరించారు. సముద్ర తీర భద్రతా విభాగం, కోస్టుగార్డు, పోలీసు యంత్రాంగం విభాగాలకు చెందిన వారు అప్రమత్తంగా వ్యవహరించారు. చెన్నైలో తిరువాన్మియూరు నుంచి మెరీనా తీరం వెంబడి భద్రతను కట్టుదిట్టం చేసి తనిఖీలలో నిమగ్నమయ్యారు. ఉదయాన్నే ఓ పడవలో కొందరు నగరంలోకి చొరబడే ప్రయత్నం చేయడానికి గుర్తించిన భద్రతా సిబ్బంది తుపాకులతో వారిని చుట్టుముట్టారు. వారి నుంచి ఆయుధాలను స్వాధీనం వారు చేసుకున్నారు. ఉదయాన్నే ఈ ఘటనను అటు వైపుగా వెళ్లిన వాకర్లు చూసి తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. అయితే, ఇది మాక్‌డ్రిల్‌గా తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. ముష్కరుల వేషాలలో వచ్చిన 11 మంది పోలీసుల అధికారులను, వారి నుంచి డమ్మీ ఆయుధాలను స్వాధీనం చేసుకున్న భద్రతా సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు

న్యూస్‌రీల్

విద్యుత్ వాహనాలకు పర్మిట్ ఫీజు రద్దు

సాక్షి, చెన్నై: ఎలక్ట్రిక్, బ్యాటరీ వాహనాలకు పర్మిట్ ఫీజును రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రిక్ వాహన రాయితీలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఉత్తర్వులను హోంశాఖ కార్యదర్శి అముదా జారీ చేశారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు విస్తృతం చేసింది. ఈ ఉత్పత్తి రంగంలోకి పెట్టుబడులను ఆహ్వానించే విధంగా ప్రత్యేక పాలసీని సైతం ప్రకటించింది. అలాగే, విద్యుత్, బ్యాటరీ వాహనాలను ఉపయోగించే వారికి, కొనుగోలు చేసే వారికి పలు రకాల రాయితీలను ఇస్తున్నారు. ఈ పరిస్థితులలో ఎలక్ట్రిక్, బ్యాటరీ వాహనాలకు పర్మిట్ ఫీజును రాష్ట్రంలో రద్దు చేశారు. తమిళనాడులోకి పర్యాటక వాహనాలకు సైతం ఇది వర్తింపజేశారు. మిథనాల్, ఎతనాల్ ఇంధనంతో నడిచే వాహనాలకు కూడా పర్మిట్ రద్దు చేశారు. సరకుల వాహనాలు మినహా, 3 వేల కిలోలలోపు బరువు కలిగిన వాహనాలకు సైతం ఈ రద్దు వర్తింపచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రికార్డు స్థాయిలో పవన విద్యుత్ ఉత్పత్తి

- పవన విద్యుత్ ఉత్పత్తి 3,500 మెగావాట్లు
- గాలి వేగంతో మరింత పెరిగే అవకాశం


కొరుక్కుపేట: తిరునల్వేలి సహా జిల్లాల్లో గాలి వేగం పెరుగుతుండడంతో పవన విద్యుత్ ఉత్పత్తి 3,500 మెగావాట్లను దాటింది. దేశంలో పవన విద్యుత్ ఉత్పత్తిలో తమిళనాడు ముందుంది. తమిళనాడులో 10 వేలకు పైగా పవన క్షేత్రాలున్నాయి. ప్రస్తుతం గాలీవాన సీజన్ ప్రారంభం కావడంతో నెల్లై జిల్లాలో గత 3 వారాలుగా గాలి టర్బైన్లు విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నాయి. తెన్కాసి, కుమరి, తుత్తుకుడి జిల్లాల్లో ప్రతి ఏటా మే నెలాఖరు నుంచి ఆగస్టు నెలాఖరు వరకు పవన క్షేత్రాల నుంచి అత్యధికంగా విద్యుత్ అందుబాటులో ఉంటుంది. తమిళనాడులో విద్యుత్ వినియోగం 19 వేల మెగావాట్లకు పెరగడంతో పవన విద్యుత్ ఉత్పత్తి అప్పుడప్పుడు అవసరమైన విద్యుత్‌ను భర్తీ చేయడానికి సహాయపడుతుంది. గురువారం ఉదయం వరకు పవన క్షేత్రం నుంచి 3,500 మెగావాట్ల విద్యుత్ లభించింది. ఫలితంగా ప్రభుత్వం పవన విద్యుత్‌ను ఎక్కువగా కొనుగోలు చేసి వినియోగానికి సరఫరా చేస్తుంది. గాలి వేగం ఎక్కువగా ఉండడంతో రానున్న రోజుల్లో ఈ విద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆడి మాసంలో గాలి ఎక్కువగా వీస్తున్నందుకు ప్రైవేట్ పవన విద్యుత్ జనరేటర్లు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చేపను శాఖాహారంలో చేర్చవచ్చు

– తమిళిసై కొత్త యోచన

సాక్షి, చెన్నై: నిత్యం వినూత్న వ్యాఖ్యలతో హల్‌చేస్తున్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తాజాగా మరో వ్యాఖ్యను వెల్లడించారు. వివరాల్లోకి.. పుదుచ్చేరి కంబన్ ఆర్ట్ గ్యాలరీలో మత్స్యశాఖ తరపున నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తమిళిసై మాట్లాడుతూ పుదువైలో సముద్ర కోతను అరికట్టేందుకు ఒక ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. తమిళనాడులో సముద్ర తీర హద్దుల్లో భారీ బందరాళ్లు ఉంచారని, ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరిపి సముద్ర కోత నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా పుదుచ్చేరి ప్రభుత్వం నీలి విప్లవానికి సంతకం చేసింది. పుదువైలో 42 కిమీ తీరం నీలి ఆర్థిక వ్యవస్థ జోన్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, ఆ మేరకు కేంద్రం పుదుచ్చేరి ప్రభుత్వం ఆప్యాయతను, అక్కరను చూపుతోందని అన్నారు. ప్రస్తుతం గుడ్డు మాంసాహారమా, శాఖాహారమా అనే వివాదం కొనసాగుతోందని తమిళిసై అన్నారు. అదేవిధంగా చేపలు తినే వారిని మాంసాహారులని, చేపలు తినని వారిని శాకాహారులని అంటున్నారన్నారు. అయితే, తనకు చేపల ఆహారం ఇష్టమైనదని అన్నారు. చేపలను శాఖాహారంలో చేర్చవచ్చు అని అన్నారు. తద్వారా జాలర్ల జీవనం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

తిరుత్తణిలో వర్షం



తిరుత్తణి: తిరుత్తణిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత కనిపించింది. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో జనం ఉపశమనం పొందారు. మరో4రోజుల పాటు వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ సమాచారంతో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

• ఒప్పందం



తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థతో కలిసి తిరం (ప్రతిభ) స్పోర్ట్స్ అకాడమీ శుక్రవారం క్రీడలు, శిక్షణపరంగా అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పందంలో భాగంగా మంత్రితో కలిసి నిర్వాహకులు ప్రకాష్, విశ్వజిత్‌కుమార్, శ్రీనివాస్ తిరమ్ అకాడమీ జెర్సీని ఆవిష్కరించారు. – సాక్షి, చెన్నై

• అవార్డుతో ఆనందం



చెన్నైకు చెందిన కీర్తిలాల్స్‌కు వర్క్‌ప్లేస్ 2023–24 అవార్డు దక్కింది. స్థానికంగా శుక్రవారం జరిగిన వేడుకలో బాలీవుడ్ ప్రముఖ నటుడు గోవింద, టీమ్స్ మార్క్స్‌మెన్ నెట్ వర్క్ సహ వ్యవస్థాపకుడు రాజేష్ ఖుల్ చందానీల నుంచి కీర్తిలాల్ డైరెక్టర్ సీమా మెహతా, గ్రూప్ హెడ్ సంగీత అవార్డును అందుకున్నారు. – సాక్షి, చెన్నై

అధికారులపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్ ఆత్మహత్య



మణిగండన్ (ఫైల్)

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా సేత్తుపట్టు గ్రామంలోని అన్నా వీధికి చెందిన మణిగండన్ (38) డ్రైవర్. ఇతనికి వివాహం జరిగి భార్య, కుమారుడు ఉన్నారు. ఆస్తి తగాదాలో తన భూమిని సర్వేచేసి ఇవ్వాలని అధికారుల వద్ద పలుమార్లు విన్నవించుకున్నట్టు తెలుస్తుంది. వీటిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో రెండు నెలల క్రితం మణిగండన్ గ్రామంలోని చెట్టుపై ఎక్కి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఇదిలా ఉండగా నెలల తరబడి సమస్య పరిష్కారం కాకపోవడంతో మనోవేదనతో ఉన్న మణిగండన్ తన సెల్‌ఫోన్‌లో వీడియో కాల్‌తో మాట్లాడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అతని సెల్‌ఫోన్‌ను పరిశీలించగా తన సమస్యకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సంబంధిత తహసీల్దార్, సర్వేయర్, వీఏఓపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వీడియోలో పేర్కొన్నాడు. వీటిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అగ్నిమాపకశాఖలో 120 మంది నియామకం



నియామక ఉత్తర్వుల జారీ



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: అగ్నిమాపక శాఖలో జిల్లా అగ్నిమాపక అధికారితో పాటు 120 మంది సిబ్బందిని నియమించారు. తమిళనాడు పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా ఈ నియామకాలు జరిగాయి. జిల్లా అగ్నిమాపక అధికారిగా ఇరసమ్మాల్ అనే మహిళ ఎంపికయ్యారు. వీరికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను సీఎం స్టాలిన్ శుక్రవారం సచివాలయంలో అందజేశారు. ఎంపికైన వారిలో జిల్లా అధికారికి నాలుగు నెలలు, ఇతర సిబ్బందికి మూడు నెలలు శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, తిరుక్కురల్ పోటీలలో విజేతలకు సీఎం స్టాలిన్ నగదు బహుమతి సర్టిఫికెట్లను అందజేశారు. దివంగత డీఎంకే నేత, మాజీ సీఎం కరుణానిధి శతజయంతి ఉత్సవాలలో భాగంగా తిరుక్కురల్ పోటీలు జరిగాయి. ఇందులో 124 మంది విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా విజేతలుగా నిలిచారు. ఈ విజేతలకు తలా రూ.15 వేలు నగదు, సర్టిఫికెట్లను సీఎం అందజేశారు.

బీడీఓ కార్యాలయం ముట్టడి



బీడీఓ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు

పళ్లిపట్టు: మురుగునీటి బిందెలతో మహిళలు బీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ఘటన ఆర్కేపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆర్కేపేట పంచాయతీలోని చెల్లాత్తూరు దళితవాడలో 300కు పైబడిన కుటుంబాలు ఉంటున్నాయి. పాతికేళ్ల నుంచి గ్రామంలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి విడుదలవుతున్న మురుగునీరు వీధుల్లో, ఇళ్ల ముందు రోజులు తరబడి పేరుకుపోయి దుర్వాసన వ్యాప్తిచెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. తమ నివాశ ప్రాంతంలో మురుగునీటి కాలువలు నిర్మించాలని గ్రామీణులు రెండు దశాబ్దాలుగా కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సీపీం మండల కార్యదర్శి న్యాయవాది శివప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలు మురుగునీటిని బిందెలతో బీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. సీపీఎం జిల్లా నేతలు రాజేంద్రన్, పెరుమాళ్, గణేశన్, జయచంద్రన్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని నెమలి మృతి




అన్నానగర్: వేడచందూర్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆడ నెమలి మృతిచెందింది. దిండుక్కల్ జిల్లా వేడచందూర్ సమీపంలోని తమ్మనంపట్టి హైవేపై శుక్రవారం రోడ్డు దాటడానికి ప్రయత్నించిన ఆడ నెమలిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో నెమలి సంఘటన స్థలంలోనే మృతిచెందింది. వాహనదారులు మృతిచెందిన నెమలిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

103 ఏళ్ల వృద్ధురాలి పుట్టినరోజు వేడుకలు

కొరుక్కుపేట: నీలగిరి జిల్లా మస్నూర్ సమీపంలోని కెదికెటి పడుగర్ గ్రామంలో 1920వ సంవత్సరంలో జన్మించిన తలియమ్మాళ్ ప్రస్తుతం 103వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. సాధారణ తేయాకు వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈమె చిన్నతనం నుంచి తోటపనిలో నిమగ్నమయ్యారు. చిరుధాన్యాలు తినే తలియమ్మాళ్ పుట్టిన రోజును బంధువులు, గ్రామస్తులంతా కలిసి పండుగలా జరుపుకున్నారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. తలియమ్మాళ్ భర్త మృతిచెందాడు. ఆ తర్వాత తలియమ్మాళ్ తన ఇద్దరు కుమారులు, కుమార్తెలను పెంచడానికి చాలా కష్టపడింది. ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూ చురుగ్గా ఉంటారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచివని తరచూ చెబుతుంటారు. సరైన సమయంలో సరైన ఆహారం తీసుకోవడం అలవాటు. ఈ వయసులో కూడా తన చిన్నచిన్న అవసరాలు చూసుకుంటారు. ఐదు తరాల సంబంధాలతో సంతోషంగా జీవిస్తున్నారు. తలియమ్మాళ్ మరెన్నో సంవత్సరాలు జీవించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. విషయం తెలుసుకున్న చాలా మంది గ్రామస్తులు ఆశీస్సుల కోసం తలియమ్మాళ్ వద్దకు వెల్లుతుండడం విశేషం.

గవర్నర్ యూ టర్న్

- సెంథిల్ వ్యవహారంలో వెనుకడుగు
- కేంద్ర హోంశాఖ హెచ్చరికలతో ఉత్తర్వులు వెనక్కి
- అధికారులు, మంత్రులతో సీఎం సమావేశం
- చట్టపరంగా చర్యలకు నిర్ణయం



గవర్నర్ రవి



సెంథిల్ బాలాజి

సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజీ వ్యవహారంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి యూటర్న్ తీసుకున్నారు. సెంథిల్‌ను మంత్రి వర్గం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఐదు గంటల వ్యవధిలో గవర్నర్ వెనక్కి తగ్గారు. కేంద్ర హోంశాఖ హెచ్చరికలు, అటార్నీ జనరల్ సలహాతో తన ఉత్తర్వులను రాత్రికిరాత్రే గవర్నర్ వెనక్కి తీసుకున్నారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్ వ్యవహరిస్తున్న తీరుపై చట్టపోరాటానికి సీఎం స్టాలిన్ సిద్ధమయ్యారు.

క్యాష్ ఫర్ జాబ్స్ ఆరోపణలో మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన సెంథిల్ బాలాజీని ఇలాకా లేని మంత్రిగా రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. దీనిని తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి తన అధికారాలను ప్రయోగించారు. గురువారం రాత్రి తమిళనాడు మంత్రి వర్గం నుంచి సెంథిల్‌ను డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మంత్రి వర్గంపై సీఎంకే సర్వాధికారాలు ఉన్నప్పుడు, గవర్నర్ ఎలా ఉత్తర్వులు జారీ చేస్తారని డీఎంకేతో పాటుగా మిత్రపక్ష పార్టీలు ప్రశ్నల వర్షం కురిపించాయి. రాజకీయ శాసనాలను గవర్నర్ నలిపేస్తున్నాడని ధ్వజమెత్తాయి.

ఐదు గంటల్లో ఏమి జరిగిందో?

సెంథిల్‌ను డిస్మిస్ చేస్తూ గురువారం రాత్రి 8 గంటల సమయంలో గవర్నర్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్‌కు లేఖ కూడా రాశారు. ఇందుకు ఆగమేఘాలపై స్పందించిన సీఎం స్టాలిన్ చట్టపరంగా గవర్నర్‌ను ఎదుర్కొంటామని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారాలు నడిచిన ఐదు గంటల్లో ఏమి జరిగిందో ఏమోగానీ, తాను జారీ చేసిన డిస్మిస్ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటూ గవర్నర్ రవి మరో ప్రకటన చేశారు. ఇది తమిళనాట చర్చకు దారి తీసింది. డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, ఆ తర్వాత రద్దు చేయడం ఏమిటో అని ప్రశ్నించడమే కాకుండా, ఈ ఐదు గంటల్లో ఏమి జరిగిందో చర్చ జోరందుకుంది. అదే సమయంలో కేంద్రం నుంచి వచ్చిన సమాచారం మేరకు గవర్నర్ ఈ వ్యవహారంలో యూటర్న్ తీసుకోవాల్సి వచ్చిందని తేలింది. గవర్నర్ జారీ చేసిన డిస్మిస్ ఉత్తర్వులపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా స్పందించినట్టుంది. ఆయన తక్షణం తన కార్యాలయ వర్గాల ద్వారా గవర్నర్‌కు సూచనలు చేశారు. తక్షణం అటార్నీ జనరల్‌తో భేటీ కావాలని, ఆయన అభిప్రాయం తీసుకోవాలని సూచించినట్టుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం అటార్నీ జనరల్ తుషార్ మెహతాతో గవర్నర్ ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. చివరకు ఆయన సలహా మేరకు డిస్మిస్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నట్టు తేలింది.

మంత్రులతో సీఎం సమావేశం

తన అధికారాలను కాలరాసే విధంగా గవర్నర్ తీసుకుంటున్న నిర్ణయాలపై సీఎం స్టాలిన్ తీవ్రంగానే పరిగణించారు. కేంద్ర ప్రభుత్వ కేబినెట్‌లో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న మంత్రులను పదవుల నుంచి రాష్ట్రపతి తప్పించేనా..? అని సీఎం తరపున పదే పదే మంత్రులు మీడియా ముందుకు వచ్చి వ్యాఖ్యలు చేయడం చర్చకు దారి తీసింది. గవర్నర్ తీరుపై మంత్రులు కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, రఘుపతి, రాజ్యసభ సభ్యుడు న్యాయవాది విల్సన్, సీనియర్ న్యాయవాది ఎన్ఆర్ ఇలంగోలతో శుక్రవారం సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. గవర్నర్ అనుసరిస్తున్న తీరుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఆయనపై న్యాయపోరాటం చేయడానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా వ్యవహరించడమే కాకుండా, వారి హక్కులను, అధికారాలను కాలరాసే విధంగా గవర్నర్ వ్యవహరించడం, ఆ తర్వాత వెనక్కి తగ్గడం వంటి పరిణామాలు, తాజా అంశాన్ని అస్త్రంగా చేసుకుని కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. ఇదిలాఉండగా, సెంథిల్ బాలాజి కేసులకు సంబంధించి ఈడీ దూకుడుకు కళ్లెం వేయడానికి రాష్ట్ర పోలీసులు సిద్ధమయ్యారు. ఈ కేసు గతంలో తమ చేతిలో ఉండడంతో ప్రస్తుతం ఆర్థిక నేర విభాగం ఆ ఫైల్‌కు దుమ్ము దుళిపే పనిలోపడ్డారు. సెంథిల్ బాలాజీతో పాటు 125 మందిని విచారించేందుకు సిద్ధమవుతూ సమన్లు జారీ చేయడానికి కసరత్తులు చేపట్టారు.

చెన్నై
శనివారం 1 జూలై 2023
సాక్షి

క్లుప్తంగా

నగ్నంగా ఉన్న స్వామీజీకి దేహశుద్ధి



నగ్నంగా పడుకన్న స్వామీజి

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం వెనుక వున్న కొండను చుట్టే గిరివలయం రోడ్డు ఉంది. ఈ రోడ్డులో వందల సంఖ్యలో స్వామీజీలు, సన్యాసులు ఉంటున్నారు. పౌర్ణమితో పాటు విశేష దినాలు, బ్రహ్మోత్సవాల సమయంలో రాత్రి, పగలు తరచూ భక్తులకు గిరివలయం రోడ్డులో కాలి నడకన 14 కిలోమీటర్లు నడిచి స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి భక్తులు కొందరు గిరివలయం వెళుతున్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో తిరునీరు అన్నామలై ఆలయం సమీపంలో గంజాయి మత్తులో ఉన్న స్వామీజీ (40) నడి రోడ్డులో నగ్నంగా నిలిచి భక్తులను అసభ్య పదజాలంతో దూషించాడు. గమనించిన భక్తులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు కట్టేశారు. విషయం తెలుసుకున్న తిరువణ్ణామలై తాలూకా పోలీసులు మత్తులో ఉన్న స్వామీజీని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

పాలారు నిర్మాణ పనులు వేగవంతం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

వేలూరు: ఆంధ్ర రాష్ట్రం తరహాలోనే తమిళనాడులోనూ మొదటిసారిగా పాలారు నదికి అడ్డంగా రూ.18.31 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనులను కలెక్టర్ కుమరవేల్ పాండియన్ శుక్రవారం ఉదయం పరిశీలించారు. పనుల్లో నాణ్యతపై ఇంజినీర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు పూర్తి అయితే పాలారులో వచ్చే నీటి వల్ల వేలూరు పట్టణ ప్రాంత వాసులకు తాగు నీటి సమస్య ఏర్పడదన్నారు. వర్షాకాలం కావడంతో పాలారులో నీరు రాక ముందే పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించామని చెప్పారు. అనంతరం కాట్పాడి బ్లాక్‌లోని అరుంబర్తి పంచాయతీలో రూ.24.18 కోట్లతో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించారు. పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజినీర్ రమేష్, అసిస్టెంట్ ఇంజినీర్ బాలాజి, తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

అదనపు పరిహారం చెల్లించాలి

- రైతుల డిమాండ్
- భూసేకరణ విభాగం కార్యాలయం ముట్టడి
- పరిహారం అందే దాకా నిర్మాణాలు వద్దు



భూసేకరణ విభాగం కార్యాలయం వద్ద నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

తిరువళ్లూరు: తచ్చూర్–చిత్తూరు మధ్య నిర్మిస్తున్న సిక్స్‌వే రోడ్డు నిర్మాణ పనుల కోసం భూములు ఇచ్చిన రైతులకు అదనపు పరిహారం అందే వరకు నిర్మాణాలను చేపట్టవద్దని కోరుతూ రైతులు నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. తిరువళ్లూరు జిల్లా తచ్చూర్ నుంచి ఆంధ్రప్రదేష్ రాష్ట్రం చిత్తూరు వరకు 126 కిలోమీటర్ మేరకు రూ.3200 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. రోడ్డు నిర్మాణ పనుల కోసం తిరువళ్లూరు జిల్లాలోని 126 గ్రామాలకు చెందిన 2,150 మంది రైతుల నుంచి మూడు వేల ఎకరాల వ్యవసాయ భూములను సేకరించారు. ఇందు కోసం మొదటి దశ పరిహారాన్ని రైతులకు అందించారు. అయితే రైతుల నుంచి సేకరించిన భూములకు 2013 భూసేకరణ చట్టం కింద పరిహారం ఇవ్వాలి. అయితే రైతులకు ఇచ్చిన పరిహారం చాలడం లేదని, న్యాయమైన అదనపు పరిహారాన్ని ఇవ్వాలని కోరుతూ గతంలో రైతులు ఆందోళన నిర్వహించారు. తిరువళ్లూరు కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీ రైతులకు అవసరమైన న్యాయమైన పరిహారాన్ని నెల రోజుల్లో ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు నెరవేర్చలేదు. దీంతో రైతులు శుక్రవారం ఉదయం రైల్వే స్టేషన్ నుంచి భూసేకరణ విభాగం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి సంపత్, రాష్ట్ర అధ్యక్షుడు షణ్ముగం, రాష్ట్ర కార్యదర్శి తులసీనారాయణన్ హాజరైయ్యారు. తులసీనారాయణన్ మాట్లాడుతూ రైతులకు అదనపు పరిహారం అందిన తరువాతే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు రైతులతో చర్చలు జరిపారు. రైతులకు న్యాయమైన పరిహారం అందే వరకు రోడ్డు నిర్మాణాలు చేపట్టబోమని ఇచ్చిన హామీ మేరకు రైతులు ఆందోళన విరమించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం

- దానియా కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు



దానియా కుటుంబానికి ఇంటి పట్టా, పక్కాగృహాన్ని కేటాయిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

తిరువళ్లూరు: అంతుచిక్కని వ్యాధితో పోరాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ సాయంతో ఆపరేషన్ చేసుకుని కోలుకుంటున్న చిన్నారి దానియా కుటుంబానికి గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2.10 లక్షల విలువ చేసే పక్కా ఇల్లు, ఉచిత ఇంటి పట్టాను ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం సచివాలయంలో అందజేశారు. తిరువళ్లూరు జిల్లా ఆవడి వీరాపురంలోని శ్రీవారి నగర్ ప్రాంతానికి చెందిన స్టీఫెన్‌రాజ్, సౌభాగ్య దంపతుల కుమార్తె దానియా(10). ఆమె వీరాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది. మూడేళ్ల వరకు ఆరోగ్యంగానే ఉంది. తరువాత ముఖంపై నల్లమచ్చలు రావడంతో తల్లిదండ్రులు సాధారణ రక్తపు గడ్డగానే భావించి ఎగ్మూర్ చిన్నపిల్లల వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో పలు ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలల చుట్టూ తిరిగి రూ.లక్షలు అప్పు చేసి వైద్యం చేయించారు. రోజులు గడిచే కొద్ది దానియా ముఖంలోని కుడికన్ను, దవడ, పెదవికి ఒక వైపు పూర్తిగా విచ్ఛిన్నం కావడం ప్రారంభమైంది. వైద్యం కోసం పలు వైద్యశాలలకు తిరిగినా ఫలితం దక్కలేదు. ఈ విషయంపై సాయం కోరుతూ దానియా వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అది వైరల్ కావడంతో ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికి వెళ్లింది. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని పూందమల్లి సమీపంలోని తండలం వద్ద వున్న సవిత వైద్యశాలలో బాలికను చేర్పించి రెండుసార్లు అపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటూ వుంది. ఈ నేపథ్యంలో బాలిక కుటుంబ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని చదువు బాధ్యతలతో పాటు ఇంటి స్థలం పక్కాగృహాన్ని కేటాయిస్తామని అప్పట్లో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందులో భాగంగా దానియాను సీఎం క్యాంపు కార్యాలయానికి పిలిపించుకున్న స్టాలిన్ బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. భవిష్యత్తులోనూ అండగా వుంటామని హామీ ఇచ్చి పాక్కం గ్రామంలో రూ.1.48 లక్షలు విలువ చేసే ఇంటి స్థలం, పక్కాగృహం నిర్మాణం కోసం రూ.2.10 లక్షలు మంజూరు చేసి ఉత్తర్వులను దానియా కుటుంబ సభ్యులకు అందజేశారు.

తమిళ భాష ఆధ్యాత్మికతతో ముడిపడి ఉంది



మంత్రి లక్ష్మీనారాయణన్‌ను సత్కరిస్తున్న చాన్స్‌లర్ డాక్టర్ పారివేందర్

- జాతీయ సదస్సులో వక్తలు

కొరుక్కుపేట: తమిళం గొప్ప, ప్రాచీన భాష విజ్ఞాన భాండాగారమే కాదు, అది ఆధ్యాత్మికత, భక్తి, భక్తి సాహిత్యంతో ముడిపడి ఉందని వక్తలు కొనియాడారు. ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో తమిళం వృద్ధిలో వైష్ణవుల పాత్రపై జాతీయ సదస్సు గురువారం కాట్టంగలత్తూరు క్యాంపస్‌లో జరిగింది. తమిళ్ పేరయం ఆధ్వర్యంలో ఏర్పాటు జాతీయ సమావేశానికి ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపక చాన్స్‌లర్ డాక్టర్ టీఆర్ పారివేంధర్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతి, చరిత్ర, వారసత్వం వంటి అంశాలకు సంబంధించిన జ్ఞానంతో విద్యార్థులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల, కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి 'సెంగోల్'ను ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. పుదుచ్చేరి పబ్లిక్ వర్క్స్ అండ్ టూరిజం మంత్రి, కె. లక్ష్మీనారాయణన్ మాట్లాడుతూ మాతృభాష తమిళంలో చదవడానికి, మాట్లాడేందుకు, రాయడానికి చాలా మందికి సహాయం అవసరమని, దాన్ని సరిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు మార్గం సుగమం చేస్తాయని అన్నారు. దిండివనంలోని కంబన్ కళగం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జ్ఞానజ్యోతి, వీరవననల్లూర్‌లోని కులశేఖర రామానుజ మఠానికి చెందిన రామ అప్రమేయ రామానుజ జీయర్ స్వామి, 24వ పీఠాధిపతి మణవాళ మామునిగల్ మఠం, శ్రీవిల్లిపుత్తూరు, మన్నార్‌గుడి మున్నెట్‌లోని సెండలంగర్ షెన్బగమన్నర్ రామానుజ జీయర్ స్వామి, కోయిల్ పెరియనంబి ఉభయ వేదాంతులు తిరువరంగం కబిస్థలం ఆచార్యర్ ప్రసంగించారు. అంతకుముందు డాక్టర్ పారివేందర్ అతిథులను సత్కరించారు. తమిళ్ పేరాయం అధ్యక్షుడు కరు నాగరాజన్ పాల్గొన్నారు.

1.3 బిలియన్ మందికి మధుమేహం

వేలూరు: 2040 సంవత్సరం నాటికి ప్రపంచంలో 1.3 బిలియన్ మందికి మధుమేహం విస్తరించే అవకాశం ఉందని వేలూరు సీఎంసీ డయాబెటాలిజిస్ట్ నిపుణులు డాక్టర్ నిఖాల్ థామస్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన వేలూరు సీఎంసి ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడుతూ 2040 సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా 130 కోట్ల మందికి టైప్ టూ డయాబెటిస్ బారిన పడతారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఫాస్ట్‌ఫుడ్, పాలిష్ బియ్యాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉపయోగిస్తున్నారన్నారు. వీటి ద్వారా మదుమేహం వ్యాధి అధికంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు చిరు ధాన్యాలు, మినుములను తినడానికి అలవాటు పడాలన్నారు. సీఎంసీ పీఆర్ఓ దురై జాస్పర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నిఖాల్ థామస్

చైర్‌పర్సన్ దిష్టిబొమ్మలా వ్యవహరిస్తోంది



చైర్‌పర్సన్ పోడియం వద్ద బైఠాయించిన మహిళా కౌన్సిలర్లు

తిరుత్తణి: తిరుత్తణి యూనియన్ అన్నాడీఎంకే చైర్‌పర్సన్ దిష్టిబొమ్మగా వ్యవహరిస్తున్నట్లు, దీంతో మండలంలో అభివృద్ధి పనులకు విఘాతం కల్గుతున్నట్లు సభ్యులు నిరసన తెలిపారు. తిరుత్తణి యూనియన్ సమితి సమావేశం చైర్‌పర్సన్ తంగధనం అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వైస్ చైర్మన్ ఈఎస్.కండ్రిగ రవి సహా తొమ్మిది మంది సభ్యులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలో పొందుపరిచిన అంశాలకు సంబంధించి బీడీఓ కార్యాలయ సిబ్బంది సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే, పీఎంకే, కాంగ్రెస్‌కు చెందిన సభ్యులు గత సమావేశంలో ఆమోదం పొందని తీర్మానాన్ని వైట్నర్‌తో తుడిపి ఆమోదం పొందినట్లు మినిట్ బుక్‌లో చూపడం ఏమిటని బీడీఓను నిలదీశారు. మినిట్ బుక్‌లో సభ్యులు అనుమతి లేకుండా మార్పులు చేయడం పట్ల తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం యూనియన్ వ్యాప్తంగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి చర్చలు జరిగాయి. గంటకు పైబడి సభ్యులు మధ్య చర్చలు జరిగినా కనీసం నోరెత్తి కూడా చైర్‌పర్సన్ మాట్లాడకుండా వ్యవహరించడంతో ఆగ్రహం చెందిన డీఎంకే, కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు మహిళా కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియం వద్ద కూర్చుని నిరసన తెలిపారు. ఏ మాత్రం సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి అవగాహన లేని చైర్‌పర్సన్‌తో అభివృద్ధి పనులు కుంటుపడి ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో వున్నట్లు దుయ్యబట్టారు.

క్రైమ్ థ్రిల్లర్ చిత్రంలో విదార్థ్



నటుడు విదార్థ్‌తో చిత్ర యూనిట్

తమిళసినిమా: నటుడు విదార్థ్, కలైయరసన్, సంతోష్ ప్రతాప్, త్రిగుణ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ట్రెండింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వైట్ హార్స్ స్టూడియోస్ పతాకంపై శశికుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా సకోగణేశన్ దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. ఈయన దర్శకుడు పి.వాసు, తంగర్ బచ్చన్‌లో శిష్యుడు అన్నది గమనార్హం. నటి తేజూ అశ్విని, అతుల్య చంద్ర, శ్వేతా టోరత్తి, రాధా ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అజీస్ సంగీతాన్ని, ఎన్ఎస్ ఉదయ్‌కుమార్ చాయాగ్రహణం అందిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది హైపర్ లింక్ క్రైమ్, మిస్టరీ థ్రిల్లర్ కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. ఒక చిన్న విషయం పలు పెను మార్పులకు కారణం అవుతుందంటారని, అలా ప్రపంచంలో పలు అద్భుతమైన కథా చిత్రాలు రూపొందాయన్నారు. అలాంటి కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న చిత్రం ఇదన్నారు. ఒక హత్య నలుగురి జీవితాలను ఎలాంటి పరిస్థితులకు గురిచేస్తుంది అన్నదే ఈ చిత్ర కథ అని చెప్పారు. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్ర షూటింగ్ తొలి షెడ్యూల్‌ను చెన్నై పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది ప్రేక్షకులకు సరి కొత్త అనుభూతిని కలిగిస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



సంచితా శెట్టి

కోలీవుడ్ టాక్స్

టీటీఎఫ్ వాసన్ హీరో మంజల్ వీరన్



మంజల్ వీరన్ చిత్ర ప్రారంభోత్సవం

తమిళసినిమా: వైరల్ యూట్యూబర్ టీటీఎఫ్ వాసన్ కథా నాయకుడిగా తెరంగేట్రం చేస్తున్నారు. ఈయన హీరోగా నటిస్తున్న చిత్రానికి మంజల్ వీరన్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్రాన్ని ది బడ్జెట్ ఫిలిం కంపెనీ, కాస్మొటాలజిస్ట్ డాక్టర్ కవిత ప్రియదర్శిని కలిసి ఇస్తున్నారు. దీనికి కథ, కథనం, మాటలు, దర్శకత్వం బాధ్యతలను సెల్వం నిర్వహిస్తున్నారు. ఈయన ఇంతకుముందు తిరువీకా పూంగా అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. కాగా గురువారం నటుడు టీటీఎఫ్ వాసన్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర పూజా కార్యక్రమం ఒక నక్షత్ర హోటల్లో నిర్వహించారు. అనంతరం చిత్ర ఫస్టు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర వివరాలను తెలుపుతూ ఇది అన్ని వర్గాలను అలరించేలా జనరంజక కథాంశంతో కూడిన యాక్షన్ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. చిత్ర కథానాయకి ఇతర నటీనటులు, సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని, చిత్ర రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల చివరిలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందులో కూల్ సురేష్ ముఖ్యపాత్రలో నటించనున్నట్లు చెప్పారు. కొలంజి కుమార్ చాయాగ్రహణంను, శ్రీధర్ మాస్టర్ నృత్య దర్శకత్వాన్ని నిర్వహించనున్నారని తెలిపారు.

భయపెట్టడానికి సిద్ధమైన ఇంసిడియోస్



ఇంసిడియోస్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: ఇంతకుముందు హాలీవుడ్ హర్రర్, థ్రిల్లర్ చిత్రాలు వరుసగా విడుదలై ప్రేక్షకులను భయభ్రాంతులకు గురిచేశాయి.అయినా అలాంటి చిత్రాలను ప్రేక్షకులు విరగబడి మరీ చూశారు. ఆ తరువాత యాక్షన్ కథా చిత్రాల హడావుడి మొదలైంది. అలాంటిది తాజాగా అమెరికన్ సూపర్ నేచురల్ హర్రర్ కథా చిత్రం ఇంసిడియోస్ ది రెడ్ డోర్ ప్రేక్షకులను భయపెట్టడానికి సిద్ధమైంది. ఇది ఇంతకుముందు వచ్చిన ఇంసిడియోస్, ఇంసిడియోస్ చాప్టర్ 2 చిత్రాలకు ఒరిజినల్ సీక్వెల్ అన్నది గమనార్హం అయితే ఇది ఇంసిడియోస్ ఫ్రాంచైజీలో ఐదవ చిత్రం అవుతుంది. దర్శకుడు పాట్రిక్ విల్సన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రెండు చిత్రాల కంటే మరింత థ్రిల్లింగ్‌గా ఉంటుందని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఒక కుటుంబాన్ని ఏదో తెలియని అతీంద్రియ శక్తి వెంటాడుతుందని, అది ఏమిటి? దాని నుంచి ఆ కుటుంబం ఎలా బయటపడింది అనే పలు ఆసక్తికరమైన అంశాలతో కూడిన హర్రర్ థ్రిల్లర్ కథా చిత్రం ఇంసిడియోస్ అని పేర్కొన్నారు. జూలై 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ సంస్థ భారతదేశంలో ఒక రోజు ముందుగానే అంటే జూలై ఆరవ తేదీన తెలుగు తమిళం, హిందీ, ఆంగ్లం భాషలో విడుదల చేయబోతున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

మాయవలైలో అమీర్



అమీర్, యువన్ శంకర్ రాజా

తమిళసినిమా: రామ్, పరుత్తివీరన్ వంటి పలు సక్సెస్‌ఫుల్ చిత్రాలను అందించిన దర్శకుడు అమీర్ ఆ తర్వాత నటుడుగా అవతారమెత్తి కథానాయకుడిగా యోగి చిత్రంలో నటించారు. ఆప్ వడ చెన్నై, మారన్ చిత్రాలలో కీలక పాత్రలు పోషించారు. ఈయన కథానాయకుడిగా నటించిన చిత్రం ఉయిర్ తమిళుక్కు చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. కాగా తాజాగా అమీర్ ప్రధాన పాత్రల్లో నటించిన మరో చిత్రం మాయవలై. ఇందులో నటుడు ఆర్య సోదరుడు సత్య నటి సంచితాశెట్టి యువజంటగా నటించారు. ఈ చిత్రానికి రమేష్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన ఇంతకుముందు అధర్మం పగైవన్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు దర్శకత్వం వహించారన్నది గమనార్హం. ఈ చిత్రానికి యువన్‌శంకర్‌రాజా సంగీతాన్ని అందించడంతోపాటు అమీర్‌తో కలిసి నిర్మాణ బాధ్యతలను పంచుకోవడం విశేషం. ఇంతకుముందు అమీర్, సంగీత దర్శకుడు యువన్‌శంకర్‌రాజా కాంబినేషన్‌లో పరుత్తివీరన్ వంటి సూపర్ హిట్ చిత్రం రూపొందింది. మళ్లీ చాలా గ్యాప్ తర్వాత ఈ మాయవలై చిత్రంతో కలిశారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యువన్ శంకర్ రాజా ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఇది ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. మాయవలై చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా చిత్రంలో అమీర్ పవర్‌ఫుల్ పాత్రను పోషించినట్లు దర్శకుడు తెలిపారు. అదేవిధంగా యువన్‌శంకర్‌రాజా సంగీతం, రాంజీ చాయాగ్రహణం చిత్రానికి హైలెట్‌గా ఉంటాయన్నారు.



మిరియమ్మ చిత్రంలో ఓ సన్నివేశం

స్త్రీ ఇతివృత్తంగా మిరియమ్మ

తమిళసినిమా: 'అమ్మతనం తపస్సు.. పిల్లలు వరం' అంటారు అలాంటి ఇతివృత్తంతో తెరకెక్కిస్తున్న చిత్రం మిరియమ్మ అన్నారు ఆ చిత్ర దర్శకులు మాలతి నారాయణన్. కడలోర కవి తైగళ్ రేఖ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఇందులో ఎళిల్ దురై, స్నేహకుమార్, అనితా సంపత్, విజేత ఆషిక్లతో పాటు దర్శకురాలు మాలతి నారాయణన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ సాయి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. జగన్ విలియమ్స్ ఛాయాగ్రహణం, ఏఆర్ రెహానా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్ర వివరాలను దర్శకులు తెలుపుతూ యుక్త వయసులో ప్రతి యువతి తల్లి కావాలని కోరుకుంటుందన్నారు. అలా సరోగసి విధానం ద్వారా అమ్మ కావడానికి సిద్ధమైన 50 ఏళ్ల స్త్రీ ఎదుర్కొనే సవాళ్లే మిరియమ్మ చిత్ర కథ అని చెప్పారు. కథ, కథనాలు కొత్తగా ఉంటాయన్నారు. నటి కడలోర కవితైగళ్ రేఖ బలమైన పాత్రలో నటించడంతో చిత్రంపై సినీ వర్గాలు, ప్రేక్షకుల్లో చాలా ఆసక్తి నెలకొందన్నారు. చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, కాగా చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను గురువారం విడుదల చేసినట్లు చెప్పారు. నటి రేఖ గెటప్‌కు, ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వస్తుందనే ఆనందాన్ని వ్యక్తం చేశారు. మిరియమ్మ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

బాలికకు లైంగిక వేధింపులు

• నలుగురి అరెస్ట్

అన్నానగర్: తిరువణ్ణామలై జిల్లా తాండరాం పట్టు తాలూకాలోని బాలిక(13)ను లైంగికంగా వేధించిన నలుగురిని పోలీసులు అరెస్టుచేశారు. బాలిక శుక్రవారం ఇంటి బయట ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన బాలాజీ (22), దినేష్ (18), 13, 15 ఏళ్ల బాలురు దూరంగా తీసుకెళ్లి లైంగికంగా వేధించారు. బాలిక కేకలు వేసి వారి నుంచి తప్పించుకుని విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాండరాంపట్టి మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం బాలాజీ, దినేష్ సహా నలుగురిని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి


మహేష్ (ఫైల్)

తిరుత్తణి: బైకును కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్కేపేట మండలం అమ్మయార్‌కుప్పంకు చెందిన మహేష్(26), అయ్యప్పన్(30), శ్రీకాళికాపురానికి చెందిన జనార్దనం భార్య కుమారి కలిసి పెళ్లి పత్రిక ఇచ్చేందుకు అమ్మయార్‌కుప్పం నుంచి తిరుత్తణి యూనియన్ బుచ్చిరెడ్డిపల్లెకు వెళ్లారు. బంధువులకు పెళ్లి పత్రిక ఇచ్చి తిరుత్తణికి బైకులో బయలుదేరారు. తిరుత్తణి నుంచి పొదటూరుపేట మార్గంలో కారు ఢీకొంది. ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అయ్యప్పన్, కుమారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారైన కారు డ్రైవర్‌కోసం గాలిస్తున్నారు.

యువకుడి అరెస్ట్

అన్నానగర్: తమిళనాడు పోలీసులపై వాట్సాప్ గ్రూపుల్లో దుష్ప్రచారం చేస్తున్న మేలూరుకు చెందిన యువకుడిని పోలీసులు శుక్రవారం తిరుచ్చి విమానాశ్రయంలో అరెస్టు చేశారు. మదురై జిల్లా మేలూరు కరుత్తపులియన్ ప్రాంతానికి చెందిన గోడంగిపులియన్ కుమారుడు బాలమురుగన్ (36) విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. తమిళనాడు పోలీసులను దూషిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసి తన స్నేహితులకు పంపాడు. ఇది మేలూరు పోలీసులకు తెలియగానే బాలమురుగన్‌పై 294బి, 153ఎ, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదైంది. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న బాలమురుగన్ స్వగ్రామానికి వస్తున్నట్లు మేలూరు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం తిరుచ్చి విమానాశ్రయానికి వచ్చారు. అక్కడ బాలమురుగన్‌ను అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి మదురై సెంట్రల్ జైలుకు తరలించారు.

అపోలోలో అరుదైన చికిత్స

కొరుక్కుపేట: చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో 72 యేళ్ల వృద్ధుడికి అమర్చిన చెడిన ఫేస్ మేకర్ ను లేజర్ చికిత్స ద్వారా తొలగించినట్లు ఆ ఆస్పత్రి హృద్రోగ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ ఎం కార్తి గేశన్ తెలిపారు. తేనాంపేటలోని శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లకు ముందు ఆ వృద్ధుడికి ఫేస్ మేకర్‌ను అమర్చారని, ఆ పరికరం చెడిపోవడంతో గుండెలో కొత్త సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. లేజర్ చికిత్స ద్వారా తొలగించినట్లు ఆయన వివరించారు. అపోలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఆర్కే వెంకటాచలం జై పాల్గొన్నారు

డివైడర్‌ను బైక్ ఢీకొని యువకుడు మృతి

అన్నానగర్: అరళ్ వాయ్‌మొళి సమీపంలో గురువారం రాత్రి రోడ్డు డివైడర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కన్యాకుమారి జిల్లా విలవంగోడ్ తాలూకా పాకోడు సమీపంలోని పడుకల్ పాలానికి చెందిన పొన్నయ్య. ఇతని కుమారుడు అరుల్ సెల్వన్ (24) లారీ డ్రైవర్. ఇతని స్నేహితుడు అజిత్ (23). వీరిద్దరూ గురువారం రాత్రి బైక్‌లో మార్తాండం నుంచి నెల్లైకు బయలుదేరారు. అర్ధరాత్రి అరళ్ వాయ్ మొళి సమీపంలోని కన్నుప్పొత్తై ప్రాంతంలో వెళుతుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అరుల్‌సెల్వన్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన అజిత్‌ను నాగర్‌కోయిల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అరళ్ వాయ్ మొళి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.7లక్షల చోరీ

తిరువళ్లూరు: ఇంటి తలుపులు పగులగొట్టి రూ.7లక్షలు చోరీ చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా ఆత్తుపాక్కం గ్రామానికి చెందిన ధర్మారెడ్డి కుమారుడు దురైకన్ను(57). ఇతనికి అదే గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిని విక్రయించి రూ.ఏడు లక్షలు బీరువాలో దాచారు. అనంతరం గురువారం ఉదయం సొంత పనుల నిమిత్తం పెద్దపాళ్యం వచ్చి పనులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపులు పగులగొట్టి వుండడం చూసి షాక్‌కు గురైయ్యాడు. అనంతరం ఇంటి లోపలకి వెళ్లి బీరువాలో చూడగా రూ.ఏడు లక్షలు మాయమైనట్లు గుర్తించి పెద్దపాళ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి


సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడానికి వెళుతున్న వారితో ముచ్చటిస్తున్న కలెక్టర్

తిరువళ్లూరు: సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడానికి వెళుతున్న క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి రాణించాలని కలెక్టర్ ఆల్బీ జాన్‌వర్గీష్ సూచించారు. ప్రతి సంవత్సరం సీఎం కప్ కోసం జిల్లా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వికలాంగులు, పాఠశాల కళాశాల విద్యార్థులు, జనరల్ సహా ఐదు వేర్వేరు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించి ఇక్కడ మొదటి మూడు స్థానాల్లో నిలిచే జట్టుకు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి 620 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో మొదటి దశలో రాష్ట్ర స్థాయి పోటీలకు 60 మంది శుక్రవారం చెన్నైకి బయలుదేరారు. వీరితో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ప్రత్యేకంగా ముచ్చటించారు. క్రీడల్లో సరైన ప్రాక్టీసు లేకపోతే రాణించలేమని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. సీఎం కప్‌ను గెలిచి జిల్లాకు తీసుకుని రావాలని కోరారు. అనంతరం జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు.

లాయర్, పోలీసుల ఘర్షణ

అన్నానగర్ : పుదువన్నారపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు కానిస్టేబుళ్లు, న్యాయవాది ఘర్షణ పడ్డారు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు. విల్లివాక్కం మెయిన్ వీధికి చెందిన నవీన్ (31), పుదువన్నారపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న వినోద్ కుమార్ (36) వన్నారపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. వీరు గురువారం రాత్రి ఇళయ ముదలీ స్ట్రీట్‌లోని రెస్టారెంట్‌లో భోజనం చేశారు. అదే సమయంలో పుదువన్నారపేట ఇళయముడి వీధిలోని ఓ ప్రైవేట్ ప్లాట్‌లో ఉంటున్న న్యాయవాది జయగణేష్(45) అక్కడికి వచ్చాడు. పోలీసులను జయగణేష్ హేళనగా మాట్లాడాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఒకరినొకరు కొట్టుకున్నారు. గాయపడిన పోలీసులు నవీన్, వినోద్‌కుమార్‌ను ఇరుగుపొరుగు వారు స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జయగణేష్ రాయపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన గురించి పుదువన్నారపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీరకు నిప్పంటుకుని గాయపడిన మహిళ మృతి

అన్నానగర్: కరూర్‌లోని ఓ ఆలయంలో దర్శనం చేస్తుండగా చీరకు న్పింటుకుని గాయపడిన మహిళ శుక్రవారం ఉదయం మృతి చెందింది. దిండుక్కల్ జిల్లా, కరికాలి గ్రామానికి చెందిన ముత్తు వడుగన్ (53). ఓ ప్రైవేట్ సిమెంట్ ప్లాంట్‌లో మేనేజర్. ఇతని భార్య మీనా (52). గత 8న కరూర్ మేట్టు వీధిలోని పెరుమాళ్ ఆలయానికి మీనా స్వామి దర్శనం కోసం వెళ్లింది. ఆలయంలో మీనా స్వామి దర్శనం చేస్తుండగా ఆమె చీరకు నిప్పంటుకుంది. తీవ్రంగా గాయపడ్డ మీనాను కోయంబత్తూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. కరూర్ టౌన్ పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలో రూ.76 లక్షల చోరీ

తిరువొత్తియూరు: సినిమా తరహాలో దుకాణంలో రూ.76లక్షలు చోరీ చేసి యజమానికి ఫోన్ చేసి చెప్పి పరారైన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నైలోని పెరియమేడు ప్రాంతానికి చెందిన ఖాదర్ బాద్‌షా(42). అదేప్రాంతంలో ల్యాప్ టాప్ సర్వీస్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ షాపులో అజీజ్, గౌతమ్ పనిచేస్తున్నారు. ఈ పరిస్థితిలో ఖాదర్ బాద్‌షా తన ఐదుగురు స్నేహితులతో ఒంటరిగా వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. దీనికి రూ.76లక్షల నగదు తీసుకుని తన దుకాణంలో పెట్టుకున్నాడు. ఇంతలో షాపులో పని చేసే అజీజ్, గౌతమ్ షాపు యజమాని ఖాదర్ బాద్‌షాను వాట్సాప్ ద్వారా సంప్రదించారు. దాన్ని తీసుకుని చూసిన ఖాదర్ బాద్‌షాకు వారిద్దరూ, మీరు దుకాణంలో ఉంచిన రూ.76.36 లక్షల డబ్బు తీసుకున్నాం. మీ దగ్గర పనిచేసిన మాకు ఈ డబ్బు చాలు అంటూ ఫోన్‌కట్ చేశారు. దీంతో షాక్ తిన్న ఖాదర్ బాద్ షా పెరియమేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు డబ్బుతో పరారైన అజీజ్, గౌతమ్ కోసం గాలిస్తున్నారు.

ప్రారంభం.. కిష్కింధకాండ పారాయణం


పారాయణం చేస్తున్న పండితులు

తిరుమల : తిరుమలలోని వసంత మండపంలో షోడశదిన కిష్కింధకాండ పారాయణదీక్ష శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. 16రోజులపాటు పారాయణదీక్ష కొనసాగనుంది. ఈ సందర్భంగా ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపల్ కేఎస్ఎస్ అవధాని మాట్లాడుతూ 'మారుతస్య సమోవేగే గరుడస్య సమోజవే' అనే శ్లోకంలో మొదటి అక్షరానికి సూచికగా తొలి రోజు 1 నుంచి 5 వరకు గల సర్గలను పండితులు పారాయణం చేస్తున్నట్టు వెల్లడించారు. సీతమ్మ జాడను వెతుక్కుంటూ సుగ్రీవుని వద్దకు శ్రీరాములవారు వెళ్లడం, ఆంజనేయుని పరిచయం, సుగ్రీవుడితో మైత్రి కుదుర్చుకోవడం, వాలిని శిక్షిస్తానని అభయం ఇవ్వడం తదితర ఘట్టాలను ఈ సర్గల ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. వసంత మండపంలో 16 మంది నిష్ణాతులైన వేద పండితులు శ్లోకాలను పారాయణం చేశారు. అదేవిధంగా, ధర్మగిరి వేద వి/జ్ఞానపీఠంలో మరో 16 మంది వేదపండితులు హోమం, జపాలు, వేదపారాయణం నిర్వహించారు.

గంజాయి స్మగ్లర్ అరెస్ట్


పట్టుబడిన గంజాయి, స్మగ్లర్‌ను చూపుతున్న డీఎస్పీ సురేందర్‌రెడ్డి, సీఐ మహేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం : తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తున్న గంజాయి స్మగ్లర్‌ను గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టగా తమిళనాడుకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి వద్ద 30 కేజీల గంజాయి పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ నెల 24వ తేదీన అనకాపల్లెలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి రైలులో తిరుపతి తీసుకువచ్చినట్లు నిందితుడు తెలిపాడని చెప్పారు. ప్రభాకర్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదైనట్లు తమ విచారణలో తేలిందని వివరించారు. అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి, సిబ్బందిని అభినందించారు.

ఘనంగా మాంగని ఉత్సవాలు

తిరువొత్తియూరు: కారైకాల్ అమ్మయార్ ఆలయంలో మాంగని ఉత్సవాలు వరుడి ఆహ్వానంతో శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణం, 2న మాంగని వెదచల్లు కార్యక్రమం నిర్వహించనున్నారు. కారైకాల్‌లో ప్రసిద్ధి చెందిన కారైకాల్ అమ్మయ్యార్ ఆలయం ఉంది. ప్రతి సంవత్సరం ఇక్కడ మాంగని ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సంవత్సరం శుక్రవారం రాత్రి 7.30 గంటలకు వరుని ఆహ్వానంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం 11 గంటలకు తిరుకల్యాణం, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ పిచ్చాండవర్ మూర్తి వెండి కవచధారణ ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు ముత్తు పల్లకి ఉత్సవం చేపడతారు. ఆదివారం వేకువజామున 3 గంటలకు శ్రీ పిచ్చాండవర్ పంచ మూర్తులకు మహాభిషేకం, ఉదయం 7 గంటలకు పిచ్చాండవర్ ఊరేగింపులో మామిడి పండ్ల పంపకం చేస్తారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు పంచమూర్తుల ఊరేగింపు ఉంటుంది. కారైకల్ అమ్మయ్యార్ మాంగని ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

డీఎంకే వలంటీర్ టీమ్ ఎగ్జిక్యూటివ్‌ల నియామకం

కొరుక్కుపేట: చెన్నై తూర్పు జిల్లా ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్ల నియామకాన్ని డీఎంకే వలంటీర్ బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని డీఎంకే వలంటీర్ టీమ్ సెక్రటరీ బి.శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నై తూర్పు జిల్లా అధ్యక్షుడు దురై వెంకటేశన్, ఉపాధ్యక్షుడిగా సిట్కోస్ అన్వర్దీన్, ఆర్గనైజర్‌గా విజయకుమార్, డిప్యూటీ ఆర్గనైజర్లుగా శ్రీధర్ శ్రీనివాసన్, శివప్రకాశం, సుధాకర్, దురై, శివకుమార్, ఆందో నిజన్, ప్రకాష్, షణ్ముగ వేలు, సతీష్, ఎడ్విన్, మునియాల కన్.రాజశేఖర్, రియాజ్ మహ్మద్, సత్యనారాయణ, ప్రేమకుమార్, మహేష్, శేఖర్, దేవేంద్రన్‌నియమితులయ్యారు.

గాయపడిన వ్యక్తి మృతి

తిరువొత్తియూరు: నెల్లై జిల్లాలో కుమార్తె పెళ్లి సందర్భంగా అరటి చెట్టు కడుతున్న సమయంలో కాలు జారి కిందపడి గాయపడిన తండ్రి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో పెళ్లి ఇంటి విషాదం అలుముకుంది. నెల్‌లై సమీపంలోని నంజాన్ కులంకు చెందిన సోర్‌మక్కని (55) కుమార్తె వివాహం బుధవారం రాత్రి జరిగింది. ఇందుకోసం గత 27వ తేదీన వధువు తండ్రి సోర్ మక్కని భవనం పైకి ఎక్కి అరటి చెట్టు కడుతున్నాడు. ఆ సమయంలో అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని బంధువులు నెల్‌లై ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కోయంబేడు మార్కెట్‌లో దొంగల హల్‌చల్

తిరువొత్తియూరు: కోయంబేడు మార్కెట్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. పలువురి వద్ద నగదు, సెల్‌ఫోన్లు చోరీ చేశారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అరియలూరు జిల్లాకు చెందిన కదిరవన్ (26) గురువారం రాత్రి కోయంబేడు మార్కెట్‌కు మునగకాయలు తీసుకుని వచ్చాడు. కాయలను దింపి వాహనంలోనే కాసేపు పడుకున్నాడు. లేచి చూసేసరికి సెల్‌ఫోన్, చొక్కా జేబులో ఉన్న రూ.40 వేలు వేలు చోరీకి గురైనట్టు గుర్తించాడు. ఆ ప్రాంతమంతా వెతికినా దొరకలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోయంబేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కదిరవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, నిఘా కెమెరాలను పరిశీలిస్తున్నారు.

న్యాయవాది సహా ఇద్దరి హత్య

తిరువొత్తియూరు: అలంకులం సమీపంలో భూ వివాదంలో న్యాయవాది సహా ఇద్దరు హత్యకు గురయ్యారు. ఈ కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి పరారీలో వున్న సైనికుడి కోసం గాలిస్తున్నారు. టెన్కాశి జిల్లా అలంకులం పక్కనే ఉన్న నెట్టూరుకు చెందిన చిన్నదురై (60) బొమ్మల దుకాణం నిర్వహిస్తున్నాడు. అతని కుమారుడు అశోక్ రాజ్ (29) న్యాయవాది. తెన్‌కాశి కోర్టులో పనిచేస్తున్నాడు. చిన్నదురై కుటుంబానికి, పక్కనే ఉంటున్న పాండియన్ కుటుంబానికి భూ వివాదం ఉంది. కాశ్మీర్‌లో ఆర్మీ జవానుగా కూడా పనిచేస్తున్న సురేష్ (27) సెలవుపై గత వారం పట్టణానికి వచ్చాడు. దీంతో వారిద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని చిన్నదురై తరపు వారు తెన్‌కాశి ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. దీంతో సురేష్ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నదురై సోదరుడు దురైరాజ్‌కు చెందిన వైక్ కోల్ ఇంటికి నిప్పంటించి, ఆపై దురైరాజ్ తోటకు వెళ్లారు. మొక్కజొన్న పంటను నాశనం చేశారు. ఈ విషయమై చిన్నదురై అలంకులం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. న్యాయవాది అశోకరాజ్ గురువారం రాత్రి 9.30 గంటలకు తన ఇంట్లో ఉండగా సురేష్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకుని అశోక్‌రాజ్‌పై కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని సోదరి అరుళజ్యోతి, పెదనాన్న దురైరాజ్ (60)పైనా దాడి చేశారు. దురైరాజ్ నెట్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. తెన్‌కాశి ఎస్పీ శాంసన్, పోలీసులతో కలిసి అక్కడికి వెళ్లి మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో హంతకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అశోక్‌రాజ్ బంధువులు, న్యాయవాదులు అలంకుళం-రెడ్డి యార పట్టి రోడ్డులో గురువారం రాత్రి ఆందోళన చేపట్టారు. పోలీసులు వారితో చర్చలు జరిపి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సురేష్, అతని తండ్రి, కులందై పాండియన్, మహారాజన్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరిలో ముగ్గురిని గురువారం రాత్రి అరెస్టు చేశారు. పరారీలో ఉన్న సురేష్ కోసం గాలిస్తున్నారు. జంట హత్యల ఘటనతో రెండో రోజు కూడా అక్కడ ఉద్రిక్తత కొనసాగుతోంది.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అటవీ ప్రాంత వాసులు

వేలూరు: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తమిళనాడు కొండ ప్రాంత వాసుల సంఘం ఆధ్వర్యంలో ప్రజలు వేలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహాలింగం మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం 2006 అమలు చేయాలని కోరారు. అడవి జంతువుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, కొండ ప్రాంతాల్లో నివశించే గిరిజనులకు ఇంటి పట్టాలు ఇప్పించి ఇల్లు ప్రభుత్వమే నిర్మించాలన్నారు. కుటుంబ అభివృద్ధికి సబ్సిడీతో కూడిన రుణాలు ఇప్పించాలని కోరారు. ఈ ధర్నాలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరవణన్, ఉప కార్యదర్శి మారిముత్తు, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి స్వామినాధన్, గిరిజనులు పాల్గొన్నారు.

మహిళకు నగలు అప్పగింత

అన్నానగర్: ఆటోలో పోగొట్టుకున్న నగలను పోలీసులు బాధితురాలికి అప్పగించారు. విరుదునగర్ జిల్లా ఎన్‌జీఓ కాలనీకి చెందిన పుష్ప(35) చెన్నైలోని కొరుక్కుపేటలోని మూపనార్‌నగర్ ప్రాంతంలో నివసించే మురుగానందం ఇంట్లో జరిగిన వివాహ వేడుక వెళ్లింది. గురువారం రాత్రి తిరిగి కొరుక్కుపేట నుంచి ఆటోలో తండైయార్ పేటై మెట్రో స్టేషన్‌కు వచ్చింది. ఆటో దిగుతుండగా తాను తెచ్చుకున్న నగల బ్యాగును మరిచిపోయి వెళ్లిపోయింది. బ్యాగులో 12 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నాయి. అనంతరం పుష్ప తండయార్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. తండయార్‌పేట కరుణానిధి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రమేష్ (44) గురువారం రాత్రి రైడ్ ముగించుకుని ఇంటికి వెళ్లగా ఆటోలో బ్యాగ్ ఉండడం చూశాడు. అందులో బంగారు ఆభరణాలు ఉన్నాయి. వెంటనే తండయార్‌పేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాటిని క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మురుగానందంకు ఇచ్చాడు. వారు పుష్పను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బంగారు నగలు అప్పగించారు. పుష్ప పోలీసులు, ఆటో డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ రమేష్‌ను పోలీసులు అభినందించారు.

వాహనాలు ఢీకొని ఇద్దరు దుర్మరణం

అన్నానగర్: పెరంబలూరు సమీపంలో గురువారం రాత్రి ఆమ్ని బస్సులు, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పెరంబలూరు జిల్లా ఆలందూర్ తాలూకా పడలూరులోని ఓ ప్రైవేట్ బనియన్ కంపెనీ నుంచి గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరుపూర్‌లో జరిగే వివాహ వేడుకకు జనాన్ని ఎక్కించుకుని ఆమ్నీ బస్సు బయలుదేరింది. చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారి పై బస్సు వచ్చినప్పుడు కారు ఆమ్నీ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఏమీకాలేదు. ఈ ప్రమాదంపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగుతుండగా ఆ సమయంలో చెన్నై నుంచి మదురైకి వెళుతున్న మరో ఆమ్నీబస్సు రోడ్డుపై నిలిచి ఉన్న ఆమ్నీబస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కురువంపట్టికి చెందిన విజయ్ (24), భార్గవ్(6) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

తిరువళ్లూరు: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చిక్సిత పొందుతూ మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా కొట్టియూర్ గ్రామానికి చెందిన మురుగన్ కుమారుడు రాజీ(41). ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు. వీరిలో పెద్ద కుమారుడు అరవిందన్(22) తల్లి ఉమ, తమ్ముడు ఆకాష్‌తో కలిసి తిరుముల్లైవాయల్‌లో నివాసం వుంటున్నాడు. వారానికి ఒకసారి కొట్టియూర్‌కు వచ్చి తండ్రిని చూసి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఆదివారం అరవిందన్ ఇంటికి వచ్చిన సమయంలో తండ్రి రాజీ మద్యం తాగడానికి డబ్బులు అడిగాడు. అయితే డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపం చెందిన రాజీ గత సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆలస్యంగా గుర్తించిన బంధువులు రాజీని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ రాజీ గురువారం రాత్రి మృతిచెందాడు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలకు శ్రీకారం


పంచమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని శ్రీకపిలేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నపవిత్రోత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉదయం పంచమూర్తులైన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, గణపతి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరుని ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనె, పసుపు, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ కె.సుబ్బరాజు, కంకణభట్టార్ ఉదయకుమార్ గురుకుల్, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోవడంతో భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. గురువారం అర్ధరాత్రి వరకు 62,005 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,127 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.75 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

పిడుగుపడి మహిళ మృతి

అన్నానగర్: కొత్తమంగళంలో గురువారం రాత్రి పిడుగు పడి ఓ మహిళ మృతిచెందింది. పుదుకోట్టై జిల్లా, కీరమంగళం సమీపంలోని కొత్తమంగళం చిదంబరవిడుది ఒత్తంగోట్టై ప్రాంతానికి చెందిన గోపు. సింగపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని భార్య విద్య (31). నాలుగేళ్ల క్రితం వివాహమైన వీరికి భవ్యశ్రీ (2) అనే కుమార్తె ఉంది. కొత్తమంగళంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. విద్య బంధువుల ఇంటికి వెళ్లి గురువారం రాత్రి ఇంటికి వెళుతోంది. అప్పుడు ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టుపై పడిన పిడుగు పక్కనే ఉన్న విద్యపై కూడా పడింది. గాయపడిన విద్యను ఇరుగుపొరుగు కొత్తమంగళం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు విద్య అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

అన్నానగర్: చిన్నసేలం సమీపంలో శుక్రవారం ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కళ్లకురిచి జిల్లా చిన్నసేలం సమీపం మేలూరు నార్త్ కట్టుకోట్టై ప్రాంతానికి చెందిన ఆర్ముగం (43) రైతు. ఇతనికి సెల్వి, పార్వతి అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య సెల్వికి షాలిని అనే కుమార్తె, రెండవ భార్య పార్వతికి నితీష్ అనే కుమారుడు ఉన్నారు. భర్తతో మనస్పర్ధలు రావడంతో పార్వతి నాలుగేళ్లుగా పుట్టింట్లో ఉంటోంది. దీని కారణంగా అతను మొదటి భార్య సెల్వితో కలిసి ఆర్ముగం నివసిస్తున్నాడు. శుక్రవారం ఒంటరిగా ఉన్న ఆర్ముగం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్ముగం తండ్రి మురుగన్ చిన్నసేలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీట్ యూజీ రాష్ట్ర అర్హుల జాబితా విడుదల

వరుణ్ చక్రవర్తికి ఫస్ట్ ర్యాంక్

- టాప్ టెన్‌లో ఏడుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు
- వెల్లడించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ–2023లో అర్హత సాధించిన రాష్ట్ర విద్యార్థుల జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. నీట్‌లో మొత్తం 720 మార్కులకు 720 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ పొందిన బోరా వరుణ్ చక్రవర్తి స్టేట్ టాపర్‌గా నిలిచాడు. 711 మార్కులతో ఆల్ ఇండియా 25వ ర్యాంకర్ వైఎల్ ప్రవర్ధన్ రెడ్డి రెండో స్థానంలో, 38 ర్యాంకర్ వి.హర్షిల్ సాయి మూడో స్థానంలో నిలిచారు. రాష్ట్రంలో మొదటి పది ర్యాంకులు పొందినవారిలో ఏడుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. రాష్ట్రం నుంచి నీట్ యూజీకి 69,690 మంది దరఖాస్తు చేసుకోగా, 68,578 మంది పరీక్ష రాశారు. వీరిలో 42,836 మంది అర్హత సాధించారు. వారిలో అత్యధికంగా 28,471 మంది అమ్మాయిలు, 14,364 మంది అబ్బాయిలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. https://drysr.uhsap.in వెబ్‌సైట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను ఉంచారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్) అందించిన నీట్ అర్హుల వివరాల ఆధారంగా రాష్ట్ర జాబితాను ప్రదర్శించినట్లు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల కాగానే నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.



అర్హత సాధించిన విద్యార్థులు ఇలా..

కేటగిరీ	విద్యార్థులు
జనరల్	6,999
జనరల్ ఈడబ్ల్యూఎస్	6,088
జనరల్ వికలాంగులు(పీడబ్ల్యూడీ)	24
జనరల్ ఈడబ్ల్యూఎస్ పీడబ్ల్యూడీ	19
ఓబీసీ నాన్ క్రీమీ లేయర్(ఎన్‌సీఎల్)	19,024
ఓబీసీ ఎన్‌సీఎల్ పీడబ్ల్యూడీ	45
ఎస్సీ	8,443
ఎస్సీ పీడబ్ల్యూడీ	15
ఎస్టీ	2,178
ఎస్టీ పీడబ్ల్యూడీ	01

నీట్ యూజీ టాప్–10 విద్యార్థులు

విద్యార్థి	ఆల్ ఇండియా ర్యాంక్	నీట్ స్కోర్ (720కు)
బోరా వరుణ్ చక్రవర్తి	01	720
వైఎల్ ప్రవర్ధన్‌రెడ్డి	25	711
వి.హర్షిల్‌సాయి	38	710
కె.యశశ్రీ	40	710
కె.ప్రణతీరెడ్డి	45	710
జి.గిరివర్షిత	51	710
పి.ఆశిష్	57	710
రోహిత్‌వర్మ వేగేశ్న	61	710
బి.రఘువీర్	73	710
వీవీపీ సింహారెడ్డి	75	710

ట్విటర్‌కు రూ.50 లక్షల జరిమానా

సాక్షి బెంగళూరు: కేంద్రం ఆదేశాలు ధిక్కరించినందుకు సామాజిక మాధ్యమం ట్విటర్‌కు కర్ణాటక హైకోర్టు రూ.50 లక్షల జరిమానా విధించింది. వివిధ కారణాల వల్ల 2021 ఫిబ్రవరి నుంచి 2022 ఫిబ్రవరి వరకు మొత్తం 39 యూఆర్ఎల్‌లను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం ట్విటర్‌ను ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయకపోవడంతో ఆ ఖాతాలను కేంద్ర సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ స్తంభింపచేసింది. ఈ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ ట్విటర్ హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. శుక్రవారం ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ దీక్షిత్ విచారిస్తూ.. ట్విటర్ ఖాతాలను బ్లాక్ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ట్విటర్ బిలియన్ డాలర్ల కంపెనీ అని, వారేమీ కార్మికులు, రైతులు కాదని, ఈ నేపథ్యంలో జరిమానా చెల్లించాల్సిందేనని చెప్పారు. రూ.50 లక్షలు జరిమానాను 45 రోజుల్లో కర్ణాటక రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించారు.

క్లుప్తంగా...

సెంథిల్ బాలాజీ డిస్మిస్ ఉత్తర్వులు వెనక్కి

- కేంద్ర హోంశాఖ హెచ్చరికలతో తమిళనాడు గవర్నర్ యూ టర్న్

సాక్షి, చెన్నై: తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ వ్యవహారంలో గవర్నర్ రవి యూటర్న్ తీసుకున్నారు. సెంథిల్ బాలాజీని మంత్రి వర్గం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఐదుగంటల్లోన గవర్నర్ వెనక్కి తగ్గారు. కేంద్ర హోంశాఖ హెచ్చరికలు, అటార్నీ జనరల్ సలహాతో తన ఉత్తర్వులను రాత్రికి రాత్రే వెనక్కి తీసుకున్నారు. గవర్నర్ వ్యవహరిస్తున్న తీరుపై చట్ట పోరాటానికి సీఎం స్టాలిన్ సిద్ధమయ్యారు. సెంథిల్‌ను డిస్మిస్ చేస్తూ గురువారం రాత్రి 8 గంటల సమయంలో గవర్నర్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. స్పందించిన సీఎం స్టాలిన్ చట్టపరంగా గవర్నర్‌ను ఎదుర్కొంటామని చెప్పారు. ఇది జరిగిన ఐదు గంటల్లోనే డిస్మిస్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు. గవర్నర్ జారీ చేసిన డిస్మిస్ ఉత్తర్వులపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన కార్యాలయ వర్గాల ద్వారా గవర్నర్‌కు సూచనలు చేశారు.

లింగమనేని గెస్ట్‌హౌస్ జప్తు హర్షణీయం

- 1,006 వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కరకట్టపై బాబు నివాసం ఉంటున్న లింగమనేని గెస్ట్‌హౌస్ అక్రమ నిర్మాణం, మాజీ మంత్రి నారాయణ ఆస్తులను పాక్షికంగా జప్తు చేసేందుకు కోర్టు ఆదేశాలివ్వడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,006వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. అధికారం అడ్డుపెట్టుకుని దోచుకొని దాచుకోవడమే లక్ష్యంగా గత ప్రభుత్వ పాలనలో బాబు అక్రమాలకు పాల్పడ్డాడని, అందుకు నిదర్శనమే బాబు అక్రమ నివాసం జప్తునకు న్యాయస్థానం ఆదేశాలివ్వడమన్నారు. మంత్రి నారాయణను సీఆర్డీఏ వైస్ చైర్మన్‌గా చేసి బాబు చైర్మన్ హోదాలో చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని, వాటిపై పూర్తిస్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తే దొడ్డిదారిలో స్టేలు తెచ్చుకుని తిరుగుతున్న బాబు అరెస్టు తప్పదని తెలిపారు. పేదలకు శాటిలైట్ సిటీ నిర్మాణం చేస్తుంటే వద్దని కోర్టుకు వెళ్లడంలో బాబు అండ్‌కో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. త్వరలో బహుజనుల కోరిక నెరవేరి రాజధాని ప్రాంతంలో అన్ని హంగులతో శాటిలైట్ సిటీ నిర్మాణం కానుందని హర్షం వ్యక్తం చేశారు. త్వరలో మూడు రాజధానులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య విషయంలో విజయం సాధించి తీరతామన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్ ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీ ఈసెట్ ఫలితాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ(కే) ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ఈసెట్–2023 ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదల కానున్నాయి. వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు శుక్రవారం ఈ విషయాన్ని తెలిపారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 34,503 మంది హాజరయ్యారన్నారు. ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి విడుదల చేస్తారని తెలిపారు.

కనీసం 15 క్రెడిట్ పాయింట్లు ఉంటేనే ప్రాక్టీస్ రెన్యువల్

సాక్షి, అమరావతి: కనీసం 15 క్రెడిట్ పాయింట్లు ఉంటేనే వైద్యులకు ఐదేళ్లకోసారి ప్రాక్టీస్ రెన్యువల్ చేయడానికి అనుమతించాలని నిర్ణయించినట్టు కౌన్సిల్ ప్రజాసంబంధాల కమిటీ మెంబర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎథిక్స్ కమిటీకి వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. వైద్యులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వైద్యులు రిజిస్ట్రేషన్‌ను రెన్యువల్ చేసుకోవడానికి వన్ స్టాప్ పద్ధతిని అమలు చేయబోతున్నట్టు చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ డాక్టర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగాల కన్వీనర్ల నియామకం

- 17 దేశాల విభాగాలకు కన్వీనర్లను నియమించిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: అమెరికా, కెనడా, యూకే, జర్మనీ, యూరోపియన్ యూనియన్‌సహా 17 దేశాలకు వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగాల కన్వీనర్లను ఆపార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఐదు దేశాలకు ఎన్‌ఆర్‌ఐ విభాగాల అడ్వైజరీ ప్యానల్‌ను కూడా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

తోడు దొంగలు దొరికారిలా..

చంద్రబాబు, నారాయణ క్విడ్ ప్రోకో బట్టబయలు

- బాబు కరకట్ట నివాసం జప్తుకు అనుమతితో భారీ అవినీతి నిర్ధారణ
- అలైన్‌మెంట్ మార్పుతో వారి భూములు పోకుండా మాస్టర్ ప్లాన్
- స్వయంగా పర్యవేక్షించిన చంద్రబాబు, నారాయణ
- తుదకు పట్టిచ్చింది కరకట్ట నివాసమే
- సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా వెలుగులోకి..



చంద్రబాబు కరకట్ట నివాసం

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన అమరావతి భూ కుంభకోణాల బాగోతం బట్టబయలైంది. చంద్రబాబు, అప్పటి మంత్రి పొంగూరు నారాయణ ద్వయం భూ దోపిడీ నిర్ధారణ అయ్యింది. అమరావతిలో సీడ్ క్యాపిటల్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట క్విడ్ ప్రో కోకు పాల్పడ్డారన్నది స్పష్టమైంది. ఈ కేసులో ఏ–1గా ఉన్న చంద్రబాబు కరకట్ట నివాసాన్ని అటాచ్ చేసేందుకు న్యాయస్థానం అనుమతినిచ్చింది. దాంతోపాటు ఈ కేసులో ఏ–2గా ఉన్న పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు, భూ సమీకరణ కింద పొందిన కౌలు మొత్తం రూ.1.92 కోట్లను కూడా అటాచ్ చేసేందుకు న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం శుక్రవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబు కరకట్ట నివాసం, నారాయణ కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న ప్లాట్లు, బ్యాంకు నిల్వలను బదలాయించేందుకు మార్పులు చేసేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. ఆ ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం జులై 14 లోపు నోటీసులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. ఈ కేసులో పూర్తి స్థాయి అటాచ్‌మెంట్ కోసం కేసు విచారణ కొనసాగుతుందని తెలిపింది. దాంతో అమరావతి భూ కుంభకోణం ద్వారా చంద్రబాబు, నారాయణ, వారి బినామీలు భారీగా అవినీతికి పాల్పడ్డారని నిగ్గుతేలింది. అమరావతిలో చంద్రబాబు, నారాయణ సాగించిన భూ అక్రమాలను సిట్ నిర్ధారించింది. క్విడ్ ప్రో కో కింద పొందిన కరకట్ట నివాసం, అమరావతిలో ప్లాట్లు, భూ సమీకరణ కింద పొందిన కౌలు మొత్తాన్ని అటాచ్ చేసేందుకు అనుమతించాలన్న సిట్ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆ ఆస్తుల ఆటాచ్‌మెంట్‌కు అనుమతించాలని సిట్ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై రెండు నెలల విచారణ అనంతరం న్యాయస్థానం అటాచ్‌మెంట్‌కు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో చంద్రబాబు కరకట్ట నివాసం, నారాయణ కుటుంబ సభ్యుల ప్లాట్లు, బ్యాంకు ఖాతాల అటాచ్‌మెంట్ కోసం సీఐడీ చర్యలు తీసుకోనుంది.

అటాచ్ చేయనున్న ఇద్దరి ఆస్తులు

- ఏ–1 చంద్రబాబు కరకట్ట నివాసం (లింగమనేని రమేశ్ కుటుంబం పేరిట ఉన్న ఈ నివాసాన్ని బాబు క్విడ్ ప్రో కో కింద పొందారు)
- ఏ–2 పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు
- ఏ–2 నారాయణ భార్య పొత్తూరి ప్రమీల, కుటుంబ సభ్యులు, బంధువులు రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప భూ సమీకరణ కింద ఇప్పటి వరకు పొందిన కౌలు మొత్తం రూ.1,92,11,482

చంద్రబాబు అవినీతి మాస్టర్‌ప్లాన్

అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీ అవినీతికి పాల్పడినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో ఆధారాలతో సహా బట్టబయలైంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు టీడీపీ ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో కన్సల్టెన్సీని ఎంపిక చేసింది. లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు బినామీలకు చెందిన భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా.. వారి భూముల వెలుపలి నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేలా మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా చంద్రబాబు కుటుంబానికి లింగమనేని కుటుంబం భారీగా ప్రతిఫలాన్ని ముట్టజెప్పింది. ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను హెరిటేజ్ ఫుడ్స్‌కు 'అమ్మినట్టు' ఇవ్వడంతో సరిపెట్టకుండా, కృష్ణా నది కరకట్ట మీద ఉన్న నివాసాన్ని కూడా చంద్రబాబుకు అప్పగించింది.

లింగమనేని నుంచి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూమి

కరకట్ట నివాసమే కాదు లింగమనేని కుటుంబం భూములను కూడా చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్‌కు అప్పగించిందన్నది కూడా సిట్ దర్యాప్తులో వెల్లడైంది. 2014లో లింగమనేని కుటుంబ సభ్యుల నుంచి హెరిటేజ్ ఫుడ్స్ 4 ఎకరాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు చూపించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమినే హెరిటేజ్ ఫుడ్స్‌కు బదలాయించారు. ఆ సమయంలో నారా లోకేశ్ డైరెక్టర్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై మంత్రి కూడా అయిన లోకేశ్ అదే లింగమనేని కుటుంబం ఇచ్చిన కరకట్ట మీద నివాసంలోనే నివసించారు.

సీడ్ క్యాపిటల్‌లో వేళ్లూనుకున్న అవినీతి

అమరావతికి గుండె కాయ వంటి సీడ్ క్యాపిటల్‌లో కూడా ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారు. శాసనసభ, సచివాలయం మొదలైన ప్రధాన విభాగాలన్నీ కూడా సీడ్ క్యాపిటల్ పరిధిలోనే నిర్మిస్తామని ప్రకటించడంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరుగుతాయి. అందుకే సీడ్ క్యాపిటల్‌లో పూర్తిగా తమ వాటా భూములే ఉండేట్టుగా వారు వ్యవహారం సాగించారు. సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వానికి 2015 జూలైలోనే సమర్పించినప్పటికీ ఆమోదించకుండా మూడు నెలలపాటు కాల యాపన చేశారు. ఆ మూడు నెలల్లోనే నారాయణ తమ బినామీలు, బంధువులైన పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో 65.50 ఎకరాలు కొనుగోలు చేశారు. అందుకోసం నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. వారి పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేశారు. ఆ నిధులతో ఆ కంపెనీ ఉద్యోగుల పేరున భూములు కొనుగోలు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆ ఉద్యోగులను సిట్ అధికారులు ప్రశ్నించగా తాము నారాయణ బినామీలుగానే భూములు కొనుగోలు చేశామని వాంగ్మూలం ఇచ్చారు.

బినామీల పేరుతో 75,888 చ.గజాలు

నారాయణ తమ బంధువులు, బినామీల పేరిట సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్‌డీయేకు ఇచ్చారు. అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చ.గజాల స్థలాలను పొందారు. వాటిలో 7,620 చ.గజాలు, 8,880 చ.గజాలు, 6,550 చ.గజాలు, 25 వేల చ.గజాల స్థలాలు కూడా ఉండటం... అవి నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానించి ఉండటం గమనార్హం. భవిష్యత్‌లో స్టార్ హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఇతర భారీ వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుకూలమైన, విలువైన స్థలాలను పొందారన్నది స్పష్టమవుతోంది. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్‌డీఏ ఇప్పటి వరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. అంటే ఆ భూములు కొనుగోలు చేసి సీఆర్‌డీఏకే ఇచ్చినట్టు పేర్కొన్న పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పూర్తిగా నారాయణ బినామీలేనన్నది నిర్ధారణ అయ్యింది.

బెడిసికొట్టిన పన్నాగం

- కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. సీఎం హోదాలో చంద్రబాబు జీతంతో పాటు ఇంటి అద్దె అలవెన్స్ కూడా తీసుకున్నారు. కానీ చంద్రబాబు 2017 నుంచి తాను ఉంటున్న కరకట్ట నివాసానికి గాను లింగమనేని కుటుంబానికి అద్దె చెల్లించినట్టు ఎక్కడా బ్యాంకు లావాదేవీలు లేవు. చంద్రబాబు నుంచి తీసుకున్న అద్దెకు లింగమనేని ఎక్కడా జీఎస్టీ చెల్లించనే లేదు. దీన్నిబట్టి క్విడ్ ప్రో కోలో భాగంగానే కరకట్ట నివాసాన్ని చంద్రబాబుకు లింగమనేని ఇచ్చారన్నది సుస్పష్టమైంది.
- కరకట్ట నివాసంపై తప్పుదోవ పట్టించేందుకు లింగమనేని రమేశ్ కూడా యత్నించారు. తాను దేశభక్తితోనే కరకట్ట నివాసాన్ని అప్పటి ప్రభుత్వం వాడుకునేందుకు ఉచితంగా ఇచ్చానని న్యాయస్థానానికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఇంటిని ఉచితంగా ఇస్తే చంద్రబాబు ప్రజాధనం నుంచి ఇంటి అద్దె అలవెన్స్‌ను ఎందుకు తీసుకుంటున్నారని సిట్ అధికారులు ప్రశ్నించగా లింగమనేనికి నోట మాట రాలేదు.
- దేశభక్తితో ఉచితంగా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి గానీ, చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఇవ్వడం ఏమిటంటే కూడా సమాధానం లేదు. ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చి ఉంటే.. బాబు సీఎం పదవి నుంచి దిగిపోగానే ఆ ఇంటిని ఖాళీ చేసి ప్రభుత్వానికి అప్పగించాలి.
- 2019లో సీఎం పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా చంద్రబాబు అదే కరకట్ట నివాసంలో ఉంటున్నారు. అంటే లింగమనేని దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నది అవాస్తవం. క్విడ్ ప్రో కో లో భాగంగానే ఆయన చంద్రబాబుకు ఇచ్చారన్నది నిర్ధారణ అయ్యింది.

వారి భూముల సమీపం నుంచే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించడంలోనూ చంద్రబాబు, నారాయణ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. వారి భూములను ఆనుకునే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థల సమీపం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా చంద్రబాబు, నారాయణ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అందుకోసం సామాన్య రైతుల భూముల గుండా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అందుకోసం ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు కూడా సీఆర్‌డీయే అనుమతులు నిలిపివేసింది. అంటే కన్సల్టెన్సీ సంస్థ అలైన్‌మెంట్‌ను రూపొందించకముందే చంద్రబాబు, నారాయణ ఇన్నర్‌రింగ్ రోడ్డు ఎలా నిర్మించాలో నిర్ణయించేశారు. అప్పటికే నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకే ఓ కన్సల్టెన్సీని నియమించి కనికట్టు చేశారు. వాస్తవానికి విజయవాడలోని కామినేని ఆసుపత్రి వద్ద ఉన్న తాడిగడప– ఎనికేపాడు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కన్సల్టెన్సీ సంస్థ ఎస్టీయూపీ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూముల గుండా రోడ్డును నిర్మించాల్సి వస్తుంది. దీనిపై అప్పటి సీఆర్‌డీయే వైస్ చైర్మన్‌గా ఉన్న నారాయణ సీఆర్‌డీయే సమావేశంలోనే అధికారులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. తాడిగడపకు 3 కి.మీ. దూరంగా తూర్పు వైపు నుంచి పెనమలూరు–నిడమానూరు మీదుగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్పించారు. ఈ అక్రమాలన్నీ సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా నిర్ధారణ అయ్యాయి. క్విడ్ ప్రో కో కు పాల్పడినట్టు న్యాయస్థానం కూడా భావించి.. చంద్రబాబు, నారాయణ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతినిచ్చింది.

కరకట్ట నివాసంలో లెక్కలేనన్ని అక్రమాలు

- అధికార దుర్వినియోగానికి అది పరాకాష్ట.. చంద్రబాబు నేరాలన్నీ బయటకు వస్తాయి
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: చంద్రబాబు చేసిన తప్పులు, నేరాలన్నీ బయటకు వస్తాయని.. వాటిని ఆధారాలతో సహ నిరూపిస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఉండవల్లి కరకట్టపై లింగమనేని అతిథి గృహం, ప్రజా వేదిక నిర్మాణమే తెలుగుదేశం పార్టీ చేసిన అధికార దుర్వినియోగానికి నిదర్శనమని తెలిపారు. చంద్రబాబు నివాసం, మాజీ మంత్రి నారా యణ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు కోర్టు అనుమతించిన నేపథ్యంలో శుక్ర వారం ఆయన మీడియాతో మాట్లాడారు. కరకట్టపై చంద్రబాబు నివాసానికి సంబంధించి లెక్కలేనన్ని ఉల్లంఘనలు జరిగాయన్నారు. కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిన తర్వాత కూడా టీడీపీ నాయకులు తాము జవాబుదారీ కాదని వాదించడం విడ్డూరంగా ఉందన్నారు. కోర్టు ఇచ్చిన డైరెక్షన్‌ను కూడా తప్పు పట్టడం కోర్టులను అవమానించడమేనని చెప్పారు. టీడీపీ బరితెగింపు.. కోర్టుల్ని కూడా ప్రశ్నించే స్థాయికి చేరుకుందన్నారు.

అన్నింటికీ ఆధారాలున్నాయి..

కుంభకోణం ఏమీ లేదంటున్నప్పుడు తేలేదేమీ ఉండదని వదిలేయచ్చు కదా అని ప్రశ్నించారు. మరి ఎందుకు ఉలిక్కిపడుతున్నారు.. ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. రాజధాని మాస్టర్‌ప్లాన్ ద్వారా లింగమనేని రమేష్‌కు లబ్ధి చేకూర్చారని, ఆయన భూముల సరిహద్దు వరకు భూములు తీసుకుని, ఆయన భూములను తప్పించారని తెలిపారు. రాజధాని కుంభకోణాలన్నింటికీ అప్పుడు మున్సిపల్ మంత్రిగా ఉన్న నారాయణ అనుసంధానకర్తని, ఆయన చంద్రబాబుకు సన్నిహితుడని చెప్పారు. దానికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని, లింగమనేని ఇంట్లో చంద్రబాబు ఉండడమే ఒక ఆధారమని తెలిపారు.

బీసీ మహిళంటూ బాబు బుకాయింపు!

- ఆమె స్వాతిరెడ్డి కాదు.. శ్వేతా చౌదరి
- టీడీపీ వికృత రాజకీయాల్లో భాగస్వామి
- సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో దుష్ప్రచారం
- ఆమె కుటుంబానికి సైతం అందుతున్న పలు పథకాలు
- తండ్రికి ఇంటి స్థలం.. విడిగా ఉంటున్న తల్లికి వితంతు పింఛన్

సాక్షి, అమరావతి: కళ్లార్పకుండా అబద్ధాలను వల్లించడంలో తాను గోబెల్స్‌ను మించిపోయిన విషయాన్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి రుజువు చేసుకున్నారు! టీడీపీ అనుబంధ విభాగం ఐ–టీడీపీని వికృత పోస్టులకు అడ్డాగా మార్చేసిన ఆయన అసభ్యకర పోస్టులు పెట్టే శ్వేతా చౌదరి అలియాస్ స్వాతిరెడ్డిని నిస్సిగ్గుగా సమర్థించడం విస్మయం కలిగిస్తోంది. పైగా ఆమె బీసీ మహిళ అంటూ బుకాయించడం గమనార్హం.

స్వాతి రెడ్డి ఎందుకు అయ్యారంటే...

కమ్మ సామాజిక వర్గానికి చెందిన కోట శ్వేతాచౌదరి మారుపేరుతో స్వాతిరెడ్డినంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేయడం వెనుక టీడీపీ పక్కా పన్నాగం దాగుంది. తిరుపతికి చెందిన ఆమె నర్సింగ్ కోర్సు చేసి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ చదివేందుకు స్టూడెంట్ వీసాపై లండన్‌లో ఉంది. ఐ–టీడీపీ కార్యకర్తగా వ్యవహరిస్తోంది. కువైట్ టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగంలో క్రియాశీలకంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్, ఆయన కుటుంబ సభ్యులపై వ్యక్తిగతంగా అసభ్యకర పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేయడమే లక్ష్యంగా ఐ–టీడీపీ ఆమె పేరు, సామాజికవర్గం పేరును మార్చేసింది. శ్వేతా చౌదరిని ఏకంగా స్వాతి రెడ్డిగా మార్చి సోషల్ మీడియాలో అకౌంట్ తెరిచింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా కించపరుస్తూ అసభ్యకర రీతిలో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోంది. ఆమెను నిస్సిగ్గుగా వెనకేసుకు రావడం ద్వారా ఈ కుట్ర వెనుక తాను ఉన్నట్లు చంద్రబాబు చెప్పకనే చెప్పారు!

ఆమె కుటుంబానికీ సంక్షేమ పథకాలు..

ముఖ్యమంత్రి జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్న శ్వేతా చౌదరి అలియాస్ స్వాతి రెడ్డి కుటుంబానికి కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోంది. ఆమె తండ్రి కోట విశ్వనాథ్ ప్రస్తుతం ఆ కుటుంబానికి దూరంగా మదనపల్లిలో మరో మహిళతో కలసి జీవిస్తున్నారు. వారిద్దరికీ రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు– పేదలు అందరికీ ఇళ్లు' పథకం కింద విడివిడిగా ఇళ్లను మంజూరు చేసింది. అయితే వారిద్దరూ తమకు పక్కపక్కనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతున్నారు. శ్వేతాచౌదరి తండ్రి జీవించి ఉన్నప్పటికీ తిరుపతిలో నివసిస్తున్న ఆమె తల్లి లలిత వితంతు పింఛన్ పొందుతున్నారు.

శ్వేతాచౌదరిని చంద్రబాబు ఎలా సమర్థిస్తారు?

- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



సాక్షి, అమరావతి: శ్వేతాచౌదరి యూకే నుంచి స్వాతిరెడ్డి పేరుతో సోషల్ మీడియాలో హీనాతి హీనమైన పోస్టింగ్‌లు పెడుతోందని, సీఎం వైఎస్ జగన్ కుటుంబంలోని మహిళలపై నీచమైన పోస్టింగ్‌లు పెడుతున్న ఆమెను చంద్రబాబు ఎలా సమర్థిస్తారని, దీని ద్వారా సమాజానికి ఏం సందేశాన్నిస్తున్నారని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ప్రశ్నించారు. వెలగపూడిలోని సచివాలయంలోని పబ్లిసిటీ బ్లాక్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. టీడీపీకి చెందిన శ్వేతాచౌదరి ఉండేది యూకేలో అయినా ఆమె బుద్ధి మాత్రం పాతాళంలోకి దిగజారిపోయిందని పోస్టింగ్‌లు చూస్తే అర్థమవుతోందన్నారు. విచ్చలవిడిగా వ్యవహరించిన ఆమె కూడా చివరకు అదే సోషల్ మీడియా బాధితురాలిగా మారిందని గుర్తు చేశారు. సోషల్ మీడియా ద్వారా ఇలాంటి జుగుప్సాకర యుద్ధాలకు కాలు దువ్వే శ్వేతాచౌదరి వంటి వారిని చంద్రబాబు సమర్థించడం దారుణమన్నారు. ఆమె పెట్టిన పోస్టింగ్‌లకు గడ్డి పెట్టకపోగా.. మహిళా కమిషన్ కూడా శ్వేతాచౌదరికి మద్దతివ్వాలంటున్న మహిళలపై హీనాతి హీనమైన పోస్టింగ్‌లు పెట్టినప్పుడు వాటిపై కఠిన చర్యలుండాలని అన్నారు. తప్పుడు పోస్టింగ్‌లు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు లేకపోవడంతో ఇరువైపులా దారుణమైన పోస్టులతో యుద్ధాలు చేస్తున్నారని, దీనివల్ల బలవుతోంది మహిళలేనని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననం హత్యకంటే దారుణంగా మారినప్పుడు చట్టాలకు పదును పెట్టలేమా? సోషల్ మీడియాను కట్టడి చేయలేమా? అని ప్రశ్నించారు. దీనిపై అందరం మాట్లాడదామని, అవసరమైన సూచనలు అన్ని వ్యవస్థలకు చేద్దామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర మహిళా కమిషన్ జూలై 5వ తేదీన విజయవాడలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
శనివారం ॥ 1-7-2023

* మనం మాట్లాడుకోవాల్సిందే!

ఆధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!



ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.



ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్



సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.



డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి



డ్యాన్స్ క్లాస్‌లో ...

దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్టాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్తుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హోర్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!



కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజనీర్‌గా నిలిచాడు.



విధి నిర్వహణలో క్వాజీ



తల్లిదండ్రులతో...

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఈ ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటీ, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది" అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...

ది బాస్ లేడీ



ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క, ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.



"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.



గుడ్ ఫుడ్

చినుకుల్లో తప్పక తినండి

నేరేడు చెట్టు మీద కాయలు
చెట్టు కింద పిల్లలు
ఒకప్పటి చిత్రం.
ఊరి చెట్టుగా ఉండే
నేరేడు ఇళ్ల మధ్య నుంచి అదృశ్యమైపోయింది.
వానలు మొదలైతే నేరేడు కాయలు వస్తాయి.
ఇప్పుడు మార్కెట్‌లో కొలువు తీరి
నల్లవజ్రాల్లా మెరుస్తున్నాయి.
వీటివల్ల కలిగే హెల్త్ బెనిఫిట్స్
మీకు తెలిస్తే బండి ఆపుతారు.
అరకిలో తప్పక తీసుకుంటారు.

ప్రకృతికి అన్నీ తెలుసు. ఏ సమయంలో ఏ కాయను జనులకు ఇచ్చి వారి ఆరోగ్యం మెరుగు పరచాలో తెలుసు. తొలకరి మొదలైనప్పుడు, వానలు ప్రారంభమయ్యాక రకరకాల సూక్ష్మక్రిములు పైకి లేచి, నీట కలిసి ఇన్ఫెక్షన్లు కలిగిస్తాయి. అలాంటి ఇన్ఫెక్షన్లకు విరుగుడుగా ఈ కాలంలో నేరేడు పండ్లు వస్తాయి. తొలి ఏకాదశి నాటికి ముమ్మరంగా దొరుకుతాయి. వగరుగా తీపిగా ఉండి, తిన్న వెంటనే నాలుక రంగు మారి, గొంతు కాస్త పట్టినట్టుగా అనిపించి... కాని ఈ సీజన్‌లో వీటి రుచి ఒంటికి పట్టాలి. శరీరానికి వీటి అవసరం ఉంది.

చిట్టి నేరేడు... అల్లనేరేడు

నేరేడు పండ్ల చెట్టు గతంలో పల్లెల్లో పట్నాల్లో రోడ్డు పక్కన, మైదానాల దగ్గర, స్కూళ్ల చుట్టుపక్కల కనిపించేది. ఇప్పుడు దాదాపుగా ఊళ్లల్లో ఎవరూ నేరేడు వేయడం లేదు. ప్రత్యేకంగా సాగు చేసి వీటి పండ్లను మార్కెట్‌లో అమ్మాల్సి వస్తోంది. లేదంటే నేరేడు చెట్టెక్కని పిల్లలు గతంలో ఉండేవారు కాదు. దేశవాళి నేరేడు చిన్నదిగా ఉంటుంది. ఇది చిట్టి నేరేడు. కొంచెం కోలగా ఉండేది అల్ల నేరేడు. ఇప్పుడు హైబ్రీడ్ నేరేడు మార్కెట్‌లో విస్తృతంగా దొరుకుతోంది. ఏ నేరేడు దొరికినా ఈ సీజన్‌లో రోజూ కొన్ని పండ్లు తినడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

గతంలో తాతయ్యలు, అమ్మమ్మలు నేరేడు పండ్ల అమ్మకం బుట్ట వస్తే కొని వాటిని ఇష్టపడని పిల్లల చేత కూడా బలవంతంగా గదమాయించి తినిపించేవారు. దానికి కారణం నోట్లో నుంచి పొరపాటున కడుపులోకి వెళ్లిన వెంట్రుకలు పేగుల్లో ఉండిపోతే వాటిని కరిగించి పారేసే శక్తి నేరేడుకు ఉందని తాతయ్యలు చెప్పేవారు. నులి పురుగులు కూడా నశిస్తాయి. అయితే నేరేడుకు ఈ శక్తి మాత్రమే కాదు. ఇంకా విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. నేరేడును 'కింగ్ ఆఫ్ యాంటీ ఆక్సిడెంట్స్' అంటారు. శరీరంలోని అపసవ్య కణాలను, కేన్సర్ కారకాలను ఇది అమోఘంగా శుభ్రం చేస్తుంది. దీనిని తింటే స్థూలకాయం కలిగి, షుగర్ బారిన పడబోతున్నవారు ఆ ప్రమాదాన్ని నిలువరించగలరు. షుగర్ ఉన్నవారు ఈ సీజన్‌లో రెగ్యులర్‌గా యాభై నుంచి డెబ్బయి గ్రాముల వరకూ తీసుకోవచ్చు. నేరేడులోని గ్యాలిక్ యాసిడ్, యాంతోసైనిన్స్ ఇన్సులిన్‌ను ఉత్సాహపరుస్తాయి. మందకొడితనాన్ని వదిలిస్తాయి.

పరిశోధనల్లో తేలింది

అమెరికాలో 2010లో ఒక్లహామా స్టేట్ యూనివర్సిటీ జరిపిన పరిశోధనలో నేరేడు పండ్లు 8 వారాల పాటు రెగ్యులర్‌గా తగిన మోతాదులో తీసుకుంటే బ్యాడ్ కొలస్ట్రాల్ నశిస్తుందని తేలింది. 2012లో హార్వర్డ్ యూనివర్సిటీ వారు నేరేడుపండ్ల మీద పరిశోధన చేసి 12 వారాలు వాటిని రెగ్యులర్‌గా తిన్న వారిలో మెదడు కణాలు ఉత్తేజితం కావడం ఆయుష్మంతం కావడం గమనించారు. తెలివితేటల్ని పెంచే కణాలు నేరేడు వల్ల వృద్ధి చెందుతున్నాయని నిర్ధారించారు. నేరేడులోని డెల్ఫిలిడిన్ అనే పదార్థం బ్రెస్ట్ క్యాన్సర్‌ను నివారిస్తుంది.



కాయ, చెట్టు, ఆకు

నేరేడు కాయ, చెట్టు, ఆకు అన్నీ కూడా ఏదో విధంగా శరీరానికి, ఆరోగ్యానికి ఉపయోగపడేవే. నేరేడు పండ్లు తింటే నోటి అల్సర్లు తగ్గుతాయి. దంతాలు, చిగుళ్లకు మంచిది. నేరేడు గుజ్జును తీసి ముఖానికి పట్టించుకుంటే ముఖచర్మం ఆరోగ్యవంతం అవుతుంది. నేరేడు పళ్ల జ్యూస్ అరికాళ్ల మంటలు తగ్గిస్తుంది. నేరేడులో విటమిన్ సి ఎక్కువ కనుక వానలు మొదలయ్యాక వచ్చే జలుబు, దగ్గు వంటి వాటికి మంచి మందుగా ఉపయోగపడుతుంది.

నేరేడు ఈ సీజన్‌కు రేడు. ఆస్వాదించండి.

మీలో ఏకాగ్రత ఎంత?



ఏకాగ్రత ఉంటేనే ఏ పనినైనా సాధించగలం. అందుకే ఏకాగ్రత పెంచుకోవడం అందరికీ అవసరం. ముఖ్యంగా విద్యార్థులకు చాలా అవసరం. అందుకోసం ఏం చేయాలో చూద్దాం.

ఏకాగ్రత లేకుండా చదవడం లేదా ఏ పనినైనా చేయడం అంటే చిల్లికుండలో నీళ్లు నింపడం లాంటిదే.ఏకాగ్రత లేకుండా చేసే పనివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. అయితే కొందరిలో ఎంత ప్రయత్నించినా ఏకాగ్రత ఉండదు. అలా ఏకాగ్రత లేకపోవడానికి మానసిక, శారీరక సమస్యలు కారణం కావచ్చు. ఇంకొంతమందికి ఎక్కువ సమయం ఒకే విషయం మీద ఫోకస్ చేసినా ఏకాగ్రత లోపిస్తుంది. నిద్రలేమి, ఇన్ఫెక్షన్లు, డిప్రెషన్ మొదలైన ఆరోగ్య సమస్యలు కూడా కారణాలు కావచ్చు.

ఏకాగ్రత పెరగాలంటే...

ముందు మనం విద్యార్థుల కోసం చెప్పుకుందాం...

▶ చదువుకునేందుకు మంచి వాతావరణాన్ని సృష్టించుకోవాలి. టీవీ, ఫోన్, కంప్యూటర్, మ్యూజిక్ ప్లేయర్‌కి దూరంగా ఉండాలి. ▶ స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకోవాలి.
▶ ఏ పనికి ఎంత సమయం కేటాయించాలో పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. మల్టీ టాస్కింగ్ ఎప్పుడూ చేయకూడదు. ▶ స్టడీసెషన్స్‌కు నలభైనుంచి యాభై నిమిషాలకంటే ఎక్కువ సమయం కేటాయించొద్దు. అలసిపోకుండా ఉండేందుకు మధ్యమధ్యలో విరామం అవసరం. ▶ మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. బాధలను, ఆందోళనలను మర్చిపోవాలి. ▶ చదువుతున్నప్పుడు ముఖ్యమైన పాయింట్స్‌ను, టాపిక్స్‌ను నోట్ చేసుకోవాలి. అవసరమైనప్పుడు వాటిని రిఫర్ చేసుకోవాలి.

యోగా, ధ్యానం మొదలైన టెక్నిక్స్ ఉపయోగపడతాయి.

ఎస్‌క్యూ3ఆర్ పద్ధతి

ఎస్ (సర్వే): చదివిన దాంట్లో ముఖ్యమైనవి ఒక సర్వే పుస్తకంలో రాసుకోవాలి. టైటిల్స్, సబ్-టైటిల్స్, క్యాప్షన్స్ లాంటివి రిఫరెన్స్‌కి బాగా తోడ్పడతాయి.

క్యూ (క్వశ్చన్): పుస్తకంలో నోట్ చేసుకోవడం, చదవడం పూర్తయ్యాక క్వశ్చన్స్ వేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

ఆర్ 1 (రీడ్): చాప్టర్ పూర్తవగానే క్వశ్చన్, దానికి సరైన జవాబును తెలుసుకొని చదువుకోవాలి. అలా చదివితే మర్చిపోవడం అంటూ జరగదు.

ఆర్ 2 (రిసైట్): చదివిన వాటిని తిరిగి ప్రశ్నించుకుంటూ వాటి జవాబులను గుర్తు చేసుకోవాలి. సొంతంగా జవాబులను తయారు చేసుకోవాలి. అవసరమైతే ముందు రాసుకున్న నోట్స్ తీసి చూడాలి.

ఆర్ 3 (రివ్యూ): చదివిన తర్వాత అవన్నీ మెదడులో తాజాగా ఉండాలంటే మళ్లీ మళ్లీ చదవాలి.

మామూలుగా అందరూ కంటితో చూస్తూ చదువుతారు. ఒకటి కంటే ఎక్కువ ఇంద్రియాల ప్రమేయం చదివే ప్రక్రియలో మనం భాగం చేయగలిగితే ఏకాగ్రత మెరుగవుతుంది.

1) పైకి చదవడం- చదువుతున్నది చెప్పడమే కాకుండా వింటాం కూడా.

2) చదివేది పుస్తకంలో క్లుప్తంగా రాయడం.

3) ఇప్పుడు చాలా రకాలైన పుస్తకాలు, పిడిఎఫ్ లు చదివి వినిపించే ఆప్స్ ఉన్నాయి. కుదిరితే ఇలా వింటూ, చూస్తూ, ఒక నోటు పుస్తకంలో ముఖ్యమైన వాటిని రాసుకుంటూ చదివితే ఏకాగ్రత కోల్పోవడం తగ్గుతుంది.

మన ఏకాగ్రతకు భంగం కలిగించే వస్తువులు (సెల్ ఫోను), వ్యక్తులను చదువుతున్నప్పుడు దూరం పెట్టాలి.

వీలయినంత వరకు చదవడానికి ఒక ప్రదేశం (లైబ్రరీ, ఇంటి లో ఒక గది) నిర్ణయించుకుని అక్కడే ప్రతిరోజు చదివితే, మన బుర్రలో అది స్థిరపడి, ఆ ప్రదేశానికి వెళ్లిన వెంటనే వేరే ఆలోచనలు తక్కువవుతాయి. కొంతమంది ఎక్కువసేపు ఒకచోట కూర్చోలేరు. అలాంటివారు 3-4 చోట్ల మధ్య మారుతూ మెల్లగా అలవాటు చేసుకోవచ్చు.

చదివే వ్యాసాలను ఫ్లో- చార్ట్స్, డయాగ్రమ్స్‌గా నోటు పుస్తకాలలో రాసుకుంటే బాగా గుర్తుంటాయి.

ఇవన్నీ చాలా చిన్న విషయాలుగా అనిపించినా తేలిగ్గా తీసుకోకుండా వాటిని పాటించడం వలన ఏకాగ్రత మెరుగుపరచుకోవచ్చు.

'జంక్'ను జంకేలా చేద్దాం!



బేకరీ లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, చాట్ బండ్లు... ఎక్కడ చూసినా ఎక్కువ శాతం టీనేజర్లే కనిపిస్తూ ఉంటారు. అంతకంటే చిన్న పిల్లలకు స్వయంగా తల్లిదండ్రులే మురిపెంగా తీసుకువెళ్లి తినిపిస్తుంటారు. అయితే బర్గర్లు, పిజ్జాలు, చాట్‌లు, మిల్క్ షేక్స్, ఐస్‌క్రీమ్‌లు వంటివి తినటం వల్ల శరీరంలోకి అదనపు క్యాలరీలు చేరుతుంటాయి. వాటిని కరిగించటానికి సరిపడా వ్యాయామం లేక పిల్లలు ఊబకాయుల్లా తయారవుతున్నారు.

జంక్‌ఫుడ్‌కు అలవాటు పడకుండా ఉండాలంటే ఇంట్లోనే కొత్తరుచుల్లో స్నాక్స్ తయారు చేయటం నేర్చుకోవాలి. తక్కువ నూనె, తీపి, మసాలాలతో రుచికరమైన స్నాక్స్ చేసి పెడితే ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలు ఆకర్షితులవకుండా ఉంటారు.

★ అలాగే ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉండేలా చూసుకుంటే ప్రొటీన్ ఫుడ్ వల్ల మలబద్ధకం తలెత్తకుండా ఉంటుంది. ★ అల్పాహారంలో బ్రెడ్, శాండ్‌విచ్‌లకు బదులు గోధుమ రవ్వతో చేసిన ఉప్మా, పెసలతో చేసిన పొంగల్, పెసరట్టు, రాగి, క్యారట్ ఇడ్లీ లాంటివి ఇవ్వాలి. ★ బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడకబెట్టిన సెనగలు, మొలకలు అందుబాటులో ఉంచాలి. ★ ఫ్రిజ్ ట్రేలలో చాక్లెట్లు, బిస్కెట్లకు బదులు తాజా పండ్లు, సలాడ్లు, పాలు, గుడ్లు, పళ్లరసాలు, చెరుకు రసం, టమాటా రసం లాంటివి ఉండాలి. ★ పిల్లలు ఎక్కువగా ఆటలాడుతూ ఉంటారు కాబట్టి రోజూ గుప్పెడు డ్రై ఫ్రూట్స్ తినేలా చూసుకోవాలి. ★ ఉడికించిన సెనగలు, బొబ్బర్లు ఎక్కువ సమయంపాటు శక్తినిస్తాయి కాబట్టి ఔట్ డోర్ గేమ్స్ ఆడే పిల్లలకు వీటిని స్నాక్స్‌గా ఇస్తూ ఉండాలి.

జంక్ ఫుడ్ నుంచి రక్షించుకోవాలంటే..?

పెద్ద వాళ్ళు జంక్ ఫుడ్స్ తింటూ, కాఫీలు, టీలు తాగేస్తుంటే వారిని చూస్తూ పెరిగే పిల్లలు అదే అలవాటు చేసుకుంటారు. అందువల్ల అలాంటి వాటిని ముందు పెద్దలు మానేయాలి. పెద్దవాళ్ళు పండ్లు, డ్రై ఫ్రూట్స్ తింటూ ఉంటే పిల్లలు కూడా అవే తింటారు. నిమ్మరసం, క్యారెట్ రసం, బీట్రూట్ రసం రోజూ తీసుకోండి. పిల్లలు కూడా అవే ఇష్టపడతారు.

సినిమా

మా చిన్న యువరాణి క్లీంకార

- చిరంజీవి



● అనిల్ కామినేని, శోభన, ఉపాసన, రామ్ చరణ్, సురేఖ, చిరంజీవి

హీరో రామ్‌చరణ్-ఉపాసన దంపతుల కుమార్తెకు క్లీంకార అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని హీరో చిరంజీవి ట్విట్టర్ వేదికగా వెల్లడించి, ఫొటోలు షేర్ చేశారు. జూన్ 20న ఉపాసన ఓ పాపకి జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. పదకొండవ రోజు (జూన్ 30) నిర్వహించిన బారసాలలో పాపకు క్లీంకార కొణిదెల అని పేరు పెట్టారు. ''రామ్‌చరణ్-ఉపాసన దంపతుల కుమార్తెకు 'క్లీంకార కొణిదెల' అని నామకరణం చేశాం. లలితా సహస్ర నామం నుంచి ఈ పేరును తీసుకున్నాం. క్లీంకార అనే పదం ప్రకృతి స్వరూపాన్ని, అమ్మవారిలో నిక్షిప్తమైన శక్తిని సూచిస్తుంది. మా చిన్న యువరాణి ఇలాంటి లక్షణాలను ఇనుమడింపజేసుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను'' అని చిరంజీవి పోస్ట్ చేశారు. క్లీంకార ఊయల్లో ఉండగా రామ్‌చరణ్-ఉపాసన దంపతులతో పాటు పాప తాతయ్యలు చిరంజీవి కొణిదెల, కామినేని అనిల్, నానమ్మ సురేఖ, అమ్మమ్మ శోభన కామినేని ఉన్న ఫొటోలను షేర్ చేశారు.

గౌరవమే స్వేచ్ఛ



● ధనుష్

ధనుష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. ప్రియాంకా అరుళ్ మోహనన్, నివేదితా సతీష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్ సమర్పణలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. 'గౌరవమే స్వేచ్ఛ' అనే క్యాప్షన్‌తో శుక్రవారం 'కెప్టెన్ మిల్లర్' ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు ధనుష్. ''స్వాతంత్ర్యానికి పూర్వం అంటే 1930-1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ చిత్రంలో ధనుష్ మూడు గెటప్స్‌లో కనిపిస్తారు. ఆల్రెడీ 85 శాతం షూటింగ్ పూర్తయింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సాక్షి సక్సెస్ అవ్వాలి

- దర్శకుడు వీవీ వినాయక్

శరణ్‌కుమార్ హీరోగా పరిచయమవుతోన్న చిత్రం 'సాక్షి'. జాస్వీర్ కౌర్ హీరోయిన్. శివకేశన కుర్తి దర్శకత్వంలో ఆర్యూ రెడ్డి, బేబీ లాలిత్య సమర్పణలో మునగాల సుధాకర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం జూలై 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేసిన దర్శకుడు వీవీ వినాయక్ మాట్లాడుతూ- ''విజయనిర్మలగారి ఫ్యామిలీ నుంచి శరణ్ హీరోగా వస్తున్నాడు. ఈ సినిమా పెద్ద విజయం సాధించి, శరణ్‌తో పాటు చిత్ర యూనిట్‌కి మంచి పేరు రావాలి'' అన్నారు. ''సాక్షి' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అన్నారు శరణ్. ''యూనిట్ సభ్యులందరూ బాగా సహకరించారు'' అన్నారు శివ. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని విజయవంతం చేయాలి'' అన్నారు సుధాకర్‌రెడ్డి, ఆర్‌యూ రెడ్డి.



● శరణ్, వినాయక్

పుష్ప పార్టీ

పుష్పరాజ్ పార్టీ ఇస్తున్నాడు. ఈ పార్టీ సందడి ఎంత గ్రాండ్‌గా ఉంటుందనేది సిల్వర్ స్క్రీన్‌పైనే చూడాలట. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప 2' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లీగా హీరోయిన్ రష్మికా మందన్నా నటిస్తున్నారు. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఆల్రెడీ విడుదలై, ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం మలిభాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఓ రిసార్ట్‌లో జరుగుతోందని తెలిసింది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా పాల్గొనగా ఓ పాట చిత్రీకరిస్తున్నారని, సినిమాలో ఇది పార్టీ సాంగ్‌గా ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు.



● అల్లు అర్జున్

రెండో భాగం కూడా హిట్ కావాలి

- వరుణ్ తేజ్



● రాజేష్, వరుణ్ తేజ్, కామాక్షి

''రాజేష్ నటించిన 'మా ఊరి పొలిమేర' బాగా నచ్చింది. దానికి సీక్వెల్‌గా రూపొందిన 'మా ఊరి పొలిమేర-2' టీజర్ ఆసక్తిగా ఉంది. మొదటి భాగం కంటే రెండో భాగం పెద్ద హిట్ కావాలి'' అన్నారు హీరో వరుణ్ తేజ్. 'సత్యం' రాజేష్, కామాక్షి భాస్కర్ల లీడ్ రోల్స్‌లో డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. గౌరు గణబాబు సమర్పణలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను వరుణ్ తేజ్ రిలీజ్ చేశారు. ''ఈ నెలాఖరులో లేక ఆగస్ట్ మొదటి వారంలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు గౌరీకృష్ణ. ''ఓ హత్య నేపథ్యంలో సాగే చిత్రమిది'' అన్నారు అనిల్ విశ్వనాథ్. ''నటుడుగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది'' అన్నారు 'సత్యం' రాజేష్.


ముప్పైఏళ్లు వెనక్కి...

'అల్లరి' నరేశ్ మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లనున్నారు. 'అల్లరి' నరేశ్ హీరోగా సుబ్బు దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ చిత్రాన్ని రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించనున్నారు. జూన్ 30 (శుక్రవారం) 'అల్లరి' నరేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించారు. 'అల్లరి' నరేశ్ కెరీర్‌లో ఇది 62వ సినిమా. ''ఈ చిత్రంలో నరేశ్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తారు. లవ్, ఎమోషన్స్, యాక్షన్, డ్రామా అంశాలతో 1990 నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుంది. సెప్టెంబరు చివర్లో ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం. నాథన్.



● 'అల్లరి' నరేశ్

ఐదు రెట్ల వినోదం



● అక్షయ్ కుమార్

బాలీవుడ్ కిలాడి అక్షయ్ కుమార్ కెరీర్‌లో 'హౌస్‌ఫుల్' మూవీ ఫ్రాంచైజీది ప్రత్యేక స్థానం. అక్షయ్‌లోని కామెడీ స్టైల్‌ను ప్రేక్షకులకు పరిచయం చేసింది 'హౌస్‌ఫుల్' చిత్రాలే. ఇప్పటివరకూ 'హౌస్‌ఫుల్' ఫ్రాంచైజీ నుంచి వచ్చిన నాలుగు చిత్రాల్లో అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్‌లు నటించారు. తాజాగా 'హౌస్‌ఫుల్ 5'ని ప్రకటించారు. 'దోస్తానా', 'డ్రైవ్' సినిమాలకు దర్శకత్వం వహించిన తరుణ్ మన్సుఖాని 'హౌస్‌ఫుల్ 5' సినిమాను తెరకెక్కించనున్నారు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది దీపావళికి విడుదల కానుంది. ''ఐదు రెట్ల వినోదంతో 'హౌస్‌ఫుల్ 5'ను 2024 దీపావళికి విడుదల చేయనున్నాం'' అన్నారు అక్షయ్ కుమార్.

ప్రేక్షకుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- నిఖిల్ సిద్ధార్థ్



● గ్యారీ, ఐశ్వర్యా మీనన్, నిఖిల్, చరణ్ తేజ్

''స్పై'కి నా కెరీర్‌లోనే ఎక్కువ ఓపెనింగ్స్ వచ్చాయి. మా సినిమాని ఇంతగా ఆదరించి, నా కెరీర్‌ని మరో మెట్టు పైకి ఎక్కిస్తూ మంచి ఓపెనింగ్స్ ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇకపైనా మరిన్ని మంచి చిత్రాలు ఇస్తానని మాట ఇస్తున్నా'' అని నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యా మీనన్ జంటగా నటించిన చిత్రం 'స్పై'. కె. రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా జూన్ 29న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సీఈఓ చరణ్ తేజ్ మాట్లాడుతూ-''స్పై'కి ఇంత పెద్ద ఓపెనింగ్స్ (రూ. 11 కోట్ల 7లక్షలు) రావడం హ్యాపీగా ఉంది. డిస్ట్రిబ్యూటర్స్ సంతోషంగా ఉన్నారు'' అన్నారు. ''మాకు ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు గ్యారీ బీహెచ్.

స్లమ్ డాగ్ హస్బెండ్



● సంజయ్, కల్యాణ్ రామ్

నటుడు బ్రహ్మాజీ తనయుడు, 'పిట్టకథ' మూవీ ఫేమ్ సంజయ్ రావ్ హీరోగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హస్బెండ్'. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రణవి మానుకొండ హీరోయిన్. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో కల్యాణ్ రామ్ విడుదల చేసి, సినిమా మంచి విజయం సాధించాలన్నారు. ''చక్కని కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అలా.. ఇలా



● పూర్ణ, శక్తి వాసుదేవ్

ప్రముఖ దర్శకుడు పి. వాసు తనయుడు శక్తి వాసుదేవన్ హీరోగా రాజ్ శంకర్, పూర్ణ, బ్రహ్మానందం, అలీ తదితరులు ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'అలా ఇలా ఎలా'. రాఘవ దర్శకత్వంలో కొల్లకుంట నాగరాజు నిర్మించారు. మణిశర్మ స్వరపరచిన ఈ చిత్రం పాటల ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఆడియోను రిలీజ్ చేశారు. ''మంచి సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు ఎస్‌కెఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్ అధినేత ఆదినారాయణ. ''ఈ నెల 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కొల్లకుంట నాగరాజు.

బ్రహ్మచారి తిప్పలు



● మల్లేశం,స్వప్న

గుంట మల్లేశం, స్వప్న సిరి జంటగా నర్సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'బ్రహ్మచారి'. బి. రాంభూపాల్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం పాటలు, టీజర్‌ని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ రిలీజ్ చేశారు. ''తెలంగాణలోని బ్రహ్మచారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు? అనే కథతో రూపొందించిన చిత్రమిది'' అన్నారు రాంభూపాల్ రెడ్డి. ''దుబాయ్ వెళ్లొచ్చిన ఓ అబ్బాయి పెళ్లి చేసుకుందామనుకున్న టైమ్‌లో అమ్మాయి దొరక్క ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు? అనేదే ఈ చిత్రకథ'' అన్నారు నర్సింగ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	803	64,718
నిఫ్టీ ▲	216	19,189

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,802	▲	211
డోజోన్స్	34,446	▲	323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,532	▲	60
డాక్స్	16,148	▲	90
షాంఘై	3,202	▲	20
నికాయ్	33,169	▼	64

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,055
బంగారం (99.5 స్వచ్ఛత)	57,823
వెండి (కిలో)	68,429

మౌలిక రంగం వృద్ధి మేలో 4.3 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పరిశ్రమల గ్రూప్ మే నెల్లో 4.3 శాతం వృద్ధిరేటును నమోదుచేసుకుంది. ఏప్రిల్‌లో కూడా ఇదే స్థాయిలో వృద్ధిరేటు నమోదు కాగా, 2022 మేలో పోల్చితే ఇది భారీ తగ్గుదల. 2022 మేలో కీలక రంగం వృద్ధిరేటు 19.3 శాతం. 2022 మే నెల్లో ఈ స్థాయి భారీ (19.3 శాతం) పురోగతికి 2021 కరోనా కాలంనాటి బేస్ ఎఫెక్ట్ కారణం. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వాటా 40.27 శాతం. ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం, ఎనిమిది రంగాలనూ వేర్వేరుగా చూస్తే, క్రూడ్ ఆయిల్ (మైనస్ 1.9 శాతం), సహజ వాయువులు (మైనస్ 0.3 శాతం), విద్యుత్ (మైనస్ 0.3 శాతం) ఉత్పత్తిలో అసలు వృద్ధిలేకపోగా క్షీణత నమోదయ్యింది. బొగ్గు ఉత్పత్తి వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదయ్యింది. రిఫైనరీ ప్రొడక్టుల వృద్ధిరేటు 2.8 శాతంగా ఉంది. ఎరువులు, స్టీల్, సిమెంట్ వృద్ధిరేట్లు వరుసగా 9.7 శాతం, 9.2 శాతం, 15.5 శాతాలుగా నమోదయ్యాయి. ఇదిలావుండగా, ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో మౌలిక రంగం వృద్ధి రేటు 4.3 శాతంగా నమోదయ్యింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ పురోగతి రేటు 14.3 శాతం.

పోస్టాఫీసు పొదుపు పథకాల రేట్ల పెంపు

- ఎక్కువ పథకాల్లో రేట్లు యథాతథం
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన

న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్రం సవరించింది. జూలై 1 నుంచి మొదలయ్యే మూడు నెలల కాలానికి తాజా రేట్లను ప్రకటించింది. కొన్నింటి పథకాల రేట్లను 0.3 శాతం వరకు పెంచగా, చాలా పథకాల్లో రేట్లను యథాతథంగా కొనసాగించింది.



- ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ)పై ప్రస్తుతం 6.2 శాతంగా ఉన్న రేటు పెంపు అనంతరం 6.5 శాతంగా మారింది.
- ఏడాది కాల టర్మ్ డిపాజిట్‌పై 0.1 శాతం పెరిగి 6.9 శాతానికి చేరగా, రెండేళ్ల టైమ్ డిపాజిట్ రేటు 6.9 శాతం నుంచి 7 శాతానికి చేరుకుంది.
- మూడేళ్ల టర్మ్ డిపాజిట్ (7%), ఐదేళ్ల టర్మ్ డిపాజిట్ (7.5%) రేట్లలో మార్పు చేయలేదు.
- అలాగే పీపీఎఫ్ వడ్డీ రేటు సైతం ఎలాంటి మార్పుల్లేకుండా 7.1 శాతంగా, సేవింగ్స్ డిపాజిట్ రేటు 4 శాతంగా కొనసాగనుంది.
- నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్‌ఎస్‌సీ) రేటు 7.7 శాతం, సుకన్య సమృద్ధి యోజన రేటు 8 శాతంలోనూ మార్పు చేయలేదు.
- సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ 8.2%, కిసాన్ వికాస్ పత్రం రేటు 7.5% కొనసాగనుంది.
- నెలవారీ ఆదాయ పథకం (ఎంఐఎస్) రేటు 7.4 శాతంగా కొనసాగుతుంది.

పెంపు ఆగినట్టేనా?

జనవరి–మార్చి, ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి పొదుపు పథకాలపై రేట్లను పెంచింది. దీంతో ఈ విడత కేవలం 3 పథకాలు మినహా మిగిలిన వాటి రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ సైతం గత సమీక్షల్లోనూ వడ్డీ రేట్లను మార్చలేదు.

ఇక బ్యాంకుల్లోనూ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, 2023 స్కీమ్ ఇక ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకుల్లోనూ అందుబాటులోకి రానుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. బాలికలు, మహిళల ఆర్థిక భద్రత లక్ష్యంగా 2023 ఏప్రిల్ నుంచి ఈ పథకం పోస్టాఫీసుల్లో మాత్రమే అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద చేసిన డిపాజిట్ సంవత్సరానికి 7.5 శాతం వడ్డీని కలిగి ఉంటుంది. త్రైమాసిక చక్రవడ్డీని కలుపుకుంటే 7.7% వడ్డీ వరకూ ప్రయోజనం లభిస్తుంది. కనిష్టంగా రూ. 1,000– గరిష్టంగా రూ.2,00,000 వరకూ డిపాజిట్ చేయవచ్చు. మెచ్యూరిటీ వ్యవధి రెండేళ్లు.

సైయంట్ డీఎల్‌ఎం ఐపీవో హిట్

67 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ సర్వీసుల కంపెనీ సైయంట్ డీఎల్‌ఎం పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్ అయ్యింది. చివరి రోజు శుక్రవారాని(30)కల్లా ఇష్యూ 67 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్ సాధించింది. కంపెనీ 1,33,32,297 షేర్లను ఆఫర్ చేయగా.. 89,73,16,952 షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఎన్‌ఎస్‌ఈ గణాంకాల ప్రకారం అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 90.4 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటాలో 45 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. ఇక రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి సైతం 49 రెట్లుపైగా దరఖాస్తులు వెల్లువెత్తడం గమనార్హం! వెరసి షేరుకి రూ. 250–265 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 592 కోట్లు సమీకరించింది. హైదరాబాద్ ఐటీ కంపెనీ సైయంట్‌కు అనుబంధ సంస్థ ఇది.

ఐడియాఫోర్జ్ ఐపీవోకు క్యూ

డ్రోన్ తయారీ కంపెనీ ఐడియాఫోర్జ్ టెక్నాలజీ పబ్లిక్ ఇష్యూ బంపర్ సక్సెస్‌ను అందుకుంది. చివరి రోజు శుక్రవారాని(30)కల్లా ఇష్యూ ఏకంగా 106 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. కంపెనీ 46,48,870 షేర్లను ఆఫర్ చేయగా.. 49,30,29,570 షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి.

రెండోరోజూ రికార్డుల హోరు

ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త గరిష్టాల నమోదు

- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల అండ
- మెటల్ షేర్లకు మాత్రమే నష్టాలు
- ఇన్వెస్టర్ల సంపద ఆల్‌టైం హైకి
- సెన్సెక్స్ లాభం 803 పాయింట్లు
- 216 పాయింట్లు పెరిగిన నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్లో రెండోరోజూ రికార్డుల హోరు కొనసాగింది. అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్ షేర్లు మూడు శాతం ర్యాలీ చేసి సూచీలను పరుగులు పెట్టించాయి. పటిష్ట ఆర్థిక వ్యవస్థ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ అంశాలు సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. మెటల్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 803 పాయింట్లు పెరిగి 64,718 వద్ద, నిఫ్టీ 216 పాయింట్లను ఆర్జించి 19,189 వద్ద స్థిరపడ్డాయి. ఈ ముగింపు స్థాయిలు సూచీలకు కొత్త జీవితకాల గరిష్టాలు కావడం విశేషం. సెన్సెక్స్ 30 షేర్లగానూ ఐసీఐసీఐ(0.33%), ఎన్‌టీపీసీ (0.11%) మాత్రమే నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.6,397 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ. 1,198 కోట్ల ఈక్విటీలను కొన్నారు. ఈ వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,739 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ 524 పాయింట్లను ఆర్జించింది. ఇక ఈ ఏడాది ప్రథమార్ధంలో బుల్ పరుగులు పెట్టింది. గడిచిన ఆరు నెలల్లో సెన్సెక్స్ 3,913 పాయింట్లు, నిఫ్టీ 1,084 పాయింట్లు(దాదాపు 6%) లాభపడ్డాయి.

ఇంట్రాడేలోనూ కొత్త గరిష్టాలు

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 153 పాయింట్లు లాభంతో 64 స్థాయిపై 64,068 వద్ద మొదలైంది. నిఫ్టీ 105 పాయింట్లు బలపడి 19 వేల స్థాయి ఎగువన 19,077 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఐటీ, ఆటో, బ్యాంకింగ్, ఆర్థిక రంగాల షేర్లను కొనేందుకు ఆసక్తి చూపారు. ఫలితంగా ట్రేడింగ్ సెన్సెక్స్ 853 పాయింట్లు ఎగసి 64,769 వద్ద, నిఫ్టీ 229 పాయింట్ల దూసుకెళ్లి 19,202 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జూన్ వాహన విక్రయ గణాంకాల వెల్లడి(నేడు)కి ముందు ఆటో షేర్లకు డిమాండ్ నెలకొంది. ఎంఅండ్‌ఎం 4%, హీరోమోటో, మారుతీ, బజాజ్ ఆటో, టాటా మోటార్స్ షేర్లు 3–1% చొప్పున రాణించాయి. నిఫ్టీ ఆటో ఇండెక్స్ 15182 స్థాయి వద్ద ఆల్‌టైం హైని అందుకుంది.
- ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 3% చొప్పున లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు రెండుశాతం వరకు పెరిగాయి. బీఎస్‌ఈ ఐటీ ఇండెక్స్ 2.50% ర్యాలీ చేసింది.
- ప్రభుత్వరంగ పంజాబ్ సింధ్ బ్యాంక్ 6%, ఇండియన్ బ్యాంక్ 5%, బ్యాంక్ ఆఫ్ బరోడా 3% షేర్లు చొప్పున పెరిగాయి. పీఎస్‌బీ, కెనరా బ్యాంక్, ఎస్‌బీఐ బ్యాంకు షేర్లు 2–1% లాభపడ్డాయి.

మూడురోజుల్లో రూ. 5.80 లక్షల కోట్లు

సూచీల రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరుకుంది. గడిచిన మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,749 పాయింట్లు బలపడటంతో బీఎస్‌ఈ ఎక్స్ఛేంజీలో రూ.5.80 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. శుక్రవారం ఒక్కరోజే ఇన్వెస్టర్లు రూ.2.36 లక్షల కోట్లను ఆర్జించారు. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల రికార్డు స్థాయి రూ.294.49 లక్షల కోట్లకు చేరింది.

విలీనంతో పలు ప్రయోజనాలు

- హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్

న్యూఢిల్లీ: రెండు దిగ్గజాల విలీనం తదుపరి పలు ప్రయోజనాలు చేకూరనున్నట్లు మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్ పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విలీనం ద్వారా గ్రూప్ కంపెనీలు మరింత పటిష్టపడనున్నట్లు తెలియజేశారు. అమ్మకాలు, నిర్వహణ(ఎగ్జిక్యూషన్), భారీ అవకాశాలు వంటి అంశాలు లబ్ధిని చేకూర్చనున్నట్లు వివరించారు. నేటి(జూలై 1) నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో హెచ్‌డీఎఫ్‌సీ విలీనంకానుంది. దీంతో గృహ రుణాల దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీకి 46 ఏళ్లుగా సేవలందించిన పరేఖ్‌కు శుక్రవారం చివరి పని దినంగా మారనుంది. దీంతో వాటాదారులకు చివరి సందేశాన్ని వినిపించారు. బ్యాంకుగల కీలక సమర్థతలు గృహ రుణ విభాగానికి మరింత బలాన్ని అందించనున్నట్లు అభిప్రాయపడ్డారు. గృహ రుణ వినియోగదారుల్లో నిలకడను తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్‌కుగల డిజిటైజేషన్ ప్లాట్‌ఫామ్‌లతోపాటు.. భారీ పంపిణీ నెట్‌వర్క్ గృహ రుణాలతోపాటు.. గ్రూప్ కంపెనీలకూ ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు వివరించారు.

విలీనంలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు తమవద్ద గల ప్రతీ 25 షేర్లకు గాను 42 హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లు కేటాయించనున్న సంగతి తెలిసిందే. 40 బిలియన్ డాలర్ల విలువైన షేర్ల మార్పిడి ద్వారా చోటుచేసుకుంటున్న విలీనం దేశీ కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద లావాదేవీగా నిలవనుంది. హెచ్‌డీఎఫ్‌సీ విలీనం సంస్థ రూ. 18 లక్షల కోట్ల ఆస్తులతో ఫైనాన్షియల్ సర్వీసుల రంగంలో భారీ దిగ్గజంగా ఆవిర్భవించనుంది.



విలీనానికి బోర్డుల గ్రీన్‌సిగ్నల్

ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు విలీనానికి రెండు సంస్థల బోర్డులూ ఆమోదముద్ర వేశాయి. దీంతో నేటి(జూలై 1) నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది.

కాగా, బీమా రంగ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గోలో మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ తాజాగా 0.5097% వాటాను కొనుగోలు చేసింది. దీంతో వాటాను 50.5 శాతానికి పెంచుకుంది. తద్వారా హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గోను అనుబంధ సంస్థగా మార్చుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విలీనానికి వీలుగా తాజా కొనుగోలు చేపట్టినట్లు హెచ్‌డీఎఫ్‌సీ పేర్కొంది.

వారాంతాన బీఎస్‌ఈలో హెచ్‌డీఎఫ్‌సీ షేరు 1.5 శాతం లాభపడి రూ. 2,822 వద్ద నిలవగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సైతం 1.5 శాతం పుంజుకుని రూ. 1,702 వద్ద స్థిరపడింది.



'పార్కిన్సన్స్'కు గురైన అలెన్ బోర్డర్

ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ అలెన్ బోర్డర్ తాను 'పార్కిన్సన్స్' వ్యాధితో బాధపడుతున్నట్లు మొదటిసారి ప్రకటించాడు. తాను ఏడేళ్ల క్రితం దీనికి గురయ్యానని, అయితే ఎవరూ తనపై జాలి చూపించరాదని ఇప్పటి వరకు చెప్పలేదన్నాడు. నాడీ వ్యవస్థపై ప్రభావం పడే కారణంగా శారీరక కదలికలు సాధారణంగా లేకపోవడం ఈ వ్యాధి లక్షణం. 'ఇది తెలిస్తే జనం ఎలా స్పందిస్తారో తెలీదు. బాధపడతారా లేదా ఓదారుస్తారా చెప్పలేం. అయితే ఎప్పుడో ఒకసారి తెలుస్తుంది కాబట్టి ఇప్పుడు చెబుతున్నా' అని బోర్డర్ వెల్లడించాడు. 68 ఏళ్ల బోర్డర్ తాను 80 ఏళ్లు జీవించగలిగితే అదే చాలా గొప్పగా భావిస్తానని, మరో 'సెంచరీ' సాధించలేనని మాత్రం కచ్చితంగా చెప్పగలనని భావోద్వేగంతో అన్నాడు. 156 టెస్టుల్లో 11,174 పరుగులు... 273 వన్డేల్లో 6524 పరుగులు చేసిన అలెన్ బోర్డర్ రెండు ఫార్మాట్‌లలో కలిపి 30 సెంచరీలు, 99 అర్ధసెంచరీలు సాధించాడు. అతని నాయకత్వంలోనే ఆస్ట్రేలియా 1987లో తొలిసారి వన్డే వరల్డ్‌కప్‌ను గెలుచుకుంది.



ఆసియా కబడ్డీ చాంప్ భారత్

ఫైనల్లో ఇరాన్‌పై గెలుపు

బుసాన్ (కొరియా): డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల కబడ్డీ జట్టు ఆసియా చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. శుక్రవారం జరిగిన హోరాహోరీ ఫైనల్ పోరులో భారత్ 42–32తో ఇరాన్‌పై ఘన విజయం సాధించింది. ఈ కాంటినెంటల్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కిది ఎనిమిదో ఆసియా టైటిల్ కావడం విశేషం. ఇరాన్ ఆధిపత్యంతో మ్యాచ్ మొదలైంది. కానీ ఆ తర్వాత మ్యాచ్ సాగే కొద్దీ భారత ఆటగాళ్లే పట్టు బిగించారు. దీటుగా భారత డిఫెండర్లు బదులివ్వడంతో పుంజుకుంది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ చక్కగా రాణించాడు. క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చి పెట్టాడు. ఇరాన్ ఆలౌట్ కావడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో తొలి ఆలౌట్ సమయానికి 10–4 స్కోరుతో భారత్ పైచేయి సాధించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత ఆటగాళ్ల ఆల్‌రౌండ్ షోకు ఇరాన్ మరోసారి ఆలౌటైంది. దీంతో 23–11తో ఎదురులేని ఆధిపత్యాన్ని సాధించింది. ఇరానియన్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా చియానె కీలకమైన పాయింట్లతో జట్టును ఆదుకున్నాడు. అయితే భారత ఆటగాళ్ల సమష్టి ప్రదర్శన ముందు అతని పోరాటం నిలువలేకపోయింది. దీంతో మూడో సారి ఇరాన్ ఆలౌట్ కావడంతో భారత్ 33–14తో మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది. అయితే ద్వితీయార్ధంలో ఇరాన్ ఆటగాళ్లు గట్టిపోటీ ఇవ్వడంతో భారత్ ఆధిక్యం తగ్గింది. కానీ ఫలితంలో ఏ మార్పులేకపోయింది. చివరకు భారత్ 42–32తో మ్యాచ్‌ను ముగించి ఆసియా చాంపియన్‌గా నిలిచింది. క్రితం సారి 2017లో ఇరాన్ ఆతిథ్యమిచ్చిన ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ తుది పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. భారత్ టైటిల్ నిలబెట్టుకోవడంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) హర్షం వ్యక్తం చేసింది. 'కుర్రాళ్లు అద్భుతంగా ఆడారు. ఇరాన్‌ను సమష్టిగా దెబ్బతీసి మళ్లీ విజేతగా నిలిచారు' అని ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది.

సెమీస్‌లో శ్రీజ ద్వయం

జాగ్రెబ్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్ మహిళల డబుల్స్‌లో ఆకుల శ్రీజ జోడి సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టింది. భారత్‌కు చెందిన శ్రీజ – దియా చిటాలే ద్వయం క్వార్టర్ ఫైనల్లో 3–2 (9–11, 12–10, 11–7, 5–11, 11–8) స్కోరుతో గ్లిన్ రూ వాంగ్ – జియాన్ జెంగ్ (సింగపూర్)పై విజయం సాధించింది. 39 నిమిషాల పాటు ఈ పోరు హోరాహోరీగా సాగింది. తొలి గేమ్‌ను చేజార్చుకున్నా ఆ తర్వాత చెలరేగిన శ్రీజ – దియా 2–1తో ముందంజ వేసింది. ఆ తర్వాత సింగపూర్ కోలుకున్నా... చివరి గేమ్‌లో భారత జంటదే పైచేయి అయింది. మహిళల సింగిల్స్‌లో భారత టాప్ క్రీడాకారిణి మనికా బాత్రా ప్రిక్వార్టర్స్‌కు చేరింది. తొలి రౌండ్‌లో మనిక 3–1 (6–11, 11–6, 11–3, 11–1)తో హనా అపరోవిచ్ (క్రొయేషియా)పై గెలుపొందింది.

శ్రీలంక గట్టెక్కింది...

- సూపర్ సిక్స్‌లో నెదర్లాండ్స్‌పై గెలుపు
- వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్



ధనంజయ

బులవాయో: నెదర్లాండ్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో మాజీ చాంపియన్ శ్రీలంక గెలిచింది... కానీ గెలిచేందుకు చాలా కష్టపడింది. వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో శుక్రవారం జరిగిన తొలి సూపర్ సిక్స్ పోరులో లంక 21 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 47.4 ఓవర్లలో 213 పరుగులకే ఆలౌటైంది. కరుణరత్నే (51 బంతుల్లో 33; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా, నిసాంక (0), కుశాల్ మెండిస్ (10), సమరవిక్రమ (1), అసలంక (2) విఫలమయ్యారు. ఒక దశలో జట్టు 67 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ స్థితిలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ధనంజయ డిసిల్వా (111 బంతుల్లో 93; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒంటరి పోరాటంతో జట్టును ఆదుకున్నాడు. హసరంగ (21 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్), తీక్షణ (47 బంతుల్లో 28; 1 ఫోర్) అండతో జట్టు స్కోరును 200 పైచిలుకు పరుగులకు దాటించాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో లోగన్ వాన్‌బిక్ (3/26), బాస్ డి లీడ్ (3/42) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకను ఉక్కిరిబిక్కిరి చేశారు. తర్వాత 214 పరుగుల లక్ష్యం సులభమైందే కానీ లంక బౌలర్లు ప్రత్యర్థిని నిలువరించగలిగారు. దీంతో నెదర్లాండ్స్ 40 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు విక్రమ్‌జీత్ (0), మ్యాక్స్ ఓ డౌడ్ (0), తేజ నిడమనూరు (0) ఖాతా తెరువలేదు. వెస్లీ బరెసి (50 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్), బస్ డి లిడె (53 బంతుల్లో 41; 3 ఫోర్లు), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (68 బంతుల్లో 67 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) లంక బౌలింగ్‌కు ఎదుర్కొని గెలిపించేందుకు విఫల ప్రయత్నం చేశారు. తీక్షణ (3/31) కీలక వికెట్లను పడగొట్టగా, హసరంగ 2 వికెట్లు తీశాడు. హరారేలో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో అమెరికాపై 6 వికెట్ల తేడాతో నెగ్గిన ఐర్లాండ్‌కు ఏడో స్థానం దక్కింది. అమెరికా 196 పరుగులకు ఆలౌట్ కాగా, ఐర్లాండ్ 34.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి గెలిచింది.

గెలుపు దిశగా సెంట్రల్, నార్త్‌జోన్

దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్



సౌరభ్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో సెంట్రల్ జోన్, నార్త్‌జోన్ జట్లు గెలుపు దిశగా పయనిస్తున్నాయి. ఈస్ట్‌జోన్‌తో జరుగుతున్న పోరులో సెంట్రల్ ఆటగాళ్లు హిమాన్షు మంత్రి (68; 7 ఫోర్లు), వివేక్ సింగ్ (56; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించగా, సౌరభ్ కుమార్ (4/33) స్పిన్ బౌలింగ్‌తో తిప్పేశాడు. శుక్రవారం 64/0 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆటప్రారంభించిన సెంట్రల్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 87.5 ఓవర్లలో 239 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్లు హిమాన్షు మంత్రి, వివేక్‌సింగ్ తొలి వికెట్‌కు 124 పరుగులు జోడించారు. అనంతరం 300 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన ఈస్ట్‌జోన్ సౌరభ్ స్పిన్ ఉచ్చులో పడింది. ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 69 పరుగులే చేసింది.

నార్త్ ఆల్‌రౌండ్ దెబ్బకు...

నార్త్‌జోన్ ఆల్‌రౌండ్ దెబ్బకు నార్త్ ఈస్ట్‌జోన్ కుదేలైంది. దీంతో మూడో రోజు ఆటలోనే నార్త్ ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లను కోల్పోయింది. మొదట 65/3 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన నార్త్ ఈస్ట్‌జోన్ 39.2 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలింది. దీంతో నార్త్‌కు 406 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను నార్త్ జోన్ 55.1 ఓవర్లలో 259/6 వద్ద డిక్లేర్ చేసింది. ప్రభ్ సిమ్రన్‌సింగ్ (59; 9 ఫోర్లు, 1 సిక్స్), అంకిత్ (70; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. దీంతో ప్రత్యర్థికి 666 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, నార్త్ ఈస్ట్‌జోన్ ఆట నిలిచే సమయానికి 18 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది.

బైజూస్ స్థానంలో డ్రీమ్11

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు జెర్సీ ప్రధాన స్పాన్సర్‌గా ఫాంటసీ స్పోర్ట్స్ లీగ్ కంపెనీ 'డ్రీమ్11' ఎంపికవడం దాదాపు ఖాయమైంది. ఈ విషయాన్ని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అయితే ఎంత మొత్తానికి అనే విషయంపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటి వరకు టీమిండియా జెర్సీ స్పాన్సర్‌గా ఎడ్యుకేషనల్ టెక్నాలజీ కంపెనీ 'బైజూస్' ఉంది. గత ఏప్రిల్‌తో బైజూస్ ఒప్పందం ముగిసింది. దాంతో బీసీసీఐ కొత్త స్పాన్సర్ల కోసం బిడ్‌లను పిలిచింది. గతంలో ఐపీఎల్ టోర్నీ ప్రధాన స్పాన్సర్‌గా కూడా డ్రీమ్11 వ్యవహరించింది. అయితే బీసీసీఐతో కొత్త ఒప్పందం ప్రకారం... ఇప్పటివరకు బైజూస్ చెల్లించిన మొత్తం (ఒక్కో మ్యాచ్‌కు)కంటే డ్రీమ్11 తక్కువగా చెల్లించనున్నట్లు సమాచారం. లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత దీనిపై బోర్డు అధికారిక ప్రకటన చేయనుంది.

'మిక్స్‌డ్' విజేత దీపిక-హరీందర్



హాంగ్‌జౌ (చైనా): ఆసియా స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన దీపిక పల్లికల్ – హరీందర్‌పాల్ సింగ్ సంధు జోడి విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో దీపిక – హరీందర్ 11–10, 11–8 స్కోరుతో ఇవాన్ యూయెన్ – రాచెల్ ఆర్నాల్డ్ (మలేసియా)పై విజయం సాధించారు. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్లో మలేసియాకు చెందిన టాప్ సీడ్ ఆయిరా అజ్మాన్ – షఫీక్ కమాల్‌ను...సెమీ ఫైనల్లో తయ్యద్ అస్లామ్ – ఫైజా జఫర్ (పాకిస్తాన్)ను భారత ద్వయం ఓడించింది. ఓవరాల్‌గా ఆసియా చాంపియన్‌షిప్‌ను భారత్ రెండు పతకాలతో ముగించింది. భారత్‌కు చెందిన అనాహత్ సింగ్ – అభయ్ సింగ్ కాంస్యం గెలుచుకున్నారు.

ఆస్ట్రేలియా ఆధిక్యం 221 పరుగులు

- రెండో ఇన్నింగ్స్‌లో 130/2
- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 325 ఆలౌట్

లండన్: 'యాషెస్' సిరీస్‌లో తొలి టెస్టు గెలిచి జోరు మీదున్న ఆస్ట్రేలియా రెండో టెస్టులోనూ పట్టు బిగిస్తోంది. ఇంగ్లండ్‌తో 'లార్డ్స్' మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 45.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖ్వాజా (123 బంతుల్లో 58 నాటౌట్; 10 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (6 నాటౌట్) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (25)తో పాటు మార్నస్ లబుషేన్ (30) అవుటయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో 91 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన ఆస్ట్రేలియా ఓవరాల్‌గా 221 పరుగులు ముందంజలో ఉంది. మ్యాచ్ నాలుగో రోజు శనివారం కూడా మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగిస్తే భారీ లక్ష్యంతో ఇంగ్లండ్‌కు సవాల్ విసరవచ్చు. ఓవర్‌నైట్ స్కోరు 278/4తో మూడో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 325 పరుగులకే ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (50) అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా... స్టోక్స్ (17), బెయిర్‌స్టో (16) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లు సమష్టిగా రాణించడంతో శుక్రవారం ఇంగ్లండ్ బ్యాటింగ్ కుప్పకూలింది. 15.2 ఓవర్లు మాత్రమే ఆడగలిగిన ఆ జట్టు 47 పరుగులు మాత్రమే జోడించి మిగిలిన 6 వికెట్లు కోల్పోయింది. మిచెల్ స్టార్క్ 3 వికెట్లు పడగొట్టగా... ట్రవిస్ హెడ్, హాజల్‌వుడ్ చెరో 2 వికెట్లు తీశారు. వర్షం కారణంగా మొత్తం 61 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మరో వైపు గురువారం ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ఆసీస్ ప్రధాన స్పిన్నర్ నాథన్ లయన్ మూడో రోజు మైదానంలోకి దిగలేదు. గాయం తీవ్రంగా కనిపిస్తున్న నేపథ్యంలో అతను ఈ టెస్టుతో పాటు యాషెస్‌లో మిగిలిన టెస్టులకు కూడా దూరమయ్యే అవకాశం ఉంది.



వికెట్ తీసిన సంబరంలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు

శ్రీరాఘవేంద్ర మఠంలో ద్వాదశి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో స్వామి మూల బృందావనం

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం ద్వాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూలబృందావనాన్ని బెంగళూరు నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథంపై ఉంచి శ్రీమఠం మాడ వీధుల్లో రాత్రి ఊరేగించారు. స్వామి వారిని హైదరాబాద్ సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జి మైత్రి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అధికారులు బిందు స్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వస్తున్న హైదరాబాద్ సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జి మైత్రి



అత్యంత లోతులో అరుదైన చేప

- నీటి అడుగున వెయ్యి రెట్ల అధిక పీడనంలోనూ మనుగడ
- సముద్ర ఉపరితలానికి 8.33 కిలోమీటర్ల లోతున శాస్త్రవేత్తల గుర్తింపు
- ప్రపంచంలోనే అత్యంత లోతైన మరియానా ట్రెంచ్ ప్రాంతంలో పరిశోధన
- అత్యంత చీకటి ప్రదేశంలో 'నత్త చేప' జీవనంపై ఆశ్చర్యం





సాక్షి, అమరావతి: ప్రపంచంలో ఎత్తైన ప్రదేశం ఏదంటే.. వెంటనే గుర్తొచ్చేది మౌంట్ ఎవరెస్ట్. ఇది దాదాపు 5.49 మైళ్లు (29,035 అడుగులు) అంటే 8.84 కిలోమీటర్లు పొడవు ఉంటుంది. కానీ, భూమిపైన అత్యంత లోతైనా ప్రదేశం గురించి ఎప్పుడైనా విన్నారా? అదే.. మరియానా ట్రెంచ్. ఇది సముద్రంలో లోతైన భాగం. దాదాపు 7 మైళ్ల లోతులో (36,201 అడుగులు/11 కిలోమీటర్లు) ఉంది. ఈ మరియానా ట్రెంచ్ దిగువన ఎవరెస్ట్ పర్వతాన్ని ఉంచితే సముద్ర మట్టానికి 7వేల అడుగుల లోతుకు వెళ్లితే గానీ శిఖరం కనిపించదు. ఇలాంటి లోతైన ప్రదేశంలో జీవం మనుగడ సాగించడం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల సముద్ర ఉపరితలానికి సుమారు 5 మైళ్ల లోతులో (27,349 అడుగులు), 800–1000 రెట్లు ఎక్కువ పీడనం కలిగిన ప్రదేశంలో ఒక చేపను గుర్తించారు. ఇప్పటివరకు అత్యంత లోతులో జీవిస్తున్న సముద్రపు జీవిగా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ చేపకు శాస్త్రీయ నామం లేనప్పటికీ 'నత్త చేప'గా పిలుస్తున్నారు. దీనిని జపాన్‌కు దక్షిణంగా ఉన్న ఇజు–ఒగాసవారా ట్రెంచ్‌లోని లోతైన సముద్ర ప్రాంతంలో కనుగొన్నారు. ఇక్కడ 'హడల్ జోన్'గా పిలిచే ప్రాంతంలో ఎరతో పాటు కెమెరాను సముద్ర జలాల్లోకి దించిన తర్వాత ఈ జీవి కదలికలను రికార్డు చేశారు. సముద్రాల్లోనే అత్యంత లోతైన ట్రెంచ్ ప్రాంతంలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం, టోక్యో వర్సిటీ ఆఫ్ మెరైన్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తల బృందం పరిశోధన చేస్తోంది.

పీడనాన్ని తట్టుకునే శరీర నిర్మాణం

సాధారణంగా లోతైన సముద్ర చేపలు చిన్నవిగా ఉంటాయి. ఇవి నెమ్మదిగా జీవిస్తాయి. అతిగా తినడానికి, వేటాడేందుకు ఇష్టపడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా ఒకజీవి పదివేల అడుగుల లోతుల్లోకి వెళితే.. ఆ జీవుల కణాల్లోని సూక్ష్మప్రొటీన్లు బలహీనపడి అస్థిరంగా మారతాయి. కానీ, నత్త చేప ట్రిమెథైలమైన్ ఎన్ ఆక్సైడ్ అనే ఒక రసాయనాన్ని విడుదల చేయడ, దాని శరీరం పొలుసులుగా కాకుండా జెల్లీగా ఉండటంతో తీవ్రమైన శరీర ఒత్తిడిని తట్టుకుంటోందని భావిస్తున్నారు. లోతులేని నీటిలో ఉన్న చేపలు తేలేందుకు గ్యాస్ బ్లాడర్‌ను ఉపయోగిస్తాయి. అయితే నత్త చేపలకు ఆ అవయవం లేకపోవడంతోనే ఎక్కువ లోతుల్లో జీవించగలుగుతున్నాయని గుర్తించారు. నత్త చేపలు చీకటిలో ప్రకాశించే లక్షణాన్ని కలిగి ఉంటాయి. ఫలితంగా చీకటిగా ఉండే హడల్ జోన్లలో సైతం ఇతర జీవులను ఆకర్షించి వేటాడి ఆహారంగా తీసుకుంటాయి. వీటికి పెద్ద నోరు, పొట్ట ఉండటంతో అందుబాటులో ఉన్నప్పుడే ఎక్కువ ఆహారాన్ని కడుపులో వేసుకుంటాయి.

హడల్ జోన్ అంటే..

సముద్రాల్లో ఆరు కిలోమీటర్ల కంటే ఎక్కువ లోతులో ఉండే ప్రాంతాన్ని 'హడల్ జోన్'గా పిలుస్తారు. సముద్ర గర్భంలో మనకు తెలియని ఎన్నో లోతైన కందకాలు ఉన్నాయి. భూమిలోని టెక్టోనిక్ ప్లేట్ల కదలికల ద్వారా ఇవి ఏర్పడ్డాయి. ఇవి సముద్ర మట్టానికి 11 కి.మీ. దిగువన విస్తరించి ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీటిలోకి సూర్యరశ్మి ఏమాత్రం సోకదు. అతి శీతల పరిస్థితులు నెలకొని ఉంటాయి. ఇలాంటి హడల్ జోన్లో జీవం మనుగడ కష్టమనే భావన ఉంది.

తెగిన రైల్వే ఓహెచ్ లైన్

విద్యుత్‌కు అంతరాయం • 2 గంటలు ఆలస్యమైన పలు రైళ్లు

మనుబోలు: గూడ్స్ రైలులో రవాణా చేస్తున్న పందులు.. పోట్లాటకు దిగడంతో బోగి పైనుంచి ఎగిరి ఓహెచ్ విద్యుత్ తీగలపై పడడంతో అవి తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి పలు రైళ్లు నిలిచిపోయాయి. ఈ ఘటన గురువారం రాత్రి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు పరిధిలోని చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపంలోని 143/1–8 కిలోమీటరు వద్ద డౌన్‌లైన్‌లో చోటుచేసుకుంది. రైల్వే సిబ్బంది వివరాల మేరకు గూడూరు వైపు నుంచి గూడ్స్ రైల్లో విజయవాడ వైపు పందులను తరలిస్తున్నారు. అయితే ఓ బోగిలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మనుబోలు సమీపంలో పందులు ఒక దానితో ఒకటి పోట్లాటకు దిగాయి. ఈ క్రమంలో ఓ పంది ఎగిరి ఓహెచ్ లైన్‌పై పడడంతో అది తెగిపోయి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో రాత్రి 10:30 నుంచి 12:30 గంటల వరకు రెండు గంటలపాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. తిరుమల ఎక్స్‌ప్రెస్, బెంగళూరు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం స్పెషల్ ఫేర్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

మూడు నెలలు నల్లమల వైపు చూడొద్దు

పర్యాటకులకు వన్యప్రాణి విభాగం డీడీ విగ్నేష్ అప్పావ్ వినతి

మార్కాపురం/ శ్రీశైలం: నల్లమల అటవీ ప్రాంతంలో జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు పర్యాటక ప్రదేశాల్లోకి పర్యాటకుల సందర్శనను నిలిపేస్తూ ఢిల్లీలోని జాతీయ పెద్దపులుల సంరక్షణ సంస్థ ఆదేశాలిచ్చిందని మార్కాపురం వన్యప్రాణి విభాగం డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావ్ శుక్రవారం తెలిపారు. వన్యప్రాణుల సంయోగ సమయం (గర్భం దాల్చే కాలం) గా పరిగణిస్తూ నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్టు, శ్రీశైలం పులుల అభయారణ్యంలో ఉన్న ఇష్టకామేశ్వరి అమ్మవారి దేవాలయం, జంగిల్ సఫారీ, నెక్కంటి జంగిల్‌రైడ్‌తోపాటు పలు పర్యాటక ప్రదేశాల్లోకి సందర్శకుల అనుమతిని నిరాకరిస్తున్నట్లు తెలిపారు. అడవిలోనికి ఎవరూ వెళ్లకుండా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చట్టాన్ని అతిక్రమించి అడవుల్లోకి వెళ్లినవారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972, ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం 1967, జీవ వైవిధ్య చట్టం 2002 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై శాకంబరీదేవి ఉత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ
- అమ్మవారికి కూరగాయలతో అలంకరణ


శాకంబరీ అలంకరణ కోసం సిద్ధం చేస్తున్న కూరగాయలు, నిమ్మకాయలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపైగల శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో శనివారం నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థానం చేపట్టింది. అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ప్రధాన ఆలయం, ఉపాలయాలు, ఆలయ పరిసరాలను ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో అలంకరిస్తారు. అమ్మవారి ఆలయ అలంకరణ నిమిత్తం అవసరమైన కూరగాయల దండలను భక్తులు, భక్త బృందాలు, సేవకులు సిద్ధం చేస్తున్నారు. దాతలు, రైతులు, వ్యాపారుల నుంచి సేకరించిన కూరగాయలు, పండ్లను మహా మండపం ఆరో అంతస్తుకు చేర్చారు. శుక్రవారం ఉదయం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, పాలక మండలి సభ్యులచే కూరగాయలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఉత్సవాల ఏర్పాట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. శాకంబరీదేవి ఉత్సవాలు శని, ఆది, సోమవారాలు రావడంతో మూడు రోజుల్లో రెండు లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు చెప్పారు. కాగా, అమ్మవారి సన్నిధిలో జరిగే శాకంబరీదేవి ఉత్సవాల్లో ప్రత్యేకంగా కదంబం ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలను ఉపయోగించి ఈ ప్రసాదాన్ని తయారు చేస్తారు.

జాతీయ స్థాయి రెఫరల్ ఆస్పత్రిగా 'బర్డ్'

ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టీ జాతీయ సమ్మిట్ ప్రారంభ సభలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి



తిరుపతి తుడా: ప్రపంచస్థాయి వసతులతో అభివృద్ధి చేసిన బర్డ్ ఆస్పత్రి దేశంలోని అనేక క్లిష్టమైన సర్జరీలకు రెఫరల్ ఆస్పత్రిగా తయారైందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుపతిలో శుక్రవారం బర్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 3 రోజుల జాతీయ స్థాయి ఆర్థో ప్లాస్టీ సదస్సును ఆయన ప్రారంభించారు. దేశంలో ఇలాంటి సమ్మిట్‌లు అరుదుగా జరుగుతాయని, అందులో కూడా 10 నుంచి 12 దాకా మాత్రమే లైవ్ సర్జరీలు చేస్తారని చెప్పారు. బర్డ్ ఆధ్వర్యంలో తొలిసారి నిర్వహిస్తోన్న సమ్మిట్‌లోనే 22 లైవ్ సర్జరీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. దేశంలో పేరొందిన టాప్ 20 ఆర్థో సర్జన్లు ఇక్కడికి వచ్చి సర్జరీలు చేస్తున్నారని తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొన్న సర్జన్లు కూడా బర్డ్‌లో పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇలా ఉచిత సేవ చేయడానికి ముందుకు వచ్చే వైద్యులకు వసతి, రవాణా, భోజనం, శ్రీవారి దర్శనం ఉచితంగా కల్పిస్తామన్నారు. సమ్మిట్ నిర్వహిస్తోన్న బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్ బృందాన్ని అభినందించారు.

చంద్రబాబు జీవితం అబద్ధాల మయం

- జీవితంలో నిజం చెప్పని మనిషి చంద్రబాబు
- జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు/నెల్లూరు (దర్గామిట్ట): ప్రతిపక్షనేత చంద్రబాబు జీవితం అబద్ధాల మయమని, ఆయన జీవితంలో ఎప్పుడూ నిజాలు చెప్పని వ్యక్తి అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఏ మంచి జరిగినా దాన్ని తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు అలవాటన్నారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ సంస్థను తాను తీసుకురావడం వల్లే సత్య నాదెళ్ల సీఈవోగా ఎదిగారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 1992లో సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్‌లో చేరారని, అప్పటికి చంద్రబాబు ముఖ్యమంత్రి కాలేదని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబు, సత్య నాదెళ్ల గురించి మాట్లాడిన అబద్ధాల వీడియోను సమావేశంలో చూపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోని సంపూర్ణంగా, సమగ్రంగా అమలు చేస్తున్నారని, అందులో ఏదేని చిన్నపాటి లోపాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొని లబ్ధిచేకూరని వారికోసం, అలాగే ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2.23 లక్షల కోట్లు రాష్ట్ర అభివృద్ధికి ఖర్చుచేశామని, ఇంకా ఏవైనా సమస్యలుంటే నూరుశాతం పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా కృషిచేస్తున్నారని తెలిపారు.

ప్రజలను నమ్మించి వంచన

జాతీయ రహదారి వేయమని అప్పటి ప్రధాని వాజ్‌పేయికి తాను చెప్పడం వల్లే నిర్మాణం జరిగిందని చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడితే దానిపైన కూడా చంద్రబాబు విమర్శలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు అధికారం కోసం 600 వాగ్దానాలు చేశారని, అందులో 10 శాతం కూడా అమలు చేయలేదని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధికలిగేలా తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను అమలు చేస్తున్నారని, ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ నవరత్నాల పథకాలను ప్రజలకు పక్కాగా అందిస్తున్నారని చెప్పారు. కుప్పంలోగానీ, టెక్కలిలోగానీ ప్రజల వద్దకు వెళ్లి చంద్రబాబు హయాంలో మేలు జరిగిందో, జగన్ పాలనలో మేలు జరిగిందో తెలుసుకుందాం రమ్మంటూ చంద్రబాబు, అచ్చెన్నాయుడులకు సవాలు చేశారు. లోకేశ్ పాదయాత్రకు జనం లేక పోర్టులో పనిచేసే కూలీలు పనిముగించుకుని ఇంటికెళ్లే సమయంలో వాళ్లని పాదయాత్రకు రావాలని బతిమాలుకుంటున్నారని చెప్పా రు. నియోజకవర్గంలోని మోమిడి గ్రామానికి 800 మీటర్లు నడవలేక వెళ్లలేదా.. లేకపోతే అక్కడ తనకు ఆదరణ లేదని అడ్డదారులు తొక్కాడా అని మంత్రి ప్రశ్నించారు.

ఆర్‌బీకేల ద్వారా సమృద్ధిగా ఎరువులు

రాష్ట్రంలో 10,778 ఆర్బీకే (రైతుభరోసా కేంద్రం)ల ద్వారా ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు సకాలంలో అందజేస్తున్నట్లు కాకాణి చెప్పారు. ఖరీఫ్– 2023లో ఎరువుల సరఫరాపై శుక్రవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి మాన్సుక్ మాండవీయ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకాణి పాల్గొన్నారు.

ఈజీ మనీ కోసం..

- పారిశ్రామికవేత్తను కిడ్నాప్ చేసిన ఆయన మాజీ డ్రైవర్
- రూ.4 కోట్లు తీసుకుని వదిలేసిన దుండగులు
- 11 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- నంద్యాల జిల్లాలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి...



బొమ్మలసత్రం(నంద్యాల): సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఓ కారు డ్రైవర్ ఏకంగా తన మాజీ యజమానితోపాటు ఆయన కుమారుడిని కిడ్నాప్ చేశాడు. రూ.4 కోట్లు తీసుకుని వారిని వదిలేశాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి కిడ్నాపర్లను పట్టుకున్నారు. నంద్యాల జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసు వివరాలను ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. బనగానపల్లి పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త వినాయకరెడ్డి వద్ద కొంతకాలం కిందట అనంతపురం జిల్లా పెద్దవడుగూరుకు చెందిన నరేష్ డ్రైవర్‌గా పనిచేశాడు. నరేష్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో అతనిని వినాయకరెడ్డి పని నుంచి తొలగించారు. దీంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు వినాయకరెడ్డిని కిడ్నాప్ చేయాలని నరేష్ నిర్ణయించుకున్నాడు. కర్ణాటకలోని కోలార్‌లో ఉన్న సురేష్, శ్రీనివాస్, ఖలందర్, అజయ్, విజయ్, భార్గవ్, ప్రభు, ప్రకాష్, రంజిత్ అనంతపురం జిల్లాకు చెందిన రవికుమార్, రంజిత్‌కుమార్‌లతో కలిసి కిడ్నాప్‌నకు పథకం రచించాడు. అందరూ కలిసి జూన్ 3న బనగానపల్లిలో రెక్కీ నిర్వహించారు. ఐదో తేదీ ఉదయం బనగానపల్లి నుంచి బేతంచర్లకు వినాయకరెడ్డితోపాటు ఆయన కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి డ్రైవర్‌తో కలిసి బయలుదేరారు. కిడ్నాపర్లు నాలుగు కార్లలో వినాయకరెడ్డి కారును వెంబడించి సీతారామాపురంమెట్ట వద్ద అడ్డగించారు. కత్తి చూపించి కారులో ఉన్న భరత్‌కుమార్ రెడ్డి, వినాయకరెడ్డిని కిందకు దించారు. వారిని కిడ్నాపర్లు తమ కారులో ఎక్కిస్తుండగా డ్రైవర్ సాయినాథ్‌రెడ్డి అడ్డుపడ్డాడు. దీంతో అతడ్ని కూడా కారులో ఎక్కించి తీసుకువెళ్లారు. ఆ తర్వాత వినాయకరెడ్డి తండ్రి నాగిరెడ్డికి ఫోన్ చేసి రూ.4 కోట్లు ఇవ్వాలని, లేదంటే అందరినీ చంపేస్తామని బెదిరించారు. భయపడిన నాగిరెడ్డి బంధువుల వద్ద డబ్బు తీసుకుని మొదట అనంతపురం జిల్లా కొత్తపల్లి వద్ద రూ.2 కోట్లు.. ఆ తర్వాత కర్ణాటకలోని కోలార్ వద్ద మరో రూ.2 కోట్లను కిడ్నాపర్లకు ఇచ్చారు. డబ్బు అందిన తర్వాత కిడ్నాపర్లు 7వ తేదీన కర్ణాటకలో వారి ముగ్గురిని విడిచిపెట్టారు. ఇంతలో ఆందోళనకు గురైన నాగిరెడ్డి... కిడ్నాపర్లు డబ్బు తీసుకుని కూడా తన కుమారుడు, మనవడిని విడిచిపెట్టలేదని బేతంచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే సమయంలో కిడ్నాపైన ముగ్గురూ ఇంటికి చేరుకున్నారు. కిడ్నాపర్ల కోసం పోలీసులు గాలించి శుక్రవారం గుత్తి పట్టణంలో 11 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.40 లక్షల నగదు, కత్తి, 3 సెల్‌ఫోన్‌లు, 4 కార్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు నరేష్, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

1,013 మంది బాల కార్మికులకు స్వేచ్ఛ

- సీఐడీ పోలీసులను అభినందించిన బాలల హక్కుల పరిరక్షణ సంస్థ చైర్మన్

సాక్షి, అమరావతి: ఆపరేషన్ స్వేచ్ఛ ద్వారా రాష్ట్రంలో బాల కార్మికులకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిస్తున్న సీఐడీ పోలీసులను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంస్థ చైర్మన్ కేసలి అప్పారావు అభినందించారు. వెట్టి చాకిరీ నుంచి 1,,013 మంది బాల కార్మికులను విడిపించడం ముదావహమని అన్నారు. రాష్ట్ర సీఐడీ పోలీసులు ఫిబ్రవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్ –1లో 285 మంది పిల్లలను బాల కార్మిక వ్యవస్థ నుంచి రక్షించింది. జూన్ నెలలో నిర్వహించిన ఫేజ్ –2 లో 728 మంది పిల్లలను బాల కార్మిక వ్యవస్థ నుంచి కాపాడారు. వీరిలో 654 మంది బాలురు కాగా 74 మంది బాలికలు ఉన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గుంటూరు సీఐడీ కార్యాలయంలో జరిగిన ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్–2 ముగింపు సమావేశంలో అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన సీఐడీ మహిళా సంరక్షణ విభాగం ఎస్పీ కేజీవీ సరితను ఆయన అభినందించారు. బాల కార్మికులకు విముక్తి కల్పించడంలో సహకరించిన ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సరిత సత్కరించారు. కార్మికశాఖ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, డిప్యూటీ కమిషనర్ ఎ.గణేష్, సమగ్ర శిక్ష కన్సల్టెంట్ గీత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

గరళకంఠునికి సహస్ర ఘటాభిషేకం

పిఠాపురం: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ పంచాయతీలోని ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గరళకంఠునికి శుక్రవారం సహస్ర ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన మహిళలు స్థానిక చెరువు నుంచి బిందెలతో నీరు తీసుకు రాగా, అర్చకులు స్వామివారికి అభిషేకం చేశారు. గర్భగుడిలోని శివలింగం నీటిలో పూర్తిగా మునిగిపోయింది. జలదిగ్బంధంలో ఉన్న స్వామి వారికి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ నీరు తొలగించిన తర్వాత ప్రత్యేక అభిషేకాలు చేసి స్వామివారిని విశేషంగా అలంకరించారు.

జీవన ఎరువుల ప్రయోగశాల

నెల్లూరులో తొలి కేంద్రం

- రూ.1.40 కోట్లతో భవనాలు
- రూ.76.50 లక్షలతో పరికరాలు
- వ్యవసాయ శాఖ పర్యవేక్షణ
- ఇప్పటి వరకు వందలాది పరీక్షలు
- కల్తీ ఎరువుల బారి నుంచి రైతన్నల రక్షణకు జగన్ సర్కార్ చర్యలు



నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జీవన, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాల


జీవన ఎరువులను పరీక్షించే యంత్రం



రైతులు పండించే పంటకు ఎరువుల వాడకం ఎంతో కీలకం. వాటిలో జీవన ఎరువులపై రైతులు ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. వాటిని వివిధ కంపెనీలు అనేక విధాలుగా తయారు చేస్తాయి. అసలు ఈ జీవన ఎరువులు అంటే ఏమిటి.. వాటిని ఎన్ని అంశాల్లో పరీక్షిస్తారు.. ఉండాల్సిన లక్షణాలు ఏమిటి.. ఎక్కడ తయారు చేస్తారో తదితర వివరాలను క్లుప్తంగా తెలుసుకుందాం.

సాక్షి, నెల్లూరు డెస్క్ : భూ మండలంలో సంచరించే జీవుల మనుగడ వాటి శరీరంలో ఉండే సూక్ష్మజీవుల (మైక్రోబ్స్) పైనే ఆధారపడి ఉంటుందనేది శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైన వాస్తవం. మైక్రోబ్స్ ఆయా జీవుల్లో వాటి శరీర పరిమాణాన్ని బట్టి లక్షలు/కోట్లలో ఉంటాయి. ఒక నిర్దిష్టమైన రేషియోలో వాటి సంఖ్య పెరుగుతుంటే.. అదే సమయంలో ఆ స్థాయి నిష్పత్తిలో మరికొన్ని అంతరించిపోతుంటాయి. ఈ మైక్రోబ్స్ ప్రాణి బతకడానికి అవసరమైన న్యూట్రియంట్స్‌ను అందిస్తాయి. ఇవి ప్రాణులకు ఎంత ముఖ్యమో మొక్కలకూ అంతే అవసరం.

మొక్కల ఎదుగుదలకు

సాధారణంగా రైతులు పొలంలోని పైరు ఎదుగుదల కోసం రసాయన ఎరువులను వాడుతుంటారు. అందులో నత్రజని, పొటాషియం, భాస్వరం వంటి పదార్థాలుంటాయి. వాటిని అవసరమైన మేరకే మొక్కలకు వాడాలి. మోతాదు మించితే పైరుకు నష్టం కలుగుతుంది. మరోవైపు ఈ రసాయన ఎరువులు విపరీతంగా వాడటంతో భూమి నిస్సారం అవుతోంది. మ్యూకస్ తగ్గిపోయి జీవం కోల్పోతోంది. దీంతో దాదాపు రెండు దశాబ్దాల నుంచి శాస్త్రవేత్తలు జీవన ఎరువులపై దృష్టి సారించారు. ధరణికి హాని చేయని జీవన ఎరువుల తయారీని ప్రోత్సహిస్తున్నారు.

ఏమిటీ జీవన ఎరువులు

జీవన ఎరువు అంటే మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు అందించే ఒక రకమైన మంచి బ్యాక్టీరియాతో కూడిన ద్రవ లేదా మొత్తని పదార్థం. ప్రస్తుతం ఈ జీవన ఎరువులను అనేక కంపెనీలు తయారు చేస్తున్నాయి. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటున్నాయి. అయితే వాటిలో నిర్ణీత మోతాదులో లివింగ్ ఆర్గానిజమ్స్ ఉంటున్నాయా? మైకోరిజాల్ ఫంగీ, బ్లూ–గ్రీన్ అల్గే, బ్యాక్టీరియా తగినంతగా ఉంటున్నాయా? తదితర అంశాలపై రైతులకు కలిగే ఇలాంటి సందేహాలను నివృత్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కల్తీ జీవన ఎరువుల బారి నుంచి రైతన్నలను కాపాడేందుకు చర్యలు తీసుకుంది.

జీవన ఎరువుల ప్రయోగశాల


దుకాణాల్లో రైతులకు విక్రయించే జీవన ఎరువులు నాణ్యమైనవో కాదో నిర్ధారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరులో జీవన, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. రూ.1.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాలలో అధునాతన పరికరాలు సమకూర్చారు. మండల స్థాయిలో అధికారులు సేకరిస్తున్న శాంపిళ్లను రీజినల్ సెంటర్ల (అమరావతి, తిరుపతి, విశాఖ, తాడేపల్లిగూడెం)కు మొదటగా పంపుతారు. అక్కడి నుంచి వాటిని డీకోడ్ చేసి నెల్లూరులోని ప్రయోగశాలకు పంపుతున్నారు. ఇక్కడి ల్యాబ్‌లలో ఆ శాంపిళ్లను వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహించి అవి నాణ్యమైనవో కాదో తెలియజేస్తున్నారు. వీరిచ్చే నివేదిక ఆధారంగా ఒకవేళ అవి సరిగా లేకుంటే వాటిని విక్రయించే లేదా తయారీదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

రూ.1.40 కోట్లతో భవనాలు

నెల్లూరులో జీవన ఎరువుల నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని 2017లోనే అధికారులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపారు. ఇక్కడ ప్రయోగశాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన) పథకం కింద రూ.1.40 కోట్లు కేటాయించింది. దీంతోపాటు ప్రయోగశాలలో పరికరాల కోనుగోలుకు ఎన్ఎంఎస్ఏ (నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్) కింద మరో రూ.76.50 లక్షలు కేటాయించింది. కేంద్రం నిధులు కేటాయించడంతో వ్యవసాయ శాఖ భవనాల్లోనే పరికరాలను ఏర్పాటు చేసి జీవన ఎరువులను పరీక్షిస్తున్నారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఓ కార్యాలయంలో 12 సెంట్ల స్థలాన్ని భవన నిర్మాణానికి కేటాయించింది. ఈ ఏడాది భవనాల నిర్మాణం పూర్తి కావడంతో ఏప్రిల్‌లో ఈ ప్రయోగశాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు.

ఏ పరీక్షలు చేస్తారంటే?

నెల్లూరులోని ప్రయోగశాలలో జీవన ఎరువులైన రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, మైకోరైజా, పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా వంటి వాటిలో నాణ్యతా నిర్ధారణ పరీక్షలు చేస్తారు. సేంద్రియ ఎరువులైన వర్మీ కంపోస్టు, ఆర్గానిక్ మెన్యూర్, డీ ఆయిల్ కేక్స్ అయిన వేపచెక్క, ఆముదం చెక్కల నాణ్యతను కూడా నిర్ధారిస్తారు. వివిధ శాంపిళ్లు ఈ ప్రయోగశాలకు రాగానే వాటిని స్టెరిలైజేషన్ చేసిన వస్తువుల్లో ఉంచి వాటిని యంత్రాల్లో 24 గంటల పాటు పరీక్షిస్తారు. బీఓడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) ఎంత మేరకు ఉందో తెలుసుకుంటారు. అనంతరం వాటిలో పీహెచ్ (ఉదజన సూచిక), ఈసీ (ఎలక్ట్రికల్ కండక్టవిటీ), సేంద్రియ కర్బనం, నత్రజని, పొటాషియం, భాస్వరం, హెవీ మెటల్స్ ఎంతెంత స్థాయిలో ఉన్నాయో ల్యాబ్‌ల్లో పరీక్షించి తెలుసుకుంటారు.


ప్రయోగశాలలోని పరికరాలు

ఎన్ని శాంపిళ్లను పరీక్షించారంటే..

ఇక్కడ ప్రయోగశాలను ఏర్పాటు చేశాక ఇప్పటి వరకు 307 జీవన ఎరువులు, 330 సేంద్రియ ఎరువులు, 10 డీ ఆయిల్ కేక్స్‌ల నాణ్యతను పరీక్షించారు. క్వాలిటీ ఉన్నవి, లేనివి సర్టిఫై చేసి వాటిని ఆయా రీజినల్ సెంటర్లకు పంపుతున్నారు. నాణ్యత లేదని నిర్ధారణ అయితే.. వాటిని విక్రయించిన దుకాణాలు, తయారీదారులపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది. ఇలా జీవన ఎరువుల్లో నాణ్యత నిర్ధారణ చేపట్టి రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ముదావహం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943